



www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
16-06-2024

సంపుటి : 01 | సంచిక : 43 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


## ఏ క్షణంలోనైనా ప్రభుత్వం పడిపోవచ్చు

- మోడీకి మరోసారి అవకాశం లేదు
- కానీ ప్రభుత్వం పడిపోవాలని కోరుకోవడం లేదు
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సంచలన వ్యాఖ్యలు



9

## కేసీఆర్ జైలుకెళ్లడం పక్కా..

- ఆయన్ని దేవుడు కూడా కాపాడలేడు..
- ఇప్పటికే ఆయన కూతురు కవిత జైల్లో ఉన్నది
- త్వరలో బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాబోతోంది
- మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



2

## కలెక్టర్లకు స్థానచలనం

### తెలంగాణలో భారీగా 20 మంది ఐఏఎస్‌ల బదిలీలు

- సీనియర్ కలెక్టర్లు వెయిటింగ్‌లో..
- సెక్రెటేరియట్‌లో ఆరుగురికి పదోన్నతులు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి



2



## చంద్రబాబు యాక్షన్.. రేవంత్ రియాక్షన్

హైదరాబాద్ లోటస్ పాండ్ ఇంటిపై ఫోకస్

మాజీ సీఎం జగన్ సెక్యూరిటీ గదుల కూల్చివేత

ఐదేళ్లుగా ఉన్న నిర్మాణం నేలమట్టం

జేసీబీతో తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు

రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని ఫిర్యాదులు రావడంతోనే..

విశ్వంభర, బంజారహిల్స్ : ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి అప్పుడే కష్టాలు మొదలయ్యాయి. అధికారం కోల్పోయి పట్టుమని పదిరోజులు కాకముందే చిక్కులు చుట్టుముడుతున్నాయి. అటు ఏపీలోనే కాదు.. ఇటు తెలంగాణలోనూ జగన్‌కు సమస్యలు తప్పేలా లేవు. అక్కడ చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మూడు రోజులకే తెలంగాణలో జగన్‌కు రియాక్షన్ మొదలైంది. తెలంగాణలో సీఎంగా బాబు ప్రియశిష్యుడు రేవంత్ రెడ్డే ఉండటంతో మిగతా2లో...

“జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్‌ను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుబట్టారు. విద్యుత్ కొనుగోళ్లపై వివరణ కోరితే అటు రేవంత్ సర్కారును, ఇటు విచారణ కమిషన్‌పై ఆయన ఆక్రోషాన్ని వెల్లగక్కారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ విచారణ జరుపుతోంది. జూన్ 15లోగా విచారణకు హాజరయ్యి వివరణ ఇవ్వవలసిందిగా కమిషన్ నోటీస్ పంపించింది. కానీ కేసీఆర్ ఆ నోటీసును పట్టించుకోకపోగా, కమిషన్ బాధ్యతల నుంచి మీరే తప్పకుంటే మంచిదంటూ ఘాటుగా లేఖ రాశారు.



# వార్నింగా.. ఫ్రస్టేషనా

## మీదే తప్పు.. తప్పుకోండి!

### జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్‌పై కేసీఆర్ ఫైర్

### నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ చర్యలు

మీ దురుద్దేశం ఏంటో నాకు అర్థం అయింది

ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యలే..

విద్యుత్ కొనుగోలులో నిబంధనలు పాటించాం

విచారణ పూర్తి కాకముందే జడ్జిమెంట్ ఇస్తారా..?

మీడియా సమావేశాల్లో నా పేరు వాడి అగౌరవపరిచారు

కమిషన్ ముందు నేను ఏం చెప్పినా ప్రయోజనం ఉండదు

జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్‌కు కేసీఆర్ 12 పేజీల ఘాటు లేఖ




**విశ్వంభర, హైదరాబాద్:**

జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు లేఖ రాసిన గులాబీ అధినేత.. తనపై రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్ ఏర్పాటు చేశారని, నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ వ్యవహరించిందంటూ సమాధానం ఇచ్చారు. విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ కోరిన వివరణకు కేసీఆర్ వ్యాఖ్యలు అగౌరపరిచాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకోమన్న వ్యాఖ్యలు.. ఆయన చేసిన తప్పులను కప్పిపుచ్చేలా ఉన్నాయంటున్నారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా.. అప్పుడు అధికారంలో ఉన్నా కమిషన్‌తో ఆయన వ్యవహరించిన తీరు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్ ఇష్యూ, గొర్రెల పంపిణీ అవకతవకలు బయటపడుతున్నాయి. పదేళ్లలో బీఆర్ఎస్ మిగతా3లో...

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్ కౌంటర్

8 మంది మావోయిస్టులు, ఒక సైనికుడు మృతి

ఆగని కాల్పులు.. వరుస ఎన్ కౌంటర్లు



2

## కేసీఆర్ ఎంతకైనా తెగిస్తారు


- కమిషన్ చైర్మన్‌ను బెదిరించడం ధిక్కారమే..
- తప్పు ఉంటే కోర్టుకు వెళ్లొచ్చు కదా..?
- జస్టిస్ నరసింహారెడ్డిని తప్పు పట్టడం కరెక్ట్ కాదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్



2

## పెట్రోల్, డీజిల్ ధరలు వడ్డన

- లీటరుపై 3 రూపాయలు పెంపు
- తక్షణమే అమల్లోకి వస్తుందన్న సర్కార్



3

### మాకేం తెలియదు..

## అంతా కేసీఆరే చేశారు!?

- మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణానికి అనువైన స్థలంగా సూచించారు
- కానీ ఆ నివేదికలపై సీఎం, మంత్రి సంతకం చేయలేదు
- జస్టిస్ పీసీ ఘోష్ ఎదుట విశ్రాంత ఇంజనీర్లు వివరణ

2

## ప్రజారోగ్యంపై సీఎం ఫోకస్

### ఖాళీల భర్తీపై రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ

- 531 సివిల్ అసిస్టెంట్ సర్జన్, 193 ల్యాబ్ టెక్నీషియన్, 31 స్టాఫ్ నర్సుల భర్తీకి రంగం సిద్ధం
- త్వరలోనే నోటిఫికేషన్ల జారీ
- సీజనల్ వ్యాధులను అరికట్టే దిశగా చర్యలు



2

## కమలం దళపతి ఎవరు?



### బీజేపీ జాతీయ కమిటీలో సమూల మార్పులు

రాష్ట్రం నుంచి ఎవరెవరికి ప్రాధాన్యత ..?

డీకే అరుణకు రాష్ట్ర పార్టీ పగ్గాలు ఇస్తారా...?

లక్ష్మణ్‌కు జాతీయ కమిటీలో కీలక పోస్ట్ పక్కానా..?

టీ బీజేపీలో చర్చాంశనీయమైన పదవుల భర్తీ అంశం

**విశ్వంభర, హైదరాబాద్ :**

కేంద్రంలో మోడీ 3.0 ప్రభుత్వం ఏర్పడింది. కేబినెట్ కూర్పు అయిపోయింది. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో పలు రాష్ట్రాలకు చెందిన సీనియర్ నాయకులు, ఎంపీలుగా గెలిచి లోక్ సభలో అడుగుపెట్టారు. వారిలో కొందరిని మంత్రులుగా, సహాయ మంత్రులను నియమించారు. ఈ నేపథ్యంలో బీజేపీ జాతీయ, రాష్ట్ర కమిటీలు పూర్తిగా మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో జాతీయ, మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 139 | ₹ 161 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹233 | ₹266 |

## మాజీ సీఎం కేసీఆర్ మిస్సింగ్



- ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమానం
- మోసం చేయడం, అధికారం కోసం ఆరాటమే నైజం
- మూడు సార్లు గెలిచి గజ్వేల్‌కు రాలే
- సొంత నియోజకవర్గంలో వెలిసిన పోస్టర్లు

3

## మళ్లీ దొరల పాలన వచ్చింది

- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవరి భూమి వారికే అన్నారు
- ఇప్పుడీ సర్కారు ఉన్నప్పటికీ ఏం జరుగుతోంది..?
- 10 రోజుల్లో పరిష్కరించకపోతే ఆమరణ దీక్ష చేస్తా
- రేవంత్ రెడ్డి సర్కార్‌కు వీహెచ్ వార్నింగ్

2

## టీమిండియా, కెనడా మధ్య మ్యాచ్ రద్దు

- టాస్ పడకుండానే రద్దైన మ్యాచ్
- ఆటంకం కలిగించిన వర్షం

11

## కేసీఆర్ జైలుకెళ్లడం పక్కా..

**విశ్వంభర, యాదాద్రి :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబ సభ్యులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. యాదాద్రి జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తప్పు చేశారు కాబట్టే ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉన్నారని తెలిపారు. యాదాద్రి పవర్ ప్లాంట్ విషయంలో కేసీఆర్ జైలుకు జైలుకు వెళ్తారని, ఆయనను దేవుడు కూడా కాపాడలేడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. కేసీఆర్ అక్రమ సంపాదన అంతా ఆయన ఎనిమిది మంది అక్కాచెల్లెళ్లకు పంచారని ఆరోపించారు. కేవలం 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నాగారంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి బంగ్లా కట్టారని తెలిపారు. తాను ఆరు సార్లు గెలిచినప్పటికీ సొంత ఇల్లు కట్టుకోలేదని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జూన్ తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఉండదని తాను ముందే చెప్పానని తెలిపారు. బీజేపీలో బీఆర్ఎస్‌ని విలీనం చేద్దామని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ చేస్తుంటే కేసీఆర్ వ్యతిరేకించడం హాస్యాస్పదమని తెలిపారు. అవినీతి చేస్తే వదిలేయాలా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ చేసి అవినీతి చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథలలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్య గురించి పట్టించుకోలేదన్నారు. కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును గాలికి వదిలేశారని విమర్శించారు. కేసీఆర్ దక్షిణ తెలంగాణను చిన్న చూపు చూశారన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలుచుకోలేకపోయిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తాము ఆగస్ట్ 15 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు.

## ప్రజారోగ్యంపై సీఎం ఫోకస్

**హైదరాబాద్:** ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆసుపత్రులు, విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై దృష్టిసారించింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చుతున్నారు. ప్రతి వర్షాకాలం రాష్ట్రంలో డెంగీ, ఇతర విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీంతో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ల విడుదలకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) సివిల్ అసిస్టెంట్ సర్జన్ల కొరత ఎక్కువగా ఉంది. సమస్యను అధిగమించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకుగానూ సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులు 531 భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు (ఎంహెచ్ఎస్ ఆర్‌బీ) త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనుంది. నియామకాల అనంతరం ఆయా పీహెచ్‌సీల్లోని డిమాండ్‌కు అనుగుణంగా సర్జన్లను నియమించనున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 193 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి తెలంగాణ వైద్య విధాన పరిషత్ త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనుంది. అలాగే, వివిధ ఆసుపత్రుల్లో రోగులకు సేవలు అందించే స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు 31 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి ఎంహెచ్ఎస్ ఆర్‌బీ నోటిఫికేషన్ జారీ చేయనుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్ కౌంటర్..

### 8 మంది మావోయిస్టులు, ఒక సైనికుడు మృతి

### ఆగని కాల్పులు.. వరుస ఎన్ కౌంటర్లు



**విశ్వంభర, ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి నక్సలైట్లు, పోలీసులకు మధ్య భీకరంగా ఎదురు కాల్పులు జరిగాయి. నారాయణపూర్‌లోని అబుజ్మద్ ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మవోయిస్టులు, ఒక జవాన్ మరణించారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. అబుజ్మద్‌లో నక్సలైట్లపై కొనసాగుతున్న ఆపరేషన్‌లో భద్రతా బలగాలు ఎనిమిది మంది నక్సలైట్లను హతమార్చాయని పోలీసు అధికారులు తెలిపారు. ఒక సైనికుడు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు జవాన్లు గాయపడ్డారని వివరించారు.

**ఆగని కాల్పులు.. వరుస ఎన్ కౌంటర్లు**

ఛత్తీస్‌గడ్‌లో పోలీసులుమావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్లు ఇప్పట్లో ఆగే పరిస్థితి పరిస్థితి కనిపించడం లేదు. కొన్నాళ్లుగా నక్సలైట్లు..పోలీసు బలగాల మధ్య నువ్వానేనా అన్నట్లుగా కాల్పులు జరుగుతున్నాయి. లేటెస్ట్‌గా నారాయణ్‌పూర్ జిల్లాలోని కుతుల్, ఫరస్ భేడ, దంతెవాడ, కొడతమెట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఓ జవాను కూడా ప్రాణాలు కోల్పోవడంతో పాటు మరో ఇద్దరికి గాయాలు అయినట్లు తెలుస్తోంది. కాల్పుల తీవ్రతను బట్టి చూస్తే భారీగానే మావోయిస్టులు చనిపోయి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

**రెండు నెలల్లో వంద మంది హతం**

ఛత్తీస్‌గడ్ ఇప్పుడు వరుస ఎన్‌కౌంటర్లతో హాట్ టాపిక్ అవుతోంది. గత రెండు నెలల వ్యవధిలోనే అబూజ్‌మడ్ అడవుల్లో వరుసగా భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. నక్సలైట్ల ఏరివేతే లక్ష్యంగా జరుగుతోన్న ఆపరేషన్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని నాలుగు జిల్లాలకు చెందిన రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ ఏడాది మార్చి 14న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 79 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఇదే ఏడాది మార్చి 27న బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు నక్సలైట్లు చనిపోయారు. ఏప్రిల్ 2న బీజాపూర్‌లోని గంగలూరు ఎన్‌కౌంటర్‌లో 13 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్ 16న కంకేర్‌లో 29 మంది నక్సలైట్లు నేలకొరిగారు. ఏప్రిల్ 30న అబూజ్‌మడ్‌లోని టెక్‌మెటాలో 10 మంది మావోయిస్టులు చనిపోయారు. మే 10న బీజాపూర్ జిల్లాలోని పీడియాలో 12 మంది నక్సలైట్లు హతమయ్యారు. ఇలా ఈ మూడు నెలల్లోనే వందమంది వరకు మావోయిస్టులు హతమై ఉంటారన్న అంచనాలున్నాయి.

**వ్యూహం.. ప్రతి వ్యూహం**

మావోయిస్టుల ఏరివేత పేరుతో అడవుల్లో బలగాల మోహరింపు.. దానికి కౌంటర్‌గా పోలీసులే లక్ష్యంగా మందుపాతరలతో నక్సల్స్ ప్రతివ్యూహాలతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో టెన్షన్ పరిస్థితులు కొనసాగుతున్నాయి. మావోయిస్టులు పెట్టిన మందుపాతరలకు గిరిజనులు బలవుతున్నారు. మావోయిస్టులకు కంచుకోటగా ఉన్న అబూజ్‌మడ్ అడవులను చుట్టుముట్టాయి బలగాలు. గడిచిన ఆరు నెలల్లో 11 ఎన్‌కౌంటర్లలో 119 మంది మావోయిస్టులు చనిపోయారు. 2019 నుంచి వరుస ఎన్‌కౌంటర్లతో బలం కోల్పోతుంది మావోయిస్టు పార్టీ. ప్రతీ ఎన్‌కౌంటర్‌లో పదుల సంఖ్యలో మావోయిస్టులు హతమవుతుండటంతో.. ఉక్కిరిబిక్కిరి అవుతోంది పార్టీ. ఎన్‌కౌంటర్లలో మావోయిస్ట్ అగ్రనేతలు ప్రాణాలు కోల్పోతుండటం వారికి మరింత ఆందోళన కలిగిస్తుంది.

**కేంద్ర హోంశాఖ లెక్కల ప్రకారం..**

2019లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 65మంది మావోయిస్టులు చనిపోయారు. 2020లో 36మంది, 2021లో 47మంది, 2022లో 30మంది, 2023లో 24మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 2024లో ఇప్పటివరకు 120మంది వరకు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతం అయ్యారని లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర హోంశాఖ లెక్కల ప్రకారమే అబూజ్‌మడ్ అడవుల్లో 450మంది మావోయిస్టులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇవి రెండేళ్ల కిందటి లెక్కలు. ఈ రెండు మూడేళ్లలో దాదాపు 350మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కేంద్ర హోంశాఖ అంచనాల ప్రకారం ఇంకో 150 మంది మావోయిస్టులే ఉన్నట్లు లెక్క. ఆ 150 మందిలో ఉన్నదంతా మావోయిస్ట్ పార్టీ టాప్ లీడర్లేనన్న ప్రచారం ఉంది. వాళ్ళు కూడా అనారోగ్య సమస్యలు, వయస్సురీత్యా ఇబ్బంది పడుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంచనాలతో త్వరలోనే సమూలంగా మావోయిస్టుల ఏరివేత పూర్తి చేస్తామని భద్రతాబలగాలు అంటున్నాయి.

# కమలం సారథి ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కమిటీల్లో తెలంగాణకు చెందిన మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, సీనియర్ నేతలు లక్ష్మణ్, డీకే అరుణ తదితరులు ఉన్నారు. మరోవైపు జేపీ నడ్డా కేంద్ర మంత్రివర్గంలో చేరడంతో పార్టీకి కొత్త జాతీయ అధ్యక్షుడు వస్తారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పార్టీ కొత్త కమిటీలను పార్టీ సంస్థాగత ఎన్నికలు అయ్యాక వస్తారా..? లేక ముందే వస్తారా..? అనే దానిపై ఇంకా క్లారిటీ లేదు.. అయితే పార్టీ వర్గాలు మాత్రం త్వరలోనే జాతీయ కార్యవర్గంలో కొత్త అధ్యక్షుడిని ఎంపిక జరుగుతుందంటున్నారు. ఒకవేళ కొత్త అధ్యక్షుడు వస్తే ప్రస్తుతం ఉన్న జాతీయ కమిటీ కూడా రద్దవుతుందని పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీని ప్రక్షాళన చేసే నేపథ్యంలో కొత్త అధ్యక్షుడు పూర్తిగా కొత్త కమిటీని నియమించుకుంటారు.

**రాష్ట్ర నేతల పరిస్థితి ఏంటి..?**

జాతీయ కమిటీలో డీకే అరుణ ఉపాధ్యక్షురాలిగా, బండి సంజయ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, లక్ష్మణ్ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకవేళ జాతీయ అధ్యక్షుడు మారితే.. వీరి పరిస్థితి ఏంటి..? కొత్త కమిటీలో అవకాశం ఉంటుందా..? ఉండదా...? అనే డిస్కషన్ రాష్ట్ర బీజేపీలో జరుగుతోంది. జాతీయ కార్యవర్గ సభ్యులుగా కొందరు ఉన్నారు. వివిధ మోర్చాల్లో కూడా తెలంగాణ నేతలు ఉన్నారు. లక్ష్మణ్, డీకే అరుణకు మంత్రి పదవులు వస్తాయని ప్రచారం జరిగింది కానీ ఆ అవకాశం




రాలేదు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అయ్యారు. ఆయనకు మళ్లీ పార్టీ పదవి వచ్చే అవకాశం లేదు. బీజేపీ నిబంధనల ప్రకారం పార్టీ పదవిలో మంత్రి పదవిలో రెండు పదవులు ఉండడం కుదరదు.కొత్త కమిటీలో డీకే అరుణ, లక్ష్మణ్‌కు ప్రాధాన్యత ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డీకే అరుణను ప్రస్తుతం ఉన్న ఉపాధ్యక్ష పదవిలో కొనసాగించడమో..? లేక జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించవచ్చని ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర అధ్యక్షురాలిగా కూడా ఆమె రేసులో ఉన్నారనే చర్చ కూడా జరగుతోంది. అయితే రాష్ట్ర అధ్యక్ష పదవి ఆమెకి ఇవ్వని పక్షంలో జాతీయ కమిటీలోకి తీసుకొని ఒకటి రెండు రాష్ట్రాలకు పార్టీ ఇంచార్జి బాధ్యతలు అప్పగించవచ్చనే టాక్ వినిపిస్తోంది.

### లక్ష్మణ్‌కు కీలక పదవి దక్కేనా..?

లక్ష్మణ్ గతంలో బీజేపీ జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. ఇప్పుడు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. మళ్లీ ఆయనకు పార్టీ పదవి ఇవ్వొచ్చని తెలుస్తోంది. జాతీయ ప్రధాన కార్యదర్శినో, లేక జాతీయ ఉపాధ్యక్షుడిగానో ఆయనకు బాధ్యతలు అప్పగించవచ్చని పార్టీలో గుసగుసలాడుకుంటున్నారు. పార్లమెంటరీ బోర్డు మెంబర్‌గా కూడా లక్ష్మణ్ కొనసాగుతున్నారు. లక్ష్మణ్ ఉత్తర ప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తెలంగాణలో సీనియర్ నేతగా ఉన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గంలో అవకాశం వస్తుందని ఆశించారు ఆయన.. కానీ అవకాశం దక్కలేదు. అయితే ఈసారి జాతీయస్థాయిలో లక్ష్మణ్‌కు పార్టీ పదవి దక్కుతుందని బీజేపీ వర్గాలు లెక్కలు వేస్తున్నాయి. మొత్తానికి జాతీయ నాయకత్వం తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తుండడంతో ఖచ్చితంగా పార్టీ పరంగా రాష్ట్రానికి జాతీయ పదవులు దక్కుతాయని అంచనా వేస్తున్నారు. తెలంగాణకు జాతీయ స్థాయిలో ఎన్ని పదవులు వరించబోతున్నాయో ఏ ఏ పదవులు వరించబోతున్నాయనేది వేచి చూడాల్సిందే.

# కలెక్టర్లకు స్థానచలనం

**విశ్వంభర, హైదరాబాద్:** ఊహించినట్లే రాష్ట్రంలో మరోసారి భారీగా అధికారుల బదిలీలు జరిగాయి. ఎన్నికల క్రతువు కూడా ముగియడంతో పాలనకు వేళయింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు దాదాపు ఏడు నెలల్లో మూడు నెలల పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండడంతో పెద్దగా ప్రభుత్వ కార్యకలాపాలు సాగలేదు. సంక్షేమ పథకాలూ ఆశించిన స్థాయిలో అమలు కాలేదు. గురువారంతో కోడ్ ముగియడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు శనివారం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేశారు. మొత్తం 20 మంది అధికారులు బదిలీ అయ్యారు. ఇందులో ఎక్కువగా కలెక్టర్లు ఉండగా.. ఆయా జిల్లాలకు నూతన కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తంగా తాజాగా బదిలీలతో ఆయా జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియామకం జరిగింది.

**సీనియర్లకు వెయిటింగ్**

బదిలీ అయిన కలెక్టర్లలో వి.పి.గౌతమ్, పి.ఉదయ్ కుమార్, పమేలా సత్పతి, భవేష్ మిశ్రా, యస్మీన్ బాషా, జి.రవి, హరిచందన దాసరి, ఎస్.వెంకటరావు, తిరుపతికి ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. త్వరలో మరికొందరు కలెక్టర్లు సహా రాష్ట్రస్థాయి సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీలు కూడా త్వరలో జరగనున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో



భారీగా బదిలీలు జరిగాయి. ఆరు నెలల పనితీరుతో పాటు వివిధ పరిస్థితులు, సమీకరణలతో మరోసారి భారీగా ఐఏఎస్, ఐపీఎస్ ల బదిలీలు చేపట్టింది. ఎన్నికల నిబంధనలకు మేరకు బదిలీ చేసిన అన్ని శాఖల్లోని వివిధ స్థాయి ఉద్యోగులకు త్వరలో పెద్ద ఎత్తున స్థాన చలనం జరగనుంది.

**సెక్రెటేరియట్‌లో పదోన్నతులు**

రాష్ట్ర సచివాలయంలో ఆరుగురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సహాయ కార్యదర్శులకు (అసిస్టెంట్ సెక్రటరీలకు) ఉప కార్యదర్శులు (డీఎస్‌లు)గా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారిని గిరిజన సంక్షేమం, రోడ్లు, భవనాలు, పురపాలక, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల్లో కేటాయించింది.

**బదిలీ అయిన కలెక్టర్లు వీరే**

| | |
|---|---|
| ఖమ్మం | ముజామిల్ ఖాన్ |
| నాగర్‌కర్నూల్ | సంతోష్ |
| భూపాలపల్లి | రాహుల్‌శర్మ |
| కరీంనగర్ | అనురాగ్ జయంతి |
| పెద్దపల్లి | కోయ శ్రీహర్ |
| జగిత్యాల | సత్యప్రసాద్ |
| మంచిర్యాల | కుమార్ దీపక్ |
| మహబూబ్‌నగర్ | విజయేంద్ర |
| హనుమకొండ | ప్రావీణ్య |
| నారాయణపేట | సిక్తా పట్నాయక్ |
| సిరిసిల్ల | సందీప్‌కుమార్ ఝా |
| కామారెడ్డి | ఆశిష్ సంగ్వాన్ |
| భద్రాద్రి కొత్తగూడెం | జితేష్ వి పాటిల్ |
| వికారాబాద్ | ప్రతీక్ జైన్ |
| నల్గొండ | నారాయణరెడ్డి |
| వనపర్తి | ఆదర్శ్ సురభి |
| సూర్యాపేట | తేజస్ నందలాల్ పవార్ |
| వరంగల్ | సత్య శారదాదేవి |
| ములుగు | దివాకరా |
| నిర్మల్ | అభిలాష అభినవ్ |

# చంద్రబాబు యాక్షన్.. రేవంత్ రియాక్షన్

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబుకు జగన్‌ను ఇరకాటంలో పెట్టడానికి సులువే. దీనినే ఉపయోగించుకోని శనివారం జగన్‌పై సమస్యలను ఎక్కుపెట్టినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. లోటస్ పాండ్‌లో ఐదేళ్లుగా రోడ్డుకు అడ్డంరాని నిర్మాణం హఠత్తుగా తొలగించడం దీనికి సంకేతమేనని చెప్పకనే చెబుతున్నారు.

**ఇంతకు ఏం జరిగిందంటే..**

ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శనివారం ఊహించని షాకిచ్చింది. హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని జగన్ ఇంటి ముందున్న పోలీసు సెక్యూరిటి నిర్మాణాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) కూల్చేసింది. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం లోటస్ పాండ్ ఇంటికి ఎదురుగా సెక్యూరిటి సిబ్బంది ఉండేందుకు నిర్మాణాలు చేశారు. జగన్ లోటస్ పాండ్ కు వచ్చినా రాకపోయినా పోలీసు సెక్యూరిటి అయితే తప్పదు కాబట్టి భద్రతాసిబ్బంది ఆ నిర్మాణాల్లోనే ఉండేవారు. ఈమధ్యనే జరిగిన ఎన్నికల్లో జగన్ ఓడిపోయిన విషయం తెలిసిందే. జగన్ అమరావతిలోనే ఉన్నా హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ కు వచ్చినా పెద్దగా తేడా ఉండదని జీహెచ్ఎంసీ అధికారులు అనుకున్నట్లున్నారు. అందుకనే శనివారం ఉదయం జగన్ ఇంటిముందున్న పోలీసు సెక్యూరిటి నిర్మాణాలను తొలగించేశారు. విచిత్రం ఏమిటంటే సదరు నిర్మాణాలు తమకు అడ్డంగా ఉన్నాయని స్థానికులు జీహెచ్ఎంసీకి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిర్మాణాలను తొలగించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. పైగా ఈ నిర్మాణాలు



### ఐదేళ్లుగా అడ్డం రాలేదా..?

విచిత్రం ఏమిటంటే ఇవే నిర్మాణాలు ఐదేళ్ళుగా అక్కడే ఉన్నాయి. అప్పుడెవరూ ఈ నిర్మాణాలు తమకు అడ్డుగా ఉన్నాయని జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయలేదా ? అన్న డౌట్ వస్తోంది. పోనీ ఇపుడు కూడా జగనే అధికారంలో ఉండుంటే ఈ నిర్మాణాలను రేవంత్ ప్రభుత్వం తొలగించేదేనా ? ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే అధికారం కోల్పోతే పరిస్థితులు ఎలాగుంటాయనేందుకు ఈ తొలగింపే తాజా ఉదాహరణ. జీహెచ్ఎంసీ ప్లానింగ్ అధికారులు నిర్మాణాలను తొలగిస్తున్నపుడు జగన్ తాలూకు ఎవరూ అభ్యంతరం చెప్పలేదట. అయినా ముఖ్యమంత్రి పదవే పోయిన తర్వాత ఈ అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ కూల్చేయటాన్ని జగన్ పట్టించుకుంటారా ? ఇంకా ముందు ముందు ఇలాంటివాటిని మరెన్నింటిని జగన్ చూడాల్సొస్తుందో ?

కూడా అక్రమమే అని ఇపుడు అంటున్నారు. జగన్ భద్రత కోసం అప్పట్లో రోడ్డును ఆక్రమించి సెక్యూరిటి నిర్మాణాలను చేసుకున్నట్లు అధికారులు చెప్పారు.

## మాకేం తెలియదు.. అంతా కేసీఆరే చేశారు..!?

- మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణానికి అనువైన స్థలంగా సూచించారు
- కానీ ఆ నివేదికలపై సీఎం, మంత్రి సంతకం చేయలేదు
- జస్టిస్ పీసీ ఘోష్ ఎదుట విశ్రాంత ఇంజినీర్లు వివరణ

**విశ్వంభర, హైదరాబాద్ :** మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దూకుడు పెంచింది. కాళేశ్వరంతో ముడిపడి ఉన్న ప్రతి ఒక్కరిపై విచారించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు సైతం నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసింది. ఈ క్రమంలో ఆనాడు ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన విశ్రాంత ఇంజినీర్లను శనివారం విచారించింది. అయితే ఆనకట్ట నిర్మాణానికి మేడిగడ్డ అనువైన స్థలంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారని విశ్రాంత ఇంజినీర్లు విచారణ కమిషన్ జస్టిస్ పీసీ ఘోష్ ముందు చెప్పినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ శనివారం విశ్రాంత ఇంజినీర్లతో సమావేశమయ్యారు. 2015లో గోదావరి జలాలపై తాము ఇచ్చిన నివేదిక, సంబంధిత అంశాలను విశ్రాంత ఇంజినీర్ల కమిటీ సభ్యులు కమిషన్‌కు వివరించారు. నివేదికలోని అన్ని అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాణహిత చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలతో పాటు గోదావరి జలాల లభ్యత, కేంద్ర జల సంఘం పరిశీలనలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఆనకట్ట నిర్మాణానికి అనువైన స్థలంగా మేడిగడ్డను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారని విశ్రాంత ఇంజినీర్లు కమిషన్ ముందు చెప్పినట్లు తెలిసింది. తమ నివేదికపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి, అధికారులు సంతకాలు చేయలేదని కూడా వారు పేర్కొన్నట్లు సమాచారం.

## మళ్లీ దొరల పాలన వచ్చింది

**విశ్వంభర, నాంపల్లి:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు సంచలన కామెంట్స్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పాలనలో పేదల భూములు తిరిగి దొరలకు ఇచ్చారని చెప్పారు. ఇందిరా గాంధీ హయాంలో మాదిగలకు 94 ఎకరాల భూమిని 10 మందికి ప్రభుత్వం కీసరలో ఇచ్చిందని వీహెచ్ తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు రావడంతో రాగి కృష్ణారెడ్డి దురుద్దేశంతో సంతకాలు ఫోర్జరి చేసి పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. ఇప్పుడీ ప్రభుత్వం ఏ చర్యలూ తీసుకోవడంలేదని తెలిపారు. ఆ భూముల్లో వెంటనే పనులు ఆపేయాలని వీహెచ్ అన్నారు. పేదలు భూములు కోల్పోతే, మరోవైపు అక్కడ విల్లాలు కడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే ఎవరి భూమి వారికే అన్నారని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పటికీ ఏం జరుగుతోందని నిలదీశారు. ఇది వందల కోట్ల రూపాయల కుంభకోణమని వీహెచ్ అన్నారు. తెలంగాణలో దొరల పాలన మళ్లీ వచ్చిందని చెప్పారు. ఇప్పుడైనా రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని అన్నారు. 10 రోజుల్లో దీనిని ప్రభుత్వం తేల్చకపోతే ఆ భూమిలోనే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు.

## కేసీఆర్ ఎంతకైనా తెగిస్తారు

**విశ్వంభర, హైదరాబాద్:** విద్యుత్ కొనుగోళ్ల అంశంపై జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు మాజీ సీఎం కేసీఆర్ లేఖ రాయడం తెలిసిందే. తమపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కమిషన్ వేశారని, తనపై కమిషన్ చైర్మన్ ఇష్టం వచ్చినట్టు నోరుపారేసుకున్నారని కేసీఆర్ ఆరోపించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన తనకు ఆ వ్యాఖ్యలు బాధ కలిగించాయని తెలిపారు. కాగా, కేసీఆర్ లేఖపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. అసలు, ఆ కమిషన్ ఏర్పాటే తప్పు అనుకుంటే కోర్టుకు వెళ్లొచ్చు కదా అని అన్నారు. కమిషన్ చైర్మన్‌నే వైదొలగాలని బెదిరించడం ధిక్కారం కిందకే వస్తుందని తెలిపారు. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ చట్టబద్ధంగా ఏర్పాటైందని, అటువంటి కమిషన్‌ను తప్పుబట్టడం కేసీఆర్‌కు సరికాదని హితవు పలికారు. తెలంగాణ ఉద్యమ వేళ జస్టిస్ నరసింహారెడ్డి ధైర్య సాహసాలను, నిబద్ధతను కొనియాడిన కేసీఆర్... ఇవాళ ఆయననే తప్పుబడుతున్నారని బండి సంజయ్ విమర్శించారు. కోర్టు పరిధిలో ఉన్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఇష్టంవచ్చినట్టు మాట్లాడి న్యాయస్థానంతో చీవాట్లు తిన్న కేసీఆర్... తన తప్పులు, అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ఎంతకైనా తెగిస్తారని ధ్వజమెత్తారు.



# వార్నింగా.. ప్రస్టేషనా!

(మొదటి పేజీ తరువాయి)
హయాంలో చేసిన కుంభకోణాలు బయటపడుతుండటంతో ఆయన ప్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారా లేదా విద్యుత్ కొనుగోళ్లలో కూడా ఏమైనా అవకతవకలు జరిగాయా అనే విభిన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

**విద్యుత్ విజయాలు సాధిస్తే శ్వేతపత్రం విడుదల చేశారు**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఉన్న విద్యుత్ పరిస్థితులు, ప్రజల ఇబ్బందులు, ప్రభుత్వ ఆలోచనలు, నిర్ణయాలకు గల కారణాలు సహా అనేక అంశాలను కేసీఆర్ లేఖలో ప్రస్తావించారు. అన్ని రకాల చట్టాలు, నిబంధనలు పాటిస్తూ కేంద్రం నుంచి అనుమతులు తీసుకొని ముందుకెళ్లామని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ గొప్ప విద్యుత్ విజయాలను సాధించిన దురుద్దేశాలను ఆపాదిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాసనసభలో శ్వేతపత్రాలను విడుదల చేసిందని మండిపడ్డారు. ఈఆర్సీ సంస్థలు వెలువరించిన తీర్పులపై విచారణ కమిషన్లు వేయకూడదన్న కనీస ఇంగితాన్ని కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోల్పోయిందన్నారు. కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని ప్రభుత్వానికి సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విచారకరమని ఆరోపించారు. చట్టవిరుద్ధంగా విచారణ ప్రారంభించి, విషయాలను సమగ్రంగా పరిశీలించకుండా పలు అసంబద్ధ వ్యాఖ్యలు చేయడాన్నిఆక్షేపిస్తూ అభ్యంతరాలు తెలుపుతున్నట్లు కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.

**అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తారా..?**
అసాధారణ పరిస్థితుల్లో కొన్ని అసాధారణ నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. 2017 వరకు సబ్ క్రిటికల్ విద్యుత్ కేంద్రాలపై ఎలాంటి ఆంక్షలు లేవన్న వాస్తవాన్ని విస్మరించారని చెప్పారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏదో తప్పు చేసిందనే విధంగా వ్యాఖ్యలు చేసి దురుద్దేశాలను ఆపాదించారని, విచారణార్హతను కోల్పోయారు కావున బాధ్యతల నుంచి విరమించుకోవాలని కేసీఆర్ సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించడం తమ పార్టీ విధానమని కేసీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్‌కు నామినేషన్‌పై పనులు ఇచ్చి



నట్లు సమర్థించుకున్నారు. అత్యంత తీవ్ర కరెంట్ సంక్షోభంలో చిక్కుకున్న తెలంగాణను బయటపడేయాలంటే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సంస్థలతో పీపీఏ చేసుకోవడం, దాని ద్వారా పీజీసీఐఎల్ వద్ద కారిడార్ బుక్ చేసుకోవడం తప్ప మరో మార్గం లేకపోయిందని అన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోకుకండా మార్వా నుంచి విద్యుత్ కొనుగులులో వ్యవహారాన్ని తప్పు పట్టేలా ప్లాంటే లేదన్నట్లు వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఆశించిన మేర కరెంట్ సరఫరా కాకపోవడంతో రెండో వెయ్యి మెగావాట్ల కారిడార్‌ను రద్దు చేసినట్లు కేసీఆర్ తెలిపారు. దాంతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలకు ఎలాంటి ఆర్థిక నష్టం వాటిల్లలేదని కేసీఆర్ వివరించారు. ప్రజల అవస్థలు పరిగణనలోకి తీసుకొని అప్పటి ప్రభుత్వ చర్యలను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాల్లో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకోకుండా న్యాయ ప్రాధికార సంస్థలపై కూడా వ్యాఖ్యానాలు చేయడం విచారకరమని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఛత్తీస్‌గఢ్‌తో మూడు రూపాయల 90 పైసలకే యూనిట్ కరెంట్ కొంటే అది ఎక్కువ ధర ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణ హెవీ కాస్ట్ పే చేయాల్సి వచ్చిందని ఎలా వ్యాఖ్యానిస్తారని అడిగారు. విద్యుత్ కేంద్రాలను ఎక్కడ స్థాపించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమని అన్నారు.

**జస్టిస్ నరసింహారెడ్డి స్వచ్ఛందంగా వైదొలగాలి**
లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో వ్యవధి అడిగితే దయదలిచి ఇచ్చినట్లు మాట్లాడడం బాధ కలిగించిందన్నారు. విచారణ పవిత్ర బాధ్యత అని అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశీలించి, పూర్తి నిర్ధారణకు వచ్చిన తర్వాత డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌తో బాధ్యులకు మాత్రమే నివేదిక ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదిక ఇవ్వాలన్న అభిప్రాయంతోనే మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఇప్పటికే తప్పు జరిగిపోయినట్లు ఆ తప్పు వల్ల జరిగిన ఆర్థిక నష్టాన్ని లెక్కించడం మాత్రమే మిగిలి ఉందనట్లు మాట్లాడుతున్నారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా కమిషన్ తీరు ఉంది. విచారణ పూర్తి కాకముందే తీర్పు ప్రకటించినట్లు మాటలున్నాయి. విచారణలో నిష్పాక్షికత ఎంత మాత్రం కనిపించడం లేదు. కమిషన్ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదు. విచారణ కమిషన్ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలని జస్టిస్ నరసింహారెడ్డి విజ్ఞప్తి చేస్తున్నానని కేసీఆర్ లేఖ రాశారు.

**బీఆర్ఎస్‌పై బురద చల్లేందుకు కమిషన్**
కమీషన్ విధివిధానాల్లో లేని అంశాలపై కూడా మాట్లాడటం పరిధి దాటి వ్యవహరించడం, గత ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే ధోరణికి నిదర్శనమని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డగా జస్టిస్ నరసింహారెడ్డికి అప్పటి విద్యుత్ కోతల పరిస్థితి తెలుసని, చీకటి రోజుల గతాన్ని వెలుగు జిలుగుల భవిష్యత్తుగా మారడానికి అప్పటి ప్రభుత్వం ఏం చేసిందో చూశారని కేసీఆర్ తెలిపారు. రాజకీయ కక్షతో నన్ను, అప్పటి మా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ కమిషన్ ఏర్పాటు చేసిందని మండిపడ్డారు. లోక్ సభ ఎన్నికల తర్వాత జూన్ 15లోగా నా అభిప్రాయాలు సమర్పించాలని అనుకున్నానని అయితే, విచారణ పూర్తి కాకముందే సంప్రదాయాలకు విరుద్ధంగా మీడియా సమావేశంలో తన పేరు ప్రస్తావించారని కేసీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.



## డిప్యూటీ సీఎంకు రేవంత్ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భట్టివిక్రమార్కతో కలిసి తాను ఉన్న ఫొటోను ట్వీట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 'రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, ఆర్థిక, విద్యుత్ శాఖామాత్యులు భట్టివిక్రమార్క గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భగవంతుడు ఆయురారోగ్యాలు, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానం'టూ ట్వీట్ చేశారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. 'హృదయపూర్వక ధన్యవాదాలు సీఎం గారు... సదా కృతజ్ఞుడను' అని సీఎం ట్వీట్‌కు స్పందించారు. మల్లు భట్టివిక్రమార్క పుట్టినరోజు సందర్భంగా మల్లు రవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## 'మళ్లీ పార్టీలోకి వస్తే తీసుకోం'

- రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే పోరాటం
- ఎన్డీఏ కూటమి ఎంతకాలం ఉంటుందో చూద్దాం
- మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే



**విశ్వంభర, మహారాష్ట్ర:** మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను వీడిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకోబోనని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శనివారం ఆ కూటమి నేతలు సమావేశమయ్యారు. ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్, కూటమిలోని ఇతర సీనియర్ నేతలతో పాటు ఉద్ధవ్ ఠాక్రే కూడా మీడియాతో మాట్లాడారు. ఏక్‌నాథ్ షిండే శిబిరంలోని శివసేన నాయకులను వెనక్కి తీసుకునే అవకాశాన్ని ఆయన తోసిపుచ్చారు. తానను విడిచిపెట్టిన వారిని పార్టీలోకి తిరిగి తీసుకోనని స్పష్టం చేశారు. సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికి ఈ మేరకు మెసేజ్ ఇచ్చారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రతిపక్ష కూటమి కలిసి పోటీ చేస్తుందని ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తమ పోరాటమని చెప్పారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం మాదిరిగా మారిందని అన్నారు. ఈ ప్రభుత్వం ఎంత కాలం కొనసాగుతుందో చూడాలని వ్యాఖ్యానించారు. తమ ఎంవీఏ ప్రభుత్వాన్ని మూడు చక్రాల రిక్షాగా దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారని, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పరిస్థితి కూడా అలాగే ఉందని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు.

## ట్రైనీ ఐఏఎస్‌గా కూతురు.. సెల్యూట్ చేసిన ఎస్పీ ర్యాంక్ తండ్రి



**విశ్వంభర, గచ్చిబౌలి:** తెలంగాణ రాష్ట్రానికి చెందిన నూకల ఉమాహారతి యూపీఎస్సీ సివిల్స్2022 పరీక్షల్లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించడం తెలిసిందే. ఆమె తండ్రి వెంకటేశ్వర్లు గతంలో నారాయణపేట జిల్లా ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా, ఉమాహారతి ట్రైనీ ఐఏఎస్ గా తెలంగాణ పోలీస్ అకాడమీకి వచ్చారు. అక్కడ తన కుమార్తెను చూసి ఎస్పీ ర్యాంకు అధికారి అయిన వెంకటేశ్వర్లు గర్వించారు. హృదయం ఉప్పొంగిపోగా, ఆయన తన కుమార్తెకు సెల్యూట్ చేశారు. కుమార్తెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం 8 మంది వ్యక్తులు మృతి

**విశ్వంభర, ఉత్తరాఖండ్:** ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రుద్రప్రయాగ్‌లోని బద్రీనాథ్ హైవే సమీపంలో సుమారు 17 మంది ప్రయాణికులతో ఉన్న టెంపో ట్రావెలర్ లోతైన లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీసు బృందం సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఇప్పటివరకు, గాయపడిన ఇద్దరిని బృందం అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి పంపింది.



## విశ్వనగరం కాస్తా విషాద నగరంగా మారింది

### బాల్క సుమన్



**విశ్వంభర, హైదరాబాద్ :** సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు రెండు కూటముల మధ్య పోటీగానే చూశారని... అందుకే బీఆర్ఎస్‌కు సీట్లు రాలేదని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అన్నారు. ఇటు ఎన్డీయే, అటు ఇండియా కూటములలో లేని పార్టీలను దేశవ్యాప్తంగా ప్రజలు ఆదరించలేదని పేర్కొన్నారు. ఏ కూటమిలో లేని మూడు నాలుగు పార్టీలు లోక్ సభ ఎన్నికల్లో వెనుకబడినట్లు చెప్పారు. ఏపీలో వైసీపీ, ఒడిశాలో బీజేడీ, ఉత్తర ప్రదేశ్‌లో బీఎస్పీ ఏ కూటములలో లేవని... ఆ పార్టీలకు కూడా నిరాశాజనక ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణలోనూ అదే ఫలితం వచ్చినట్లుగా భావిస్తున్నామన్నారు. అయినప్పటికీ ఉద్యమ పార్టీగా, తెలంగాణ తెచ్చిన పార్టీగా ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

**పగ, ప్రతీకార పాలన సాగిస్తున్నారు**
తెలంగాణలో పేరుకే ప్రజాపాలన అంటున్నారని... కానీ పగలతో, ప్రతీకారంతో కూడిన పాలనను సాగిస్తున్నారని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎంతసేపూ కేసీఆర్‌పై విషం, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విద్వేషాన్ని రగిల్చే కుట్ర తప్ప మరొకటి లేదన్నారు. ప్రజలు అవకాశమిచ్చినందుకు ఏం చేద్దామనే ఆలోచన వారికి ఏమాత్రం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసిందని విమర్శించారు. ఇందుకు పాఠ్యపుస్తకాలను వెనక్కి తెప్పించడమే నిదర్శనమన్నారు.

**పాఠ్యపుస్తకాలపై కేసీఆర్ ఫొటో ఉంటే తప్పేంటి..?**
పాఠ్యపుస్తకాలపై నాటి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిల పేర్లు ఉన్నందుకు వాటిని వెనక్కి తీసుకుంటున్నారని మండిపడ్డారు. తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం వచ్చాక స్కూల్ పుస్తకాలపై జయలలిత ఫొటో ఉంటే ఆ ప్రభుత్వం వెనక్కి తీసుకోలేదని గుర్తు చేశారు. ఒకవేళ కేసీఆర్ ఫొటో ఉండటం ఇబ్బందికరమైతే వేసవికాలంలోనే సమీక్ష నిర్వహించవలసి ఉండాల్సిందన్నారు. కానీ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక విద్యార్థుల్ని, పిల్లల్ని ఆందోళనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో పట్టపగలు హత్య జరిగిందని... ఇక రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎక్కడ ఉన్నాయన్నారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్‌లో పసిపాపను తీసుకెళ్లి అత్యాచారం చేశారని, హైదరాబాద్‌లో గంజాయి మూకలు స్వైరవిహారం చేస్తున్నాయని మండిపడ్డారు. హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారన్నారు. గంజాయి మూకల స్వైరవిహారం, హత్యలు, దౌర్జన్యాలు, బెదిరింపులతో రేవంత్ రెడ్డి ఈ విశ్వనగరాన్ని కాస్తా విషాద నగరంగా చేశారని విమర్శించారు.

## మాజీ సీఎం కేసీఆర్ మిస్సింగ్

- ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమానం
- మోసం చేయడం, అధికారం కోసం ఆరాటమే నైజం
- మూడు సార్లు గెలిచి గజ్వేల్‌కు రాలే
- సొంత నియోజకవర్గంలో వేలిసిన పోస్టర్లు






**విశ్వంభర, గజ్వేల్:** మాజీ సీఎం, గులాబీ దళపతి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనబడటం లేదంటూ ఆయన సొంత నియోజకవర్గంలో పోస్టర్లు వెలిశాయి. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, ఇందిరా పార్క్ చౌరస్తా, బస్టాప్, అంబేద్కర్ చౌరస్తా, మున్సిపల్ ఆఫీస్ వద్ద వాల్ పోస్టర్లు అంటించారు. వరుసగా మూడు సార్లు గెలిచి కేసీఆర్ మా నియోజకవర్గానికి రాలేదు. సారు కారు పదహారు అని ఎక్కడ పరారు అయ్యాడో ఎలా ఉన్నాడో తెలియడం లేదు అని, గజ్వేల్ ప్రజలు ఇక్కడ..! కేసీఆర్ ఎక్కడ అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు.

**అర్హతలు: 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి**
పోస్టర్లలో ఈ విధంగా ఉంది. 'పూర్తి పేరు.. కల్వకుంట్ల చంద్రశేఖరరావు, వయస్సు 70 ఏళ్లు, వృత్తి.. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయడం, అధికారం కోసం ఆరాటం, కుటుంబం కోసం పోరాటం, బాధ్యత.. గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ సీఎం, గుర్తులు.. తెల్ల చొక్కా, తెల్ల ప్యాంట్ లేదా తెల్ల లుంగీ, నెత్తి మీద టోపీ, అర్హతలు.. భయంకరమైన హిందువు, 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి, ఎకరాకు కోటి రూపాయలు సంపాదించే వ్యక్తి.. కేసీఆర్ ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమానం ఇవ్వబడును' అంటూ పోస్టర్లలో రాసుకొచ్చారు.

**గజ్వేల్ ప్రజలపై కనికరం లేదా?**
ఈ సందర్భంగా మాట్లాడిన బీజేపీ నేతలు మాట్లాడారు. మల్లన్న సాగర్ బాధితులకు న్యాయం జరగాలన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ ఎక్కడ ఉన్నా గానీ ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. గతంలో సీఎంగా ఉన్నారు కాబట్టి తెలంగాణ కోసం పని చేశారని.. ఇప్పుడు సీఎం పదవి, అధికారం లేదు, ప్రస్తుతం ఒక సామాన్య ఎమ్మెల్యేగా కేసీఆర్ ఉన్న క్రమంలో ఇప్పుడు గజ్వేల్‌కు రావడానికి ఏమైందంటూ బీజేపీ నేతలు ప్రశ్నించారు. గజ్వేల్ ప్రజలపైన కేసీఆర్‌కు ప్రేమ లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో వరుసగా మూడుసార్లు గెలిపించినా కూడా ప్రజలపై కనీస కనికరం లేదా? అని ప్రశ్నించారు. గజ్వేల్‌లో అనేక సమస్యలు ఉన్నాయని, గజ్వేల్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా.. కేసీఆర్ ఎక్కడ ఉన్న గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం సైతం చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

## జులై 7న గోల్కొండ బోనాలతో ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్:** తొలకరి వానలు పడగానే.. అమ్మలగన్న అమ్మలకు బువ్వ పెట్టే ఆచారమే బోనం. ఈ బోనం తొలుత భాగ్యనగరంలో ప్రారంభమై ఆ తర్వాత తెలంగాణ అంతటా విస్తరిస్తుంది. అంగరంగ వైభవంగా జరిగే బోనాల ఉత్సవానికి జంట నగరాలు సిద్ధమవుతున్నాయి. ప్రతి ఏటా ఆషాడ మాసంలో అమావాస్య తర్వాత వచ్చే గురువారం లేదా ఆదివారం గోల్కొండ కోటపై వెలసిన శ్రీఎల్లమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈసారి ఆషాడమాసం జూలై 5న వస్తుంది. తర్వాత వచ్చే జులై 7 నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలి పూజల్ని జగదాంబిక అమ్మతో ప్రారంభించిన తర్వాత మిగతా హైదరాబాద్ అంతా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గోల్కొండ తర్వాతనే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా మహంకాళి ఆలయాల్లో పూజలు జరుగుతాయి. ఆషాడ మాసంలో చివరిరోజున మళ్లీ గోల్కొండ కోటలోనే చివరి బోనం పూజ జరుగుతుంది. దీంతో బోనాల ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి. జూలై 7 నుంచి నెల రోజుల వరకు ప్రతి గురువారం, ఆదివారం బోనాలు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు మూడో వారం అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఇక్కడ జరిగే రంగం వేడుకను తెలంగాణ అంతటా ఆసక్తిగా ఎదురుచూస్తుంది.

## పెట్రోల్, డిజీల్ ధరలు వడ్డన



**విశ్వంభర, బెంగళూరు:** వాహనదారులకు బిగ్ షాక్.. కర్ణాటకలో ఇంధన ధరలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 15న పెట్రోల్, డీజిల్‌పై పన్ను పెంచడంతో ఇంధన ధరలు రూ.3 పెరిగాయి. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని కర్ణాటక ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. నోటిఫికేషన్ ప్రకారం.. కర్ణాటక సేల్స్ ట్యాక్స్ (కేఎస్టీ) పెట్రోల్‌పై 25.92 శాతం నుంచి 29.84 శాతం, డీజిల్‌పై 14.3 శాతం నుండి 18.4 శాతానికి పెరిగింది. పెరిగిన ధర తక్షణమే అమల్లోకి వస్తుందని రాష్ట్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. బెంగళూరులో ప్రస్తుతం లీటరు పెట్రోల్ ధర రూ.99.84గా ఉండగా, డీజిల్ ధర రూ.85.93గా ఉంది. రాష్ట్రంలో పెట్రోలియం ఉత్పత్తులపై విధిస్తున్న అమ్మకపు పన్నును రాష్ట్ర ప్రభుత్వం సవరించడంతో ఇంధన ధర పెరిగిందని పెట్రోలియం డీలర్ల సంఘం పేర్కొంది. బెంగళూరులో లీటరు ధర రూ. 99.84 నుంచి రూ. 102.84కి పెరిగింది. అదే విధంగా డీజిల్ ధర రూ.3.02 పెరగడంతో లీటరు ధర రూ.85.93 నుంచి రూ.88.95కి పెరిగింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇంధన ధరల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంధన ధరల పెంపుతో ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.2,500 నుంచి రూ.2,800 కోట్ల వరకు భారం పడుతుందని ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గ్యారెంటీలకు నిధులకు అదనపు ఆదాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆస్తుల మార్గదర్శక విలువను 15శాతం నుంచి 30 శాతం పెంచింది. భారతీయ నిర్మిత మద్యం (ఐఎంఎల్)పై అదనపు ఎక్సైజ్ సుంకం (ఏఈడీ) అన్ని స్లాబ్‌లపై 20 శాతం, బీర్‌పై ఏఈడీ విధించింది. 175 శాతం నుంచి 185 శాతం వరకు కొత్తగా నమోదు చేసుకున్న రవాణా వాహనాలపై 3 శాతం అదనపు సెస్ విధించారు. రూ. 25 లక్షల కన్నా ఎక్కువ ఉన్న ఈవీలపై(ఎలక్ట్రిక్ వాహనాలు) జీవితకాల పన్నును ప్రవేశపెట్టింది.

## ఉత్పత్తి కులాలను 75 ఏళ్లుగా

# నీచంగా చూస్తారా?



### అసలు విషయానికి వద్దాం

**ప్రభుత్వ పెద్దలారా బీసీలు బిచ్చగాళ్ళు అన్న మాటలు అనాల్సిన సందర్భం.. సమయం ఏర్పడింది. అంటే, బీసీల పరస్థితి మన రాష్ట్రంలో అర్థం చేసుకోవచ్చు. 76 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం అభివృద్ధి పథంలో ప్రయాణిస్తున్నదని త్వరలోనే అభివృద్ధి చెందిన దేశంగా మారనుందంటూ అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్రం గొప్ప అభివృద్ధి సాధించిందని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పకుంటున్నాయి. కానీ ఈ మధ్య రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు చెప్పినట్లు 2029 నాటికి ప్రపంచంలో భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్లతో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినప్పటికీ సంబర పడవలసిన అవసరం లేదు... ఎందుకంటే మన దేశం ఇంకా పేద దేశంగానే మిగలవచ్చు అని అభిప్రాయపడ్డారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న అంశం. ప్రత్యేకంగా తెలంగాణ విషయాలను చూసుకుంటే... కొత్త రాష్ట్రం వస్తే సబ్బండవర్గాల బతుకులు ఏమో బాగుపడతాయి అనుకుంటే సామాజిక న్యాయం జరుగుతుందని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ సమయంలో చెప్తుండేవారు. తెలంగాణ వచ్చి పదేండ్లయింది. గత పాలకులు కేసీఆర్ కుటుంబం తప్ప ఎవ్వరూ బాగుపడలేదు. బడుగుల జీవితాల్లో ఎటువంటి మార్పూ రాలేదు అనేది నగ్నసత్యం.**

భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ. అగ్రవర్ణలలో కొంతమందికి కులాలు అనగానే వాళ్ల కొంపలు మునుగుతాయి అని దృష్టితో చూస్తూ ఉంటారు. 75 సం.గా రిజర్వేషన్లు లేక ఉద్యోగ. విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి ఇంకా బహుజన కులాలు ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. కొంతమంది కుహనా మేధావులు. కుహనఅంటే కపటం. విషయం తెలియక పోయినా లోకం దృష్టిలో మహామేధావులుగా ప్రచారంలో ఉండి, తమ మాటలతో, చర్యలతో ప్రజలను తప్పుదారి పట్టించే వాళ్లు కుహనా మేధావులు. వీరంతా స్వయం ప్రకటిత మేధావులు. వారే అధ్యక్షులు వారే సమాజ సేవకులు. టీవీ ప్రసంగాల్లో పాల్గొంటారు. ఏకపక్షంగా సాగే ప్రసంగాలు వారి సొంతం. నేటి సమాజంలో చోటుచేసుకుంటున్న అస్తవ్యస్థతకు అహంకారంతో విర్రవీగే వారు మాత్రమే తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి అశాంతిని సృష్టిస్తున్నారు. సమాజహితానికి పాటుపడాల్సింది పోయి కాలం చెల్లిన వాదాలను పట్టుకొని వేలాడుతూ.. ఇంకా అదే పడికట్టు పదాలతో విమర్శించడం వల్ల ఒరిగేదేమీ ఉండదని తెలిసినా.. ఇటు వంటి బూజుపట్టిన మెదడు కలిగిన మేధావులు మాత్రమే నోటికొచ్చింది మాట్లాడటం పరిపాటైంది. అందుకే కొందరు వీరిని పేమెంట్లు రాయుళ్ల బ్యాచ్ అని కూడా పిలవటం మనం వింటూనే ఉంటాం. అందరిదీ ఒక దారైతే కొంతమంది మాత్రం అధోగతి దారి ఉంటుంది. ప్రజలను నమ్మించడానికి ఎన్ని అబద్ధాలు అయినా రాయడం మాట్లాడడం వీరికి పరిపాటి ఇక.

గత 10 సంవత్సరాల్లో రాజకీయం రోజు రోజుకూ అప్రజాస్వామికంగా తయారయ్యింది. అందుకే ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా బీసీలు బొంద పెట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేస్తున్న దుస్థితి. వారు బీసీల సంక్షేమానికి బడ్జెట్లో కేటాయిస్తున్న నిధులే నామమాత్రం కాగా, ఆ కేటాయించే నిధుల్లోనూ 10 శాతం కూడా ఖర్చు పెట్టడం లేదు. ఇది సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) తీసుకున్న వివరాలను నేను పంపిన దరఖాస్తులకు అధికారికంగా వచ్చిన సమాధానం వెల్లడించిన నిజం. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగా బీసీ సబ్ ప్లాన్ పకడ్బందీగా చట్టపద్ధతిలో తెస్తారా అని ప్రతిపక్ష శాసన సభ్యులు అడిగినప్పుడు తరువాతి ఫైనాన్షియల్ ఇయర్లో వందశాతం తెస్తామరని చెప్పారు అప్పుడు. తరువాతి ఫైనాన్షియల్ ఇయర్లో బీసీ సప్లైప్లాన్ తెస్తామన్నారు. చట్టం కూడా ఇదే సభలో పాస్ చేస్తామన్నారు. ఇదీ 2017 మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన. ఆయన పది సంవత్సరాలు పాలన చేసిన బీసీలకు చేసింది ఏమీ లేదు. 2017లో ఏర్పాటు చేసిన ఎంబీసీ కార్పొరేషన్ అలంకారప్రాయంగా మారింది. ప్రతీ బడ్జెట్లో రూ.1, 000కోట్లు కేటాయించి ఖర్చు చేయనున్నట్లు డబ్బా కొట్టుకున్న ప్రభుత్వం 201718 నుంచి 202122 వరకు ఎంబీసీ కార్పొరేషన్కు కేటాయించిన బడ్జెటు, జరిగిన ఖర్చుకు పొంతనే లేదని ఆర్టీఐ సమాచారం ద్వారా స్పష్టమౌతోంది. గత నాలుగు బడ్జెట్లలో రూ.3,000 కోట్లు కేటాయించినట్లు కాగితాల్లో కనిపిస్తున్నా.. ఫైనాన్స్ విభాగం ఆమోదం పొందింది రూ.350 కోట్లు మాత్రమే. దానిలో ఖర్చు చేసింది మాత్రం శూన్యమే.

తెలంగాణలో బీసీలకు అభివృద్ధి ఫలాలు అందకుండా చేస్తూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ 'బీసీ ద్రోహి' అవతారమెత్తిన్రు. ఎనిమిదేండ్లలో 5.70 లక్షల మంది బీసీలు స్వయం ఉపాధి లోన్లకు దరఖాస్తు చేసుకుంటే, కేవలం 50 వేల మందికే లోన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మిగిలిన 5.20 లక్షల మంది నేటికీ ఋణాల కోసం కళ్లు కాయలు కాసేల ఎదురు చూస్తున్నారు. ఆర్టీఐ ద్వారా అందిన లెక్కల ప్రకారం ఎంబీసీ లోన్ల కోసం 13,360మంది దరఖాస్తు చేసుకుంటే, 1,419 మంది మాత్రమే ఋణాలు పొందారు. ఎనిమిదేండ్లలో ఎంబీసీ కార్పొరేషన్కి కేటాయించిన బడ్జెట్ రూ.3,305 కోట్లు కాగా, ఖర్చు చేసింది కేవలం రూ.77.46కోట్లు. నాయీ బ్రాహ్మణులకు(మంగలి) మోడ్రన్ సెలూన్లు కట్టిస్తామని, సబ్సిడీపై పరికరాలు ఇప్పిస్తామని చెప్పింద్రు . దేవాలయంలోని కళ్యాణకట్టలో పని చేసే క్షురకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్నరు. తీరా చూస్తే ఆ హామీలన్నిటికీ కేసీఆర్ కత్తెరేశారు. ఆర్టీఐ ద్వారా నాయీ బ్రాహ్మణ సహకార సంఘం ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ఎనిమిదేండ్లలో ప్రభుత్వంవారి కోసం కేటాయించిన బడ్జెట్ రూ.660 కోట్లు, అందులో రూ.186 కోట్లు విడుదల చెయ్యగా, ఖర్చు చేసింది కేవలం రూ.60 కోట్లు, రాష్ట్ర వ్యాప్తంగా 35,651మంది నాయీ బ్రాహ్మణులు లోన్లకు దరఖాస్తు చేసుకుంటే, అందులో 7,375 మందికే లోన్లు ఇచ్చిన్రు. గొల్ల కురుమలను కోటీశ్వరులను చేస్తామని కేసీఆర్ పచ్చి అబద్ధాలమాటలు చెప్పిన్రు. కానీ, గొర్రెల పంపిణీ పథకం మూలకుపడి మూడేండ్లయింది. యూనిట్ల కోసం రూ.31,250 చొప్పున డీడీలు కట్టిన మూడున్నర లక్షల మందికి ఎదురు చూపులే మిగిలినవి. గొర్రెల పంపిణీకి పోయిన బడ్జెట్టులో వెయ్యి కోట్లు, ఈ బడ్జెట్టులో వెయ్యి కోట్లు కేటాయించినా... నయా పైసా విడుదల చెయ్యలే. రాష్ట్రంలో ఉన్న జలాశయాల్లో, చెరువుల్లో ప్రభుత్వమే ఉచితంగా చేపలు పోసి మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామని 2018 మేనిఫెస్టోలో చెప్పిన బీఆర్ఎస్, వాటిని కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టి మోసం చేసింది. ఫలితంగా ముదిరాజు, గంగపుత్ర సోదరులు సరైన ఉపాధి లేక ఆర్థికంగా చితికిపోతున్నారు. కల్లుగీత కార్మికులకు టెక్నాలజీ సాయం అందించి మరణాలను ఆపడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమయ్యింది. ఈ ఎని మిదేండ్లలో 600 మంది గీత కార్మికులు తాటి చెట్ల మీద నుంచి పడి చనిపోయారు. 4 వేల మంది వికలాంగులయిను. ప్రతి గ్రామంలో 5 ఎకరాలు తాటి, ఈత వనాలకు కేటాయిస్తామని చెప్పిన 560 జీవో అమలుకే నోచుకోలే. 50 ఏండ్లు దాటిన గీత కార్మికుల పింఛన్ దరఖాస్తులు నాలుగేండ్లుగా పెండింగులోనే పెట్టిన్రు గౌడన్నలందరూ ప్రభుత్వం ఇస్తనన్న మోటరు సైకిండ్ల కోసం దరఖాస్తు పెట్టుకోగా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఇక ఎనిమిదేండ్లలో సాగర ఉప్పర కార్పొరేషన్ 29.84 కోట్లు కేటాయిస్తే, అందులో ఖర్చు చేసింది 4.43 కోట్లు మాత్రమే. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఆ సామాజిక వర్గానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. టీఆర్ఎస్ నిర్వాకం వల్ల ఆ సామాజిక వర్గం బుక్కెడు బువ్వ కోసం కాంట్రక్టర్ల కింద కూలీలుగా నలిగిపోతూ ఉన్నారు. ఇక 2014 నుంచి ఇప్పటి వరకు వాల్మీకి బోయ కార్పొరేషన్కి రూ.30.46 కోట్లు కేటాయించగా, ఖర్చు చేసింది రూ.5.08 కోట్లు మాత్రమే. రజక సహకార సంఘాల సమాఖ్యకు ఈ ఎనిమిదేళ్లలో 56,850 మంది ఋణాల కోసం దరఖాస్తు చేసుకుంటే, కేవలం 5,720 మందికి చాలీచాలని ఋణాలు ఇచ్చారు. ఈ ఎనిమిదేం డ్లలో రజకుల కోసం మొత్తం రూ.551 కోట్లు కేటాయిస్తే, ఖర్చుపెట్టింది అక్షరాల అరవై కోట్లే, నేతన్నలకు 50శాతం సబ్సిడీపై నూలు, 5లక్షల బీమా, హెల్త్ కార్డులిస్తమని చెప్పినా, ఏవీ అమలు కాలేదు. ఇన్నాళ్లు తిప్పలు పెట్టి, తీరా ఇయ్యాళ గత ఎన్నికల ముందు బీమా ఇస్తామని మొసలి కన్నీరు కార్చింద్రు. బీఆర్ఎస్ అసమర్థ పాలన వల్ల తెలంగాణ వచ్చినప్పుడు 470 సహకార సంఘాలు ఉంటే, అవిప్పుడు 230కి తగ్గినయ్. విశ్వబ్రాహ్మిణ్ కార్పొరేషన్ ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ఎనిమిదేండ్లలో వారికి కేటాయించిన బడ్జెట్ రూ.86 కోట్లు కాగా, ఖర్చు చేసింది కేవలం రూ.28,94కోట్లు, ఇక, గత మూడు బడ్జెట్లలో విశ్వబ్రాహ్మణులకు శూన్య హస్తమే చూపించారు. కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ ఇచ్చిన సమాచారం ప్రకారం గత ఎనిమిదేండ్లలో వారికి కేటాయించిన బడ్జెట్ రూ.55 కోట్లయితే, ఖర్చు చేసింది రూ.12 కోట్లు, భట్రాజ కార్పొరేషన్ పంపించిన సమాచారం ప్రకారం గత ఎనిమిదేండ్లలో భట్రాజ సామాజిక వర్గానికి కేటాయించిన బడ్జెట్ రూ.13.30కోట్లు కాగా, అందులో రూ.95 లక్షలు ఖర్చు చేయడం సిగ్గుచేటు.

**బీసీ సంక్షేమం.సంవత్సరం.కేటాయింపులు.ఖర్చు**

201415లో కేటాయింపు చేసింది రూ.2,020 కోట్లు, ఖర్చు చేసింది రూ.1,090. 201516లోకేటాయింపులు రూ.2,172 కోట్లు. ఖర్చు రూ.1,074 కోట్లు, 201617లో కేటాయింపులు రూ.2,537కోట్లు. ఖర్చు రూ.2,832 కోట్లు, 201718లో కేటాయింపులు రూ.5,070కోట్లు. ఖర్చు రూ.2,856కోట్లు. 201819లోకేటాయింపులు రూ.5,960కోట్లు. ఖర్చు రూ.3,863కోట్లు, 201920లోకేటాయింపులు రూ.4,528కోట్లు. ఖర్చు రూ.3,221కోట్లు, 202021లో కేటాయింపులు రూ.4,356కోట్లు. ఖర్చు రూ.3,023కోట్లు. 202122లో కేటాయింపులు రూ.5,522కోట్లు. ఖర్చు రూ.3,178కోట్లు, 202223లో కేటాయింపులు రూ.5,697కోట్లు. ఖర్చు రూ.3,350కోట్లు మొత్తం.కేటాయింపులు రూ .37,862కోట్లు. ఖర్చు రూ.24,487కోట్లు మాత్రమే. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో తన మేనిఫెస్టోలో ప్రతి సంవత్సరం 5000 కోట్ల రూపాయలు బీసీలలో కేటాయిస్తామని తన మేనిఫెస్టోలో చెప్పింది. వాస్తవానికి పది సంవత్సరాల బడ్జెట్లో 50, 000 కోట్ల రూపాయలు బీసీలకు రావాల్సిన బడ్జెట్, కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్లో ఖర్చు చేసింది2 4,487 ఇంతే....! ఇది బీసీల సంక్షేమం ఎట్లా అయితది..! బీఆర్ఎస్ మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీసీలను మేము అభివృద్ధి చేశాం అంటూ గొప్పలు చెప్పుకొచ్చారు. ఇక కొంత మంది కుహనా మేధావులు రాస్తున్న రాతలు చూస్తుంటే ఆశ్చర్యం అనిపిస్తుంది. స్వామి భక్తి ఉండాలి గాని ఇంతగా ఉండకూడదు. అందుకే తెలంగాణ సమాజం బీసీలంతా ఏకమై కర్రు కాల్చి వాత పెట్టినారు. బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న కేసీఆర్కు స్థానిక సంస్థల్లో ఎందుకు ఓట్లు వెయ్యాలి. ఒక పక్కన ఆగమేఘాలమీద అసెంబ్లీలో ఆర్డినెన్స్ బీసీ రిజర్వేషన్స్ ఉన్న 33 శాతాన్ని తీసివేసి 18 శాతాన్ని కుదించిన ఘనత కేసీఆర్కే దక్కుతుంది. బీసీలకు స్థానిక సంస్థల్లో పదవి రాకుండా చేసిన ఘనత కేసీఆర్కి దక్కింది. కుహనా ఆహా నా మేధావులకు ప్రజలు వేస్తున్న ఒక ప్రశ్న. బీసీల పట్ల 75 సంవత్సరాలుగా ఇంకా మోసం చేస్తూ.. ఉన్న పాలకులను ఎండగట్టాల్సింది పోయి చెక్కభజన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నది పాలకులు కాదా..! ఇది నగ్న సత్యం కాదా! ఇక కొత్తగాప్రభుత్వం ఏర్పాటు చేసినకాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన వాగ్దానాలు నెరవేరుస్తాదని ఆశిద్దాం. లేనియెడల గత పాలకులకు పట్టిన గతే ప్రస్తుత పాలకులకు కూడా పడుతుందని చెప్పకతప్పదు.



- మన్నారం నాగరాజు,
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ,
రాష్ట్ర అధ్యక్షుడు,
95508 44433.

# ప్రతి కదలికకు కీళ్లే కీలకం

మన ప్రతి కదలికలకూ కీలే.. కీలకం! జాయింట్లు మృదువుగా, సజావుగా, సున్నితంగా కదులు తుంటేనే... మన జీవితం హాయిగా, సుఖంగా సాగుతుంటుంది. అది వేళ్ల, మణికట్టు, భుజం, చివరికి పాదాల, వేళ్ల ఏ జాయింట్లు అయినా కావచ్చు.. మోకాలి కీళ్లు కావచ్చు. ఏ కదలికకైనా ఈ కీళ్లే కీలకం. మరి మన శరీరంలో ఈ కీళ్లు ఉగ్రరూపం దాలిస్తే కాలు, చేయి మెదపాలంటే కష్టం. మారు తున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంటాయి. అందులో ఆర్థరైటిస్ కూడా ఒకటి. ఇది గ్రీకు పదాలైన "ఆర్థ్రో" నుంచి ఉద్భవించింది, అంటే

"ఉమ్మడి", మరియు "ఐటిస్", అంటే "మంట". మానవ ఆర్థరైటిస్ యొక్క మొట్ట మొదటి జాడలు క్రీ.పూ 4500 నాటివి. ప్రారంభ నివేదికలలో, ఆర్థరైటిస్‌ను చరిత్ర పూర్వ ప్రజల అత్యంత సాధారణ వ్యాధిగా సూచిస్తారు. కీళ్ల అరుగుదలనే ఆర్థరైటిస్ అంటాం. కీళ్ల నొప్పులు అధికంగా తుంటి, మోకాలులో వస్తుంటాయి. చేతి, మోచేతిలోనూ కీళ్ల నొప్పులు రావచ్చు. శరీరంలో మోకాలే పెద్ద కీలు. శరీర బరువును సగానికిపైగా మోకాలే మోస్తుంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ కీళ్లలో ఉండే కీలకమైన మృదులాస్థి అనే పదార్థం కరిగిపోతుంది. అది నిరంతరం కరుగుతూ మళ్లీ ఏర్పడు తుండటం దాని ప్రత్యేకత. అయితే 40-45 ఏళ్ల మధ్య మృదులాస్థి పునఃరుత్పత్తి తగ్గడం మొదలవుతుంది. దీంతో కీళ్లవాపు, నొప్పి, నడవలేక పోవడం వంటివి వస్తాయి. ఈ విధంగా జరగడాన్నే కీళ్ల నొప్పి లేదా ఆర్థరైటిస్ అంటారు. కీళ్లనొప్పికి జన్యు పరమైన కారణాలూ ఉంటాయి. ప్రధానంగా వయసు, జన్యు పరమైన కారణాలతోనే ఆర్థరైటిస్ వస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎంకైలోడింగ్ ఆర్థరైటిస్ అనే 2 రకాలున్నాయి. సాధారణ ఆర్థరైటిస్‌కు ఈ రెండూ భిన్నం. ఈ రెండింటిలో ఉపశాఖలుగా మరో 15 ఆర్థరైటిస్‌లు ఉన్నాయి. ఒకసారి తగులుకుంటే వదిలి పెట్టవు. పూర్తిగా నిర్మూలించలేం. స్టెరాయిడ్స్ తదితర మందులు వాడటం వల్ల వీటిని నియంత్రించవచ్చు. ఇక సోరియాసిస్ కూడా ఆర్థరైటిస్‌కు దారితీస్తుంది. రీటస్ డిసీజ్ అంటే కంటి చూపు మంద గించడం ద్వారా కీళ్ల నొప్పులు వచ్చే అవకాశముంది. ఇలాంటి జబ్బులు వస్తే 20-30 ఏళ్లకే ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. గతంలో 50-60 ఏళ్లలో కనిపించే ఆర్థరైటిస్‌ను ఇప్పుడు 35-40 ఏళ్లలోనే చూస్తున్నాం. దీన్ని ముందుగా గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోకపోతే మున్ముందు నడవలేని, కదల్లేని పరిస్థితులు రావొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కింద కూర్చోవడం వల్ల, సాధారణ మరుగుదొడ్లు వాడినా మోకాలి నొప్పులు వస్తాయి. ఈ కీళ్లకు వచ్చే అతి పెద్ద సమస్య ఆర్త్రైటిస్! అంటే కీలు లోపలంతా వాచి పోయి కదపాలంటేనే తీవ్రమైన నొప్పి, బాధతో జాయింటులో అరిగి పోవడం వల్ల రావచ్చు. దాన్ని "ఆస్టియో ఆర్త్రైటిస్" అంటారు. ఇప్పుడు ఎక్కువ మంది అనుభవిస్తున్న మోకాళ్ల నొప్పుల బాధ ఇదే. ఇక ఒంట్లో ఏదైనా ఇన్ఫెక్షన్ తలెత్తి అది కీలుకు చేరటం వల్ల కీళ్లనొప్పి రావచ్చు. దీన్ని "ఇన్ఫెక్టివ్ ఆర్త్రైటిస్" అంటారు. సొరియాసిస్ వంటి చర్మ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపు, నొప్పి పలకరించవచ్చు. దాన్ని "సొరియాటిక్ ఆర్త్రైటిస్" అంటారు. అలాగే మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, నీళ్ల విరేచనాల వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత కూడా కీళ్ల వాపు రావచ్చు. దాన్ని "రియాక్టివ్ ఆర్త్రైటిస్" అంటారు. చికున్‌గన్యా వంటి వైరల్ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపులు రావచ్చు, వీటిని "వైరల్ రియాక్టివ్ ఆర్త్రైటిస్" అంటారు. ఇలా కీళ్ల వాపుల్లో ఎన్నో రకాలున్నాయి. అయితే ఇవన్నీ కూడా ఏదో ఒక ప్రత్యేకమైన, స్పష్టమైన కారణంతో వచ్చే కీళ్ల నొప్పులు! వీటికి భిన్నంగా... స్పష్టమైన కారణమేదీ తెలియకుండానే ఆరంభమయ్యే అతి పెద్ద సమస్య.. రుమటాయిడ్ ఆర్త్రైటిస్! కీళ్లవాతం!! వేళ్లు, మణికట్టు వంటి చిన్న జాయింట్లను ఎక్కువగా పట్టి పీడించే ఈ కీళ్లవాతం.. దీర్ఘకాలం ఉండిపోయే సమస్య! దీన్ని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో గుండె, ఊపిరితిత్తులు, కళ్ల వంటి ఇతరత్రా అవయవాలూ ప్రభావితమై పరిస్థితి మరింత విషమిస్తుంది. అదృష్టవశాత్తూ దీన్ని పూర్తి నియంత్రణలోకి తీసుకువచ్చే విధానాలు అందుబాటులో ఉన్నాయి. మన శరీరంలో ఒక అద్భుతమైన రక్షణ వ్యవస్థ ఉంది. అదే 'రోగ నిరోధక వ్యవస్థ'. మనం వ్యాధుల బారినపడకుండా.. ఎటువంటి సూక్ష్మక్రిములూ మనపై దాడి చెయ్యకుండా నిరంతరం పహారా కాస్తుందీ వ్యవస్థ. రేయిం బవళ్లు ఈ బాధ్యతలను ఇది అద్భుతంగా నిర్వర్తిస్తుంటుంది. కానీ.. ఒక్కోసారి ఇది ఏకంగా మన శరీర భాగాల మీదే దాడి చేసేస్తుంది. ఫలితమే రకరకాల 'ఆటో ఇమ్యూన్' సమస్యలు. కీళ్లవాతం.. రుమటాయిడ్ ఆర్త్రైటిస్ కూడా ఇలా తలెత్తే సమస్యే! ఇది మన కీళ్లలో ఎముకల మధ్య ఉండే మృదువైన 'సైనోవియం' పొరపై దాడి చేసి దెబ్బతీయటం ఆరంభిస్తుంది. దీంతో కీళ్లు ఎర్రగా వాచిపోవటం, నొప్పుల వంటి బాధలన్నీ ఆరంభమవుతాయి. సాధారణంగా ఇతరత్రా కీళ్ల నొప్పులైతే శరీరంలోని ఏదో ఒకవైపు కీలుకు మాత్రమే వస్తాయి. కానీ రుమటాయిడ్ ఆర్త్రైటిస్‌లో ఒకేసారి రెండు వైపులా వాపు కనిపిస్తుంది.



## నామమాత్రాలైన వయోవృద్ధుల

# సంక్షేమ చట్టాలు

**కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ.. విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయోవృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారతదేశంలో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050నాటికి వీరిసంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా.**

మనరాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతానికి మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టుకుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ.., నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశములో నెలకొన్న పరిస్థితులవల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారమవుతున్న రోజులివి. అదేక్రమంలో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు పరిష్కారం కనబడక పోవడం అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. కొందరు వీరిపై దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడుతుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందుపరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొందించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్ముకు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునఃర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోకపోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టంపై సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాల్లో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్‌లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాల్లో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాల్లో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాల్లో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకూ లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

**"సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"**

జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ నడుస్తోంది. వృద్ధుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- రామ కిష్టయ్య సంగనభట్ల
9440595494

# సీనియర్ సిటిజన్లకు టీటీడీ గుడ్ న్యూస్

- ఇకపై అరగంటలోనే శ్రీవారి దర్శనం
- రెండు టైమ్ స్లాట్స్ ఏర్పాటు చేసిన టీటీడీ
- ఉదయం 10, మధ్యాహ్నం 3 దర్శనం చేసుకునే అవకాశం



**విశ్వంభర, తిరుపతి:** సీనియర్ సిటిజన్లకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వేంకటేశ్వర స్వామి ఉచిత దర్శనం కోసం సీనియర్ సిటిజన్లకు రెండు టైమ్ స్లాట్‌స్‌ను ఏర్పాటు చేసింది. తిరుమల శ్రీవారి దర్శనానికి వేలాది మంది భక్తులు నిత్యం తరలివస్తుంటారు. చిన్నపిల్లల నుంచి పండు ముదుసలి వరకు కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరుతుంటారు. స్వామివారి దర్శనానికి గంటల పాటు క్యూలైన్లలో బారులు తీరాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే, ముఖ్యంగా వృద్ధులు క్యూలైన్లలో అవస్థలు పడుతుంటారు. తాజాగా వారి కోసమే సీనియర్ సిటిజన్లకు రెండు టైమ్ స్లాట్‌స్‌ను ఏర్పాటు చేసింది.

**రెండు టైమ్ స్లాట్స్**

ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటల స్లాట్‌లో వృద్ధులు స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం కల్పించింది. దర్శనానికి వెళ్లే వృద్ధులు తమ ఫోటో ఐడి కార్డులు (ఆధార్ లేక ఇతర డాక్యుమెంట్లు)తో వయస్సు రుజువులను ఎస్1 కౌంటర్‌లో అందజేయాల్సి ఉంటుంది. వృద్ధులు ఎక్కువగా నడవాల్సిన అవసరం లేకుండా, మెట్లు ఎక్కాల్సిన అవసరం లేకుండా బయట గ్యాలరీ నుంచి ప్రవేశం కల్పించనున్నది. వారి కోసం సీటింగ్ సౌకర్యం సైతం అందుబాటులోకి తీసుకురానున్నది. క్యూలైన్లలో వృద్ధులకు సాంబార్ అన్నం, పెరుగు అన్నం, వేడి పాలు సైతం అందిస్తారు. క్యూలైన్లలో వృద్ధులకు ప్రతిదీ ఉచితమేనని టీటీడీ వర్గాలు తెలిపాయి. వృద్ధులకు తక్కువ ధరకే రెండు లడ్డూలు సైతం అందించనున్నారు.

**టీటీడీ ప్రత్యేక హెల్ప్‌లైన్**

కేవలం రూ.20 చెల్లించి రెండు లడ్డూలు పొందే అవకాశం ఇస్తుంది. అదనంగా లడ్డూల కోసం ఒక్కో దానికి రూ.25 చెల్లించాల్సి ఉంటుంది. ఆలయం ఎగ్జిట్ గేట్ వద్ద ఉన్న కార్ పార్కింగ్ ప్రాంతం నుంచి, కౌంటర్ వద్ద వృద్ధులను డ్రాప్ చేయడానికి బ్యాటరీ కారు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రత్యేక దర్శనం సమయంలో అన్ని ఇతర దర్శనాలను నిలిపివేయనున్నారు. కేవలం వృద్ధులకు మాత్రమే దర్శనం కల్పిస్తారు. ఎలాంటి ఒత్తిడి లేకుండానే వృద్ధులు శ్రీవారి దర్శనం చేసుకోనేలా వీలు కల్పించనున్నది. వివరాల కోసం టీటీడీ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 08772277777 సైతం అందుబాటులో ఉన్నట్లు సూచించింది.



## మావోల అధునాతన టెక్నాలజీ..

### భద్రతా బలగాలకు స్నిపర్ డ్రెస్‌లు లభ్యం

**విశ్వంభర, ఛత్తీస్ ఘడ్:** మావోయిస్టులు అధునాతన టెక్నాలజీ ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటికే వారు అధునాతన ఆయుధాలు ఉపయోగిస్తుండగా, తాజాగా భద్రతా బలగాలకు మావోలు వదిలి వెళ్లిన సామగ్రిలో స్నిపర్ డ్రెస్ లు లభ్యం అయ్యాయి. ఈ డ్రెస్ లు ధరిస్తే వారు ఉండే ప్రదేశానికి అనుకూలంగా కలిసిపోయే అవకాశం ఉంది. దీంతో మావోలను గుర్తించడం భద్రతా బలగాలకు కష్టంగా మారుతుంది. ఇటువంటి డ్రెస్ లు శుక్రవారం భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

**రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేలిన మందుపాతరలు**

ఛత్తీస్ ఘడ్ నారాయణ్ పూర్ జిల్లా, కెహక మేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుతుల్ అటవీ ప్రాంతంలో పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఈ ఘటనలో ఐ టీ బీ పీ కి చెందిన అసిస్టెంట్ కమాండెంట్, ఒక కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఛత్తీస్ ఘడ్ బీజాపూర్ జిల్లా, మద్దేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బందేపార అటవీ ప్రాంతంలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని అమర్చిన మందుపాతర పేలి ఒక డీఆర్ జీ జవాన్ కు తీవ్ర గాయాలు కాగా హాస్పిటల్ కి తరలించారు. ఛత్తీస్ ఘడ్ సుకుమా జిల్లా, కంగాల్ తొంగ అటవీ ప్రాంతంలో పోలీసులను చూసి మావోయిస్టులు పారిపోయారు. ఘటనా స్థలం నుంచి భారీగా పేలుడు పదార్థాలు మావోయిస్ట్ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొదటి సారిగా స్నిపర్ జాకెట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, ఆమనగల్లు:** మాడుగుల మండలానికి చెందిన ఎండి సమీరా పదవ తరగతిలో 9.7 గ్రేడ్ సాధించింది. బాలిక పెద్ద కాలేజీలలో చదివేందుకు ఆర్థిక స్తోమత లేదనే విషయాన్ని తెలుసుకున్న సంఘ సేవకుడు సాయిరాం మెడికల్ అసోసియేషన్ పాపిశెట్టి రాము ఆమె చదువుల నిమిత్తం తనవంతు ఆర్థిక సాయం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమం లో శృతిలయ కల్చరల్ అకాడమి చైర్మన్ చిత్తరంజన్ దాస్, అరవింద్, నిరంజన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సాగు చేసే రైతులకే రైతుబంధు ఇవ్వాలి

### ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**విశ్వంభర, జగిత్యాల టౌన్ :** సాగు చేసే రైతులకు రైతుబంధు ఇవ్వాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఇందిరా భవన్ లో ఏర్పాటుచేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ గత ప్రభుత్వం గుట్టలకు, పుట్టలకు, రియల్ ఎస్టేట్ భూములకు, బీడు భూములకు పెట్టుబడి సాయం ఇచ్చిందని విమర్శించారు. మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు లేఖ ఇచ్చానని వ్యక్తిగతంగా కాదని చెప్పారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వారి పార్టీ కార్యకర్తపై ఫిర్యాదు చేశానని అనుకుంటున్నారని అది సరికాదన్నారు. మీరు ఎమ్మెల్యేగా ఉన్నారుగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి అన్నారు. టౌన్ ప్లానింగ్ డిపార్ట్మెంట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆ డిపార్ట్మెంట్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ లీడర్స్ నాగభూషణం, శంకర్, దుర్గయ్య, అశోక్, లక్ష్మణ్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విశ్వంభర, పలిమెల : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం సర్వాయి పేట గ్రామానికి చెందిన దందెరా పురుషోత్తం వయస్సు 28 సంవత్సరాల వ్యక్తి ఆర్థిక ఇబ్బందులకు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు మిరప తోట వేసి దిగుబడి సరిగా రాక ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో మనస్థాపం చెంది, గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. ఇంట్లో వాళ్ళు గుర్తించి మహదేవ్ పూర్ లోని హాస్పిటల్ కి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. తన భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బడీడు పిల్లలను సర్కారు బడిల్లోనే చేర్పించాలి

- కొత్తూరు ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి



**విశ్వంభర, కొత్తూరు:** బడీడు పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని కొడిచెర్ల, కాచిగూడ తండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫార్మ్స్, పాఠ్యపుస్తకాలను శనివారం ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి తో కలిసి ఎంపీటీసీ రవీందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కొడిచెర్ల ప్రభుత్వ పాఠశాల, అలాగే కాచిగూడ తండా ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్తే అనుకున్నది సాధించవచ్చునన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని తమ పిల్లలు బాగా చదవాలని పాఠశాలలకు పంపుతారని.. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కూడా వారికి ఉత్తమ విద్య నందించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఏర్పడేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ హేమంత్,తాజా మాజీ సర్పంచ్ లు రవి నాయక్,సంతోష్ నాయక్, సీతారాం నాయక్,కల్లెం నరసింహారెడ్డి,మాజీ ఎంపీటీసీ కిషన్ నాయక్, మోడీ దర్శన్,రాజు గౌడ్, మాజీ వార్డ్ సభ్యుడు నవీన్,శంకర్,మోహన్ నాయక్, బిచ్య నాయక్,దాసు నాయక్,గోపాల్ నాయక్,బాబు నాయక్, సోమ్లా నాయక్,సేవ్య నాయక్,శ్రీను నాయక్,జైపాల్ నాయక్, అనిల్ నాయక్,రాము నాయక్ పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు

- బడిబాట కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్



**విశ్వంభర, కేశంపేట:** కేశంపేట ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని.. సమాజంలో తలెత్తుకొని బతకగలుగుతారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో శనివారం జడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డితో కలిసి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ వహించిందని పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా విద్యాలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గతంలో తాము చదువుకునేటప్పుడు ఎలాంటి వసతులు లేనప్పటికీ కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకునే వాళ్ళమని, నేడు ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలో కొన్ని పాఠశాలలో పదవ తరగతిలో జీరో రిజల్ట్ రావడం సరికాదన్నారు. పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే ఒక్క ప్రభుత్వంతోనే కాకుండా అధికారులు, రాజకీయ నాయకుల తోడ్పాటు ఎంతో అవసరం అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వ పాఠశాలలో అటెండర్, చప్రాసి పనులు నిర్వహిస్తున్న వారు ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందలేదని, సంవత్సరాల తరబడి పాఠశాలల అభివృద్ధి కోసం పనిచేస్తున్న వారి సమస్యల పైన అసెంబ్లీలో ప్రస్తావిస్తానని పేర్కొన్నారు. కొత్తపేట గ్రామ పాఠశాలల అభివృద్ధి కోసం గ్రామ మాజీ సర్పంచ్ జగదీశ్వర్ కుటుంబం ఎంతో కృషి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో రవి చంద్ర కుమార్ రెడ్డి, ఎంపీటీసీ పసుల మల్లేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరు జగదీశ్వర్, మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ,నాయకులు శ్రీధర్ రెడ్డి సురేష్ రెడ్డి, అంజయ్య విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీశైలం డ్యాం సమీపంలో చనిపోయి ఉన్న చిరుత



**విశ్వంభర, శ్రీశైలం:** శనివారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో ఒక చిరుత పులి రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు శ్రీశైలం డ్యాం సమీపంలో ఉన్న రహదారి ప్రహరీ పక్కనే సుమారు 8 నెలల మగ చిరుత చనిపోయి ఉంది. అటవీశాఖ అధికారులు ముందుగా ఏదైనా వాహనం ఢీకొనవచ్చని అనుమానించారు.. కానీ దానిని పూర్తిగా పరిశీలించి, శరీరం పైన, మెడ భాగం పైన గోళ్ల ఆనవాళ్లు గమనించారు. ఈ చిరుత వేరే ఇతర అడవి జంతువులతో పోరాడి చనిపోయినట్లు నిర్ధారించారు. ఆ తర్వాత వెటర్నరీ డాక్టర్ ని సంప్రదించి పోస్టుమార్టం జరిపించగా, చిరుత పులి ఇతర జంతువులతో పోరాడి గాయపడినట్లుగా, శరీరం పైన ఏ విధమైన వాహనాలు ఢీకొన్న ఆనవాళ్లు గాని లేవు. చిరుత పులి వేరే ఇతర జంతువు వల్లనే మరణించిందని నిర్ధారించారు. అటవీ శాఖ అధికారులు చిరుతపులి కళేబరాన్ని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ సుశాంత్ , దోమల పెంట ఎఫ్ ఆర్వో గురు ప్రసాద్ , వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అనిల్ , దోమల పెంట రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.



## హనుమాన్ భక్తులపై కేసులు ఎత్తివేయాలి : ఎమ్మెల్యే పాయల శంకర్

**విశ్వంభర, ఆదిలాబాద్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం హిందువులపై అక్రమ కేసులను పెడుతుందని, బైంసా ఘటనలో పలువురు హనుమాన్ భక్తులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పాటేల్, అదిలాబాద్ ఎంపీ నగేష్ తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్ రాముడుపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఎన్నికల సమయంలో బైంసాలో కేటీఆర్ సమావేశం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపితే హనుమాన్ భక్తులను ఈ ప్రభుత్వం అమానుషంగా జైల్లో పెట్టిందన్నారు. హనుమాన్ భక్తుల మీద పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

హనుమాన్ భక్తులను పోలీసులు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నాని,హనుమన్ దీక్షలో ఉన్న వారు ఏ విధంగా దాడులు చేస్తారో తెలుపాలని ప్రశ్నించారు. హనుమాన్ భక్తులను మీద పెట్టిన కేసులన్నీ విత్ డ్రా చేసుకోవాలని, భారతీయ జనతా పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. హిందువులతో పెట్టుకున్న పార్టీలు రాజకీయంగా పుట్టగతులు లేకుండా పోయాయని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, ఇతర నాయకులు తదితరులు ఉన్నారు.

## ఉపాధి హామీ పనులపై రివ్యూ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం ఉపాధి హామీ పనులపై ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, ఉపాధి సిబ్బందితో శనివారం ఎంపీడీఓ ఎండీ నిరంజన్ వలీ పనుల పురోగతిని సమీక్షించారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించాలని మొక్కలు నాటడానికి గుంతలను తీసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నాటే మొక్కలు రెండు మీటర్ల సైజులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జులూరు పద్మావతి,ఏపీఓ బి రమేష్ గౌడ్, ఈసీ ఏస్ శ్రీనివాస్ గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్లు జె యాదిరెడ్డి, ఏ మల్లేష్ యాదవ్, డి శ్రీశైలం గౌడ్, డి నిర్మల,క్షేత్ర సహాయకులు సుమలత, యాదమ్మ, ధనలక్ష్మి, నర్మద,నాగమణి, సురేష్, ఇస్తారి, స్వామి, మల్లేష్, రవిందర్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూర్ ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో ప్రవేశాలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉచిత ప్రవేశాల కోసం ఈ నెల 12 నుండి 30 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి ఎం.రమణారెడ్డి కోరారు. 2024_25 విద్యా సంవత్సరానికి గాను 3వ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న బాలురు ప్రవేశం కోసం ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం,రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే 9959646811మొబైల్ కు సంప్రదించాలని తెలిపారు.

## కల్వకుర్తి ఎత్తిపోతల పనులు వేగవంతం చేయాలి


### ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**విశ్వంభర, కల్వకుర్తి:** పెండింగ్ లో ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతంగా పూర్తి చేసి చివరి ఆయకట్టుకు వరకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో ఆయన శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృష్ణా జలాలు రాకముందే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా మైనర్ రిపేరు ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ టాగూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం/ఆమనగల్లు/బషీర్‌బాగ్:** డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు ఊరూరా ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ స్టేట్ సెక్రటరీ కోడుమూరి దయాకర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దారం గోవిందరెడ్డి, భోజ్య నాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, కేశ బోయిన నరసింహారావు, ఉప్పతల ఏడుకొండలు, గాదె శివప్రసాద్, తుమ్మలపల్లి సురేష్, అశ్వరావుపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జనరల్ సెక్రెటరీ ఫజల్, చంద్రగుండ మండలం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు బుంగ శ్రీను, చాపల మడుగు మనోహర్, చాపలమడుగు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



**తలకొండపల్లిలో....**

తలకొండపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకుర్ ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ నాయకులు మోహన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, అసెంబ్లీ సోషల్ మీడియా ఇన్చార్జ్ అజీమ్, మైనార్టీ మండల అధ్యక్షులు ఆరిఫ్, టౌన్ అధ్యక్షులు రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మ నరసింహ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**బషీర్ బాగ్ లో....**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఓబిసి ప్రధాన కార్యదర్శి, జాయింట్ కోఆర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్ పుష్ప గుచ్ఛం అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపత్, ఆటో కార్మికుల సంఘం మల్లేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.







## హరిత వైభవోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

**విశ్వంభర, శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలో సాయివైభవ్ కాలనీలో కాలనీ ప్రెసిడెంట్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన హరిత వైభవోత్సవం కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయివైభవ్ కాలనీలో హరిత వైభవోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం చాలా సంతోషకరమైన విషయం అని, సాయివైభవ్ కాలనీ ఇక నుండి హరిత వైభవోత్సవంగా విరాజిల్లుతుందన్నారు. ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచిందని, రాబోయే రోజులలో కాలనీ మొత్తం పచ్చని మణిహారంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాలనీలో ప్రతి ఒక్కరూ భాగసామ్యం అయి మొక్కలు పెట్టి వాటిని పెంచి పెద్ద చేసే బాధ్యత తీసుకోవడం అభినందనీయమన్నారు ఎమ్మెల్యే గాంధీ. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్, శ్యామలేట్ శ్రీనివాస్, నారాయణ పద్మావతి, సుజిత్ కృష్ణ, సరస్వతి, సిద్ధార్థ, నవీన్, పవన్, రాజు, సత్యనారాయణ, శర్మ, వేణు, వంశీ, రవి, వైజయంతి, రమ్య కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తికి స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీ

### మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు:** కల్వకుర్తి నియోజకవర్గానికి స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీ మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీ మంజూరు చేశారని అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని యూనివర్సిటీ కోసం 100 ఎకరాల స్థలాన్నిసేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

## కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలి

### మేయర్ గుండు సుధారాణి

### కమీషనర్‌తో కలిసి 9వ డివిజన్‌లో క్షేత్ర స్థాయి పరిశీలన



**విశ్వంభర, వరంగల్ టౌన్ :** కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి బల్దియా పరిధి 9వ డివిజన్ లోని అలంకార్ జంక్షన్, కాకతీయ కాలనీ, యాదవ్ నగర్, ఈఎల్ ఎస్ఆర్, అమృత థియేటర్, హనుమకొండ పోస్ట్ ఆఫీస్, చౌరస్తా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులు, శానిటేషన్ డి సిల్టింగ్ పనులను పరిశీలించి సమర్ధ నిర్వహణకు సంబంధిత అధికారులకు మేయర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాకతీయ కాలనీలో కల్వర్టు సరిగా లేనందున నూతనంగా నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## డీసీసీబీకి రాష్ట్రంలో ఉత్తమ అవార్డు

**విశ్వంభర, సంగారెడ్డి :** ఉమ్మడి జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు ఇవ్వడంలో డీసీసీబీకి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు హైదారాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి భవనంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర పంచాయతి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డిసిసిబి సి ఈ ఓ శ్రీనివాస్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు శనివారం నాడు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, సి ఈ ఓ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా డిసిసిబి పాలక వర్గంతో పాటు అధికారులను మంత్రి అభినందించారు. 2023 24 ఆర్థిక సంవత్సరానికి గాను ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి ద్వారా 7500 స్వయం సహాయక సంఘాలకు రూ. 450 కోట్ల బ్యాంక్ లింకేజి రుణాలను అందజేశారు. రాష్ట్రంలోని అన్ని డిసిసిబి బ్యాంకులతో పోలిస్తే అత్యధికంగా రుణాలు ఇచ్చిన ఉత్తమ బ్యాంకు గా సంగారెడ్డిలోని ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి అవార్డును అందుకున్నారు. ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా డిసిసిబి అధికారులను, ఉద్యోగులను చిట్టి దేవేందర్ రెడ్డి అభినందించారు.





## ఆర్టీసీ ఆదాయాన్ని పెంచితేనే సంస్థ మనుగడ

### ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి

**విశ్వంభర, మహబూబ్ నగర్:** ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకుంటేనే సంస్థ మనుగడతో ముందుకు సాగుతుందని ఆర్టీసీ ఆర్ఎం వి.శ్రీదేవి అన్నారు. స్థానిక బస్ స్టాండ్ లో ఆమె వివిధ డిపోల నుంచి బస్ స్టాండ్ కు వచ్చిన సర్వీస్ కండక్టర్,డ్రైవర్ల కు ఆదాయం పెంచే మార్గాలను సూచిస్తూ,వారికి 'మిల్లేట్ స్నాక్స్' ప్యాకెట్లను అందజేశారు. మార్గమధ్యలో ప్రయాణికులు చెయ్యి ఎత్తిన చోట బస్సు ఆపి ఎక్కించుకోవాలని,వారు కోరిన చోట దింపి సహకరించాలని,ప్రతి ప్రయాణికుడు మనకు విలువైన వినియోగదారుడని వారిని గౌరవించాలని తెలుపుతూ,ఓఆర్ పెంచుకునే మార్గాలను ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో బస్ స్టేషన్ మేనేజర్ కెఆర్ రెడ్డి ఉన్నారు.

## ఆదిలాబాద్ కలెక్టర్‌కు

## భారత ప్రధాన ఎన్నికల కమిషన్ ప్రశంస

### అభినందనలు తెలిపిన అధికారులు



**విశ్వంభర, ఆదిలాబాద్** : 2024 లోక్ సభ సాధారణ ఎన్నికల ను అదిలాబాద్ జిల్లాలో నోటిఫికేషన్ వెలువడినప్పటి నుండి కౌంటింగ్ వరకు తనదైన శైలిలో ప్రతి అంశ లో చురుకుగా వ్యవహరించి ఎలాంటి సంఘటనలకు తావులేకుండా విజయవంతం చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా కు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సర్టిఫికెట్ అందజేసి ప్రశంసించారు. ఈ మేరకు శనివారం తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ను జిల్లా రెవెన్యూ సిబ్బంది, కలెక్టరేట్ ఏవో, డిపిఆర్ఓ, ఇతర అధికారులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలు, అధికారులు, ప్రజ ప్రతినిధులు, మీడియా సహాయ సహకారాలు, సమిష్టి కృషి వల్లే జిల్లాలో ఎన్నికలను దిగ్విజయంగా, పారదర్శంగా నిర్వహించామని అన్నారు. మనందరం ఇదే సమిష్టి కృషి సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేసి, జిల్లాను అభివృద్ధిలో రోల్ మోడల్ గా నిలిపేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

## పోలీస్ కమెండ్ కంట్రోల్‌లో సీఎం సమీక్ష

**విశ్వంభర, బంజారాహిల్స్:** వర్షకాలం వచ్చిన నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది స్పందించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు యూనిట్‌గా తీసుకుని డిజాస్టర్ మేనేజ్మెంట్‌ను ఇంటిగ్రేట్ చేయాలని సీఎం ఆదేశించారు. ఔటర్ లోపల ఉన్న సీసీ కెమెరాలన్నింటిని వీలైనంత త్వరగా కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేయాలన్నారు. సీఎంతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవి గుప్త అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే 141వరద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

## జాజు రెస్టారెంట్ కూల్చివేత పై ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఫైర్



**విశ్వంభర, సూర్యాపేట :** ప్రజా ఉద్యమాలు తమకి కొత్త కాదనీ, మున్ముందు వాటి ద్వారానే రాక్షస పాలనను అడ్డుకుంటామని మాజీ మంత్రి సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి వెల్లడించారు. ఇది సూర్యాపేటలో జరుగుతున్న అరాచక పాలనకు మరో నిదర్శనమే రెస్టారెంట్ కూల్చివేతని ఆయన మండిపడ్డారు. శనివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి సద్దల చెరువు పక్కనే ఉన్న జాజు రెస్టారెంట్ వద్ద జరిగిన కూల్చివేతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవలం రాజకీయ కక్షతోనే ప్రజలు ఓట్లు వేయలేదని ఉద్యోగులను, వ్యాపారులను ఇతర పార్టీల రాజకీయ నాయకులను ప్రాణాలు కాపాడే డాక్టర్లపై కూడా దాడులు చేయడం జరుగుతుందని ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా భవనాలు కూల్చడం సరికాదన్నారు. జాజు హోటల్ ఎత్తు ప్రాంతంలో ఉన్నదని సూర్యాపేట సగం కొట్టుకు పోయిన ఇక్కడికి నీళ్లు వచ్చే అవకాశం లేదని ఆయన చెప్పారు. ఐదు నెలల క్రితం ఎఫ్ పిఎస్ పరిధిలో ఉందని నోటీసులు ఇచ్చారని ఇది కొత్త నిర్మాణం కాదని 25 సంవత్సరాల క్రితం కొనుగోలు చేశారని, కొందరు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ట్యాంక్ బండ్ అభివృద్ధి చెందడంతో ఆహ్లాదం కొరకు వచ్చే వారికి రుచికరమైన ఆహారం అందించేందుకు హోటల్ గా మార్చి ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇచ్చి చెరువు కట్ట కంటే ఐదారు ఫీట్ల ఎత్తులో తమ హోటల్ ఉందని వారు ఇచ్చిన నోటీసే తప్పని సమాధానం ఇచ్చామని తెలిపారు. నోటీసుకు సంజాయిషి ఇవ్వకుండా కొందరు కూల్చి వేతలకు పాల్పడడం ఏంటని ప్రశ్నించారు. అధికారులు నిబంధనల ప్రకారం పని చేయాలి తప్ప దారిన పోయే దానయ్యలు చెబితే కూల్చివేతలకు పాల్పడవద్దని హితవు పలికారు. నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేతలకు పాల్పడిన అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఈ విషయమై కలెక్టర్,ఎస్పీలకు విన్నవించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, జెడ్పిటిసి జీడి భిక్షం,కౌన్సిలర్ తహెర్ పాషా,గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.వి, నాయకులు ఉప్పల ఆనంద్, గండూరి ప్రకాష్, మారిపెద్ది శ్రీనివాస్, ఆకుల లవకుశ, తూడి నరసింహారావు,బెల్లంకొండ యాదగిరి,సునీల్ రెడ్డి,సుంకరి రమేష్,మద్ది శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో ఉన్న అటవీ శాఖ అధికారులపై దాడులు చేయడం హేయనీయం

- ప్రభుత్వం తమకు ఆయుధాలు ఇవ్వడంలో చొరవ చూపాలి




**విశ్వంభర, నిజామాబాద్ సిటీ:** విధుల్లో ఉన్న అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడి చేయడం హేయమైన చర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అటవీశాఖ ఎస్ ఆర్ వో రవి మోహన్ భట్, జే ఆర్ వో నిజామాబాద్ అధ్యక్షుడు సుధాకర్ రావు తెలిపారు. శుక్రవారం మోపాల్ మండలంలోని కాల్పోల్లో ఫారెస్టు అధికారులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ శనివారం నగరంలోని అటవీశాఖ కార్యాలయంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అటవీ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. అటవీ భూముల్లో చెట్లు నరికి ఆక్రమించడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. విధి నిర్వహణలో భాగంగా తాము రాత్రనక, పగలనక దట్టమైన అడవుల్లో ఎలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరగకుండా అహర్నిశలు పని చేస్తామని అన్నారు. కొన్ని కొన్ని సందర్భాలలో కొందరు వ్యక్తులు దాడులకు దిగుతారని అలాంటి సమయంలో తాము ప్రతిఘటించడానికి ఏలాంటి వెపన్స్, ఆయుధాలు ఎవరి దగ్గర ఉండవని ప్రాణాలకు సైతం తెగించి బయటపడతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి అటవీ శాఖ ఉద్యోగులకు, సిబ్బందికి ఆయుధాలు సమకూర్చేలా మేలు చేస్తే మేలు చేసిన వారవుతారన్నారు. అలాగే ప్రజలు అవగాహన పెంచుకోవాలని భూముల్లో చెట్లు నరికేసి ఆక్రమించడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కొందరు రాజకీయ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం అమాయక ప్రజలను రెచ్చ గొడుతుండడం వల్ల ప్రజలు ఇలా దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇది సరైన చర్య కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫారెస్ట్ అధికారుల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ ఆర్ వో పద్మారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముధోల్ లైన్ మెన్ సస్పెన్షన్

**విశ్వంభర, ముధోల్ :** నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లైన్ మెన్ హల్దార్ ను సస్పెన్షన్ చేసినట్లు బైంసా డివిజన్ ట్రాన్స్ కో డిఇఇ శ్రీనివాస్ రెడ్డి శనివారం తెలిపారు. సంబంధిత లైన్ మైన్ ముధోల్ ల్లోని ఓ రైతుకు మూడు బోర్లు ఉన్నప్పటికీ 12 బోర్లు ఉన్నాయని సృష్టించి నూతన ట్రాన్స్ఫార్మర్లు మంజూరు కొరకు తప్పుడు సర్వే చేసి పంపారని ఆయన చెప్పారు. దీంతో మూడు ట్రాన్స్ఫార్మర్ లు మంజూరు అయ్యాయి .

అయితే అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాగా సంబంధిత లైన్ మెన్ సర్వే తప్పు చేసి, డిపార్ట్మెంట్ కు సుమారు రూ.6 లక్షల 30 వేల నష్టం కు కారకుడు అయ్యాడని పేర్కొన్నారు. ఈ విషయంలో ఏడిఏ లక్ష్మణ్ ఇటివలే విచారణ జరిపారు.దీంతో లైన్ మెన్ ను సస్పెండ్ చేసినట్లు డిఇఇ పేర్కొన్నారు.

# ఫుడ్ సేఫ్టీపై ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలవాలి

- నిబంధనలు, నాణ్యత పాటించకుండా ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు
- రాష్ట్ర వ్యాప్తంగా ఆహార తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షించాల
- జీహెచ్ఎంసీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరు పై మంత్రి అసంతృప్తి
- ఉన్నత స్థాయి సమీక్షలో అధికారులకు దిశానిర్దేశం చేసిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**విశ్వంభర,హైదరాబాద్:** నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి సి. దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో ఫుడ్ సేఫ్టీ పై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి దామోదర మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలను అందించడంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా ఉండాలని మంత్రి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా రోజుకు సుమారు 180 నుండి 200 ఫుడ్ శాంపిల్స్ లను సేకరించి టెస్టులు చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ హాస్టల్స్, ప్రైవేటు బోర్డింగ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లు, బేకరీలు, డెయిరీ ఫుడ్ తయారీదారులు, రెస్టారెంట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్ తయారుదారులు FSSAI లైసెన్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ 2006 ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించని ఫుడ్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసు కోవాలని అన్నారు. టాస్క్ ఫోర్స్ , ఫుడ్ సేఫ్టీ అన్ వీల్స్ (ఫుడ్ లాబ్స్), అకస్మిక తనిఖీలు, అవగాహన సదస్సులను నిరంతరం నిర్వహించాలన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరు పై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రతి శనివారం మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా చేపట్టిన టెస్టులను వివరాల నివేదికను అందించాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఆహారం, మంచినీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ పై ఫుడ్ బిజినెస్ ఆపరేటర్స్ తో అవగాహన సదస్సు లను నిర్వహించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ పై శిక్షణను అందించాలని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా, రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివ లీల, స్టేట్ ఫుడ్ ల్యాబ్స్ హెడ్ లక్ష్మీనారాయణ రెడ్డి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్స్ అమృత శ్రీ, బాలాజీ రాజు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మజ, జాయింట్ కమిషనర్ హెల్త్ ఏ. శైలజ పాల్గొన్నారు.



## కొత్త మోరీల కంటే పాతవే బెటరా.. ?

### అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇబ్బందుల్లో ప్రజలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీలో గత కొన్ని రోజులుగా రోడ్డు పక్కన డ్రైనేజ్ (మోరి) పనులు జరుగుతున్న తీరు చూస్తే అధికారుల పర్యవేక్షణ లోపమనే అనిపిస్తోంది. గతంలో మోత్కూర్ మేజర్ గ్రామ పంచాయతీగా వున్నప్పుడున్న మోరిని తొలగించి కొత్తగా ఏర్పాటు చేస్తున్న మోరిని చూస్తే ఆశ్చర్యానికి గురికాక తప్పదు. మున్సిపాలిటీలో ఉండే ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న షాపులు.. కొన్నికాలనీలనుండి వచ్చే వర్షపు నీరు ఈ మోరీల నుండే పెద్ద చెరువులోకి వెళుతుంది. కానీ గతంలో ఉన్న మోరీ చిన్నగా ఉండి నీరు వెళ్లకపోవడంతో తరచూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు అదే పాత మోరిని తవ్వి కొత్తగా వేస్తున్నారు. కొత్త మోరి చిన్నగా ఉండడంతో వర్షాలు ఎక్కువగా వస్తే ఈ మోరి నుంచి నీరు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అధికారులు పర్యవేక్షించి మోరీలను పెద్దగా కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

## 'నేను సైతం సేవ సంస్థ' ఆధ్వర్యంలో నోట్ పుస్తకాల పంపిణీ



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల కేంద్రంలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్ పట్టణానికి చెందిన 'నేను సైతం సేవ సంస్థ' నిర్వాహకులు కామేష్ ఫణి కుమారి సంస్థ తరపున రూ .20వేల విలువగల నోట్ బుక్స్ ను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హెచ్ఎస్ గెజిటెడ్ హెడ్మాస్టర్ ఆర్.లక్ష్మి, ఎంపిటిసి నల్లవెల్లి సదానందం, ఎంపీపీఎస్ హెడ్మాస్టర్ కొండూరు ఆంజనేయులు, ఎస్.రాజేశ్వరి, ఆర్ లక్ష్మి, ఎన్.లక్ష్మీబాయి, కె గోపాల కృష్ణ, అలివేలమ్మ, సైదులు, పి.మల్లేశం పాల్గొన్నారు.

## టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ కు సన్మానం

**విశ్వంభర, బషీర్ బాగ్:** టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ ను టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్ కుమార్, సెక్రటరీ ఎం భాస్కర్, కోశాధికారి ప్రేమ్ పుష్పగుచ్ఛం అందజేసి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం.రవి, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్, వైదిక్ శాస్త్రీ, శంకర్, వహీద్, ప్రభాకర్ , మహమ్మద్, సుదర్శన్, శ్రీనివాస్ బాబు, అరుణ, మిర్జా, కాజామీద్ షైలా, సూర్య, శివ ఫజియుల్లా, వేదిక, శివానంద్, అజీజ్ , సదత్, జమీల్, ఇమ్రాన్, పరమేష్, దామోదర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## నాలా పనులను వెంటనే పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**విశ్వంభర,మల్కాజిగిరి ;** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో చేపడుతున్న నాలా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని బాల సరస్వతి నగర్, సర్దార్ పటేల్ నగర్ లో చేపడుతున్న నాలా పనులను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు, మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ నాయకులు స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు వరద ముంపుకు గురికాకుండా నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సర్దార్ పటేల్ నగర్ లో దాదాపు 72 మంది భూనిర్వాసితులు న్యాయం చేయాలని, సర్దార్ పటేల్ నగర్ చివర్లో ఆకతాయిలు, గంజాయి తాగుతూ స్థానికులను ఇబ్బంది పెడుతున్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకొని వెంటనే పోలీస్ అధికారులకు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సర్దార్ పటేల్ నగర్ నుండి బాల సరస్వతి నగర్ నాలాకు నూతన ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు.

## నిరాశ చెందాల్సిన పని లేదు మాజీ మంత్రి హరీశ్ రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 17 లోక్ సభ స్థానాల్లో బరిలోకి దిగిన బీఆర్ఎస్.. కనీసం ఒక్క చోటు గెలవకుండా ఎన్నికల పోరులో పూర్తిగా చేతులెత్తేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 10 సంవత్సరాల పాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లోనైనా 38 సీట్లు సాధించి ప్రతిపక్ష హోదా దక్కించుకున్న బీఆర్ఎస్.. లోక్ సభ ఎన్నికల్లో ఒక్కస్థానంలో కూడా ఖాతా తెరవకుండా మూడవ స్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ పార్టీ పోటీ చేసిన చాలా పార్లమెంట్ స్థానాల్లో మూడో స్థానంలోనే నిలవడం గమనార్హం. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఓటమిపై మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. 24ఏళ్ల చరిత్రలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నో ఒడిదుడుకులను చూసింది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడింది. ఎంపీ ఎన్నికల ఫలితాలతో నిరాశ చెందాల్సిన పని లేదు. లక్షల మంది కార్యకర్తల ఆశీస్సులు, అభిమానంతో తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధాన ప్రతిపక్ష పార్టీ హోదాలో నిరంతరం శ్రమిస్తాం. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల హామీలు అమలు చేసేలా నిలదీస్తాం. ప్రజా తీర్పును గౌరవిస్తూ, తమని తాము సంస్కరించుకుంటూ.. భవిష్యత్తుపై సరికొత్త ఆశలతో, ఆశయాలతో ముందుకు కదులుతాం అని ట్విట్టర్ వేదికగా ట్విట్ చేశారు.

## స్టార్టప్‌లకు ఏడబ్ల్యూఎస్ 230 మి.డాలర్లు అందించిన జపాన్

**విశ్వంభర, బషీర్ బాగ్ :** అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) కాంప్లిమెంటరీ ఏడబ్ల్యూఎస్ జెనరేటివ్ ఏఐ స్పాట్ కార్యక్రమాన్ని సుమారు 120 మొదటి దశలో ఉన్న జెనరేటివ్ ఏఐ స్టార్టప్ కు అందించడానికి ఏషియన్ పసిఫిక్ .. జపాన్ (ఏపీజే)లో ఇండియాకి 40 స్పాట్లను ఇస్తూ ప్రవేశపెట్టింది. జూన్ 13 న, ఏడబ్ల్యూఎస్ 230 మిలియన్ డాలర్ల నిబద్ధతను జెనరేటివ్ ఏఐ స్టార్టప్ లకు అందించింది. గ్లోబల్ జెనరేటివ్ ఏఐ యాక్సిలరేటర్ విస్తరణ సుమారు 80 మంది స్థాపకులకు, ఆవిష్కర్తలకు విస్తరించింది. వారి ఎదుగుదల టెక్నికల్ గా, వ్యాపార రీత్యా ప్రోగ్రామింగ్ ని మొదలు పెట్టి అంతరిక్షంలో ఉన్న స్టార్టప్ లకు టర్బో చార్జ్ చేసింది. ఏడబ్ల్యూఎస్ ఏఐ యాక్సిలరేటర్ దరఖాస్తులు మొదలయ్యాయి. ఇవి జులై 19 వరకు ఆమోదించబడతాయి. 10 వారాల గ్లోబల్ కార్యక్రమ వ్యవధిలో, మిషన్ లెర్నింగ్, స్టాక్ ని మెరుగుపరచడం, మార్కెట్ కి వెళ్ళే ఆలోచనలకి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించడానికి సెషన్స్ తయారు చేయబడ్డాయి. స్థాపకుల పరిశ్రమలలో వ్యాపార, టెక్నికల్ మెంటార్షిప్, పారిశ్రామిక నిపుణులతో నెట్ వర్కింగ్ అవకాశాలు దక్కుతాయి.

## యాజమాన్యపు హక్కుకు కృషి చేస్తా:ఎమ్మెల్యే శ్రీగణేష్

**విశ్వంభర, బేగంపేట :** మోండా డివిజన్ లో శివాజీ నగర్ బస్తీలో ఎండోమెంట్ స్థలంలో కొద్ది సంవత్సరాలుగా ఇండ్లను నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి యజమాన్యపు హక్కు కల్పించే విధంగా తన వంతు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బుధవారం మోండా డివిజన్ శివాజీ నగర్ బస్తీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయంకు చెందిన స్థలంలో సుమారు 110 కుటుంబాబు గత కొద్ది సంవత్సరాలుగా ఇండ్లను నిర్మించుకొని నివాసం ఉంటున్నామని, గత కొద్ది నెలలుగా ఇంటి యజమానులు పెంచిన కిరాయిలు చెల్లించకపోవడంతో ఎండోమెంట్ అధికారులు నోటీసులను జారీ చేశారన్నారు. బకాయిలను చెల్లించాలని మాపై ఒత్తిడి తీసుకొని వస్తున్నారని,బస్తీ వాసులు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువచ్చి ఎండోమెంట్ స్థలంలో నివాసం ఉంటున్న వారికి యాజమాన్యపు హక్కులను కల్పిస్తానాని హామీ ఇచ్చారు. దీర్ఘకాలంగా ఈ ప్రాంతంలో ఇండ్లను నిర్మించుకొని ఉంటున్న పేద, మధ్య తరగతి వారందరిని ఇంటి కిరాయిలను చెల్లించాలని ఒత్తిడి చేయవద్దని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.



సీఎం తో పాటు ఎండోమెంట్ మంత్రి, కమీషనర్ల దృష్టికి సమస్యను తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఇంటి కిరాయిలను ఎవరూ కూడా చెల్లించవద్దని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం శివాజీ నగర్ లోని శ్రీ సుదర్శన బువరాహస్వామి శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయం లో ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్ ముదిరాజ్, బద్రీనాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, మల్లేష్, దేవేందర్, రాయి వెంకటేష్, కసిరెడ్డి నరేందర్ రెడ్డి, వెంకట్ రాజ్, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ లో దాడికి పాల్పడిన పాత నేరస్థుడు అరెస్టు

**విశ్వంభర, సికింద్రాబాద్:** పెట్రోల్ బంక్ లో పెట్రోల్ కొట్టించుకొని డబ్బులు అడిగినందుకు బంకు సిబ్బందిపై దాడికి పాల్పడిన పాత నేరస్తున్ని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శనివారం ఓయూ పీఎస్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఓయూ సి ఐ రాజేంద్ర నాయక్ , ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ ప్రాంతానికి చెందిన పాకాల లోకేష్( 22), ఆంజనేయులు అనే ఇద్దరు వ్యక్తులు తార్నాకలోని హెచ్పీ పెట్రోల్ బంక్ లో ఈ నెల 8వ తేదీన సాయంత్రం నాలుగున్నర గంటలకు నంబర్ ప్లేట్ లేని యాక్టివాపై వచ్చి, రూ.100 పెట్రోల్ కొట్టించుకున్నారు. డబ్బులు ఇవ్వకుండానే బైక్ స్టార్ట్ చేసి వెళ్తుండటంతో బంకుకు చెందిన మరో ఉద్యోగి వాహనాన్ని వెనకనుంచి పట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తులు బీరు సీసా తీసి, ఉద్యోగిపై దాడికి చేసి, అక్కడి నుంచి పారిపోయారు. ఈ క్రమంలో ఆ ఉద్యోగి కిందపడడంతో పాటు చేతులపై గాయాలయ్యాయి. దీనిపై బంకు ఉద్యోగులు ఓయూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు



నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆంజనేయులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. లోకేష్ మీద గతంలో పలు స్టేషన్లలో ఎనిమిది సెల్ ఫోన్, బైక్ దొంగతనం కేసులు నమోదైనట్లు చెప్పారు.

## ఓయూ ఇంటర్నేషనల్ హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య యత్నం

**విశ్వంభర, సికింద్రాబాద్:** తార్నాక లో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ పరిధిలోని ఇంటర్నేషనల్ హాస్టల్లోని విద్యార్థి బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం కుదుర్మల్ల గ్రామానికి చెందిన ముల్కగల్ల రవి నిజాం కళాశాలలో ఎంఏ తెలుగు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో అతనికి వర్సిటీ అధికారులు ఇంటర్నేషనల్ హాస్టల్లోని గదిని కేటాయించారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం హాస్టల్ బిల్డింగ్ పై నుంచి రవి దూకగా పెద్ద శబ్దం వచ్చింది. శబ్దం విని తోటి విద్యార్థులు అతడిని హుటాహుటిన ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని శ్రీకర్ హాస్పిటల్ తరలించారు.ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమా, లేదా ఏమైనా వ్యక్తిగత సమస్యలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రికి శుభాకాంక్షల వెల్లువ



**విశ్వంభర, హైదరాబాద్/బషీర్ బాగ్:** ప్రజాభవన్ లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినోత్సవం సందర్భంగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మీడియా సెల్ కో చైర్మన్ మధుకర్ యాదవ్ పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, ప్రత్యేకంగా రూపొందించిన చిత్రపటాన్ని భట్టి విక్రమార్క దంపతులకు మధుకర్ యాదవ్ అమ్ముల అందజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీపీసీసీ కార్యదర్శి, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్ కోట్ల శ్రీనివాస్ ఉన్నారు.

**రాజ గురువు శుభాకాంక్షలు**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆది జాంబవ అరుంధతి మాత మహా శక్తి పీఠాధిపతి గజ్జల రాజగురువు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజగురువు బట్టి విక్రమార్క ను ఆశీర్వదించారు. ఇంకా ఉన్నత స్థాయి పదవులు పొందాలని ఆయన ఆకాంక్షించారు.





రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా ఆయనను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పీసీసీ సభ్యులు బాబర్ ఖాన్ రాష్ట్ర సచివాలయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

\- విశ్వంభర, షాద్‌నగర్



## పాల బకాయిల బిల్లులు వెంటనే చెల్లించాలి

### పాలు కిందబోసి నిరసన తెలిపిన కడ్తాల్ పాడి రైతులు

**విశ్వంభర, ఆమనగల్లు:** పెండింగ్ పాల బిల్లులను వెంటనే చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలని విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా పాడి రైతులు పాలను రోడ్డుపై పోసి తమ నిరసన వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ సహకార సమాఖ్య ద్వారా రావాల్సిన బకాయిలను వెంటనే ఇప్పించి పాడిరైతులను ఆదుకోవాలని కోరారు. కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని విజయ పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు మల్లు రవిని కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. ఏప్రిల్ 16 నుంచి నేటివరకు నాలుగు బిల్లులు రావాల్సి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత కొన్ని నెలల కాలంగా పాల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతూ వస్తుందని తెలిపారు. సకాంలో బిల్లులు అందని కారణంగా పాడి ఆవులకు దాణా కొనుగోలు కోసం చేస్తున్న అప్పులు పేరుకుపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## సూర్యాపేట కలెక్టర్‌గా తేజస్ నందలాల్ పవార్



**విశ్వంభర, చివ్వేంల :** సూర్యాపేట జిల్లా నూతన కలెక్టర్ గా తేజస్ నందలాల్ పవార్ రానున్నారు. ఇప్పటివరకు జిల్లాలో కలెక్టర్ గా పనిచేసిన వెంకట్రావు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## జయశంకర్ కలెక్టర్‌గా రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ గా రాహుల్ శర్మ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ కలెక్టర్ గా చేసిన భవేష్ మిశ్రా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గతంలో నల్గొండ సూర్యాపేట జిల్లాల కలెక్టర్ గా పనిచేసిన రాహుల్ శర్మను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## పోలీస్ శాఖలో నిరుపయోగంగా ఉన్న వాహన విడి భాగాల వేలం

### భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే వెల్లడి



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా లో బుధవారం జిల్లా పోలీస్ శాఖకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న వాహన విడి పరికరాలకు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి జిల్లా ఆర్మడ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఈ వేలంలో ప్రజలు ఎవరైనా పాల్గొనవచ్చని, ఈ వేలం ప్రక్రియ 19 వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని వేలం లో పాల్గొనేవారు, తమ ఆధార్ కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పాటు, రూ. 3,000 రుసుము చెల్లించాలని, కొనుగోలు చేయని వారి రుసుము తిరిగి చెల్లిస్తారని, వేలం గురించి మరిన్ని వివరాలకు ఆర్మడ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలోని MTO కిరణ్ ను 8712658170 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చని ఎస్పీ తెలిపారు.

## ఘనంగా రావిచెట్టు సత్యం జన్మదిన వేడుకలు



**విశ్వంభర, చివ్వేంల :** బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావిచెట్టు సత్యం జన్మదిన వేడుకలను పలువురు నాయకుల మధ్య ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆయనకు స్వీట్ తినిపించి ఆశీర్వదించారు. పార్టీలకతీతంగా రాజకీయ ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఉమ్మడి నల్గొండ జిల్లా బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మారి పెద్ది శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు ధరావత్ బాబు నాయక్, కడారి సతీష్, బత్తుల ప్రసాద్, భూక్య నాగు నాయక్, వీరన్న, ప్రశాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల దరఖాస్తులకు ఆహ్వానం

**విశ్వంభర, ఆమనగల్లు:** గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలు లబ్ధి పొందని వారు ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజాపాలన ఈసేవా సెంటర్ ని శనివారం ఆమె ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలలో ఇంకా లబ్ధిచేకూరని మున్సిపాలిటీ ప్రజలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తెలియజేశారు.




# మద్యం మత్తులో యువత

- అర్ధరాత్రి గానా.. బజానా
- రోడ్లపై బర్త్ డే పార్టీలు, ఘర్షణలు
- పోలీసులు దృష్టి పెట్టాలని పట్టణ ప్రజల వేడుకోలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఇటీవల కాలంలో నేటి యువత మద్యం మత్తులో మునిగిపోతూ పెడదోవ పడుతున్నారు. అర్ధరాత్రి వరకు పూటుగా మద్యం సేవించి రోడ్లపై తిరుగుతూ ఘర్షణ పడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇందులో కళాశాలలో చదివే విద్యార్థులు మొదలు ప్రైవేటు ఉద్యోగాలు చివరికి కూలి పనులు చేసే వారి వరకు ఉన్నారు. మద్యం తాగి సరదాగా తీసుకుంటున్న వీరు అర్ధరాత్రి వరకు మత్తులో తూలుతూ జీవితాలు పాడు చేసుకుంటున్నారు. పార్టీల పేరిట మద్యాన్ని విపరీతంగా తాగుతూ, బర్త్ డే పార్టీలంటూ రోడ్లమీద హల్చల్ చేస్తున్నారు. ఈమధ్య గంజాయి కూడా చాక్లెట్ల రూపంలో దొరుకుతుండడంతో వీటి బారిన పడి కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ వికృత వాతావరణం పట్టణాలు దాటి చిన్న చిన్న గ్రామాలకూ చేరింది. యువకులు మద్యం సేవించి బైక్ లను అతివేగంగా నడుపుతూ అర్ధరాత్రి వేళ రోడ్లపై, శివారు ప్రాంతాలలో కేకులు కట్ చేయడం, బాణాసంచా కాల్చటం వంటి ఘటనలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు కూడా వెనుకాడటంలేదు. పట్టణంలోని ఏ టీ షాప్ లో చూసినా సిగరెట్లు తాగుతున్న యువతనే కనబడుతున్నారని ఇక వివాహాల ఊరేగింపుల్లో అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. ఈ విషయంలో పోలీసుల సూచన సైతం ఖాతరు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

వారం రోజుల క్రితం కడ్తాల్ లోని బట్టర్ ఫ్లై సిటీ వెంచర్ లో బర్త్ డే పార్టీలో జరిగిన చిన్న అంశంపై వాదన మొదలై వాగ్వాదానికి దారి తీసింది. ఆతర్వాత గొడవ పెద్దదై జరిగిన ఘర్షణలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు జైలు పాలయ్యారు.

అర్ధరాత్రుళ్లు బర్త్ డే పార్టీలు అంటూ వెళ్తున్న వారిని వారి తల్లిదండ్రులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినపడుతున్నాయి. తెల్లవార్లూ ఇంటికి రాకపోయినా, వారు మద్యం తాగి సిగరెట్లు తాగినా చూసీ చూడనట్లు వదిలేస్తుండడంతో యువకులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. తల్లిదండ్రులు ఓ కన్నేసి నియంత్రిస్తే వారి జీవితాన్ని బాగుపర్చిన వారవుతారని చెప్పవచ్చు. అదే విధంగా పోలీసులు సైతం రాత్రిళ్లు పెట్రోలింగ్ పెంచాలని.. తద్వారా తెల్లవార్లూ రోడ్లపై మద్యం మత్తులో తిరిగే ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## నాణ్యమైన విద్య లేదు.. మంచి ఫుడ్డు లేదు

- భూపాలపల్లి జిల్లా.. కేజీ టూ పీజీ హాస్టల్‌లో అన్నీ సమస్యలే
- ఆరోపించిన సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మల్లేష్



**విశ్వంభర ప్రతినిధి/భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఉన్నకేజీ టూ పీజీ రెసిడెన్షియల్ హాస్టల్లో నాణ్యమైన విద్య, మంచి ఆహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లేష్ ఆరోపించారు. హాస్టల్లో మెనూ ప్రకారం పిల్లలకి ఆహారాన్ని అందించడం లేదని 2,000 మంది విద్యార్థులు ఒకే హాస్టల్లో ఉండడంవల్ల తీవ్రమంచినీటి కొరత ఉందని ఆయన అన్నారు. హాస్టల్ లో మౌలిక వసతులైన బాత్రూమ్ లు పిల్లలకు సరిపోనందువల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలానికి కేటాయించిన రెసిడెన్షియల్ హాస్టల్ కూడా కేజీ టూ పీజీ లోనే పిల్లలను ఉంచడం వల్ల వెయ్యి మంది విద్యార్థులు అక్కడే ఉండి చదువుకుంటున్నారని అన్నారు. ఇక్కడ నుండి వెంటనే వెంకటాపూర్ మండల కేంద్రానికి హాస్టల్ బిల్డింగ్ ను ఏర్పాటు చేసి ఈ విద్యార్థులను అక్కడే చదువుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు హాస్టల్స్ కు సంబంధించిన విద్యార్థులు ఒకేచోట ఉండటం వలన నాణ్యమైన విద్య అందించడం లేదని హాస్టల్లో ఉన్న మౌలిక వసతులు కూడా సరిపోవడం లేదని ఆయన ఆరోపించారు. వెంటనే మంత్రి సీతక్క స్పందించి ములుగు వెంకటాపూర్ కు హాస్టల్ ను తరలించాలని వాజేడు నుండి వచ్చే విద్యార్థులు వారి తల్లిదండ్రులు మొగుళ్ళపల్లికి వచ్చి పోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## మైనార్టీల సీట్లను నాన్ మైనార్టీలతో భర్తీ చేస్తారా?

### ఇది మైనారిటీ గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర

### కరీంనగర్ జిల్లాలో ఒకే ఫోన్ నెంబర్ తో 12 అక్రమ అడ్మిషన్లు పొందిన వ్యవహారంపై విచారణ జరిపించాలి

### ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ డిమాండ్



**విశ్వంభర, కరీంనగర్:** రాష్ట్రంలో తెలంగాణ మైనారిటీ గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని తక్షణమే ఈ అక్రమ అడ్మిషన్ల వ్యవహారాన్ని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు జోక్యం చేసుకొని నిలిపివేయాలని.. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హెచ్చరించారు. 75% ముస్లిం మైనారిటీలతో భర్తీ చేయాల్సిన సీట్లు ఇతరులతో ఎక్కువ శాతం భర్తీ చేస్తున్నారంటే ఈ అక్రమ అడ్మిషన్ల వ్యవహారం వేలాది రూపాయలు చేతులు మారుతుందని అన్నారు. మైనారిటీ గురుకులాల్లో కేవలం కరీంనగర్ జిల్లాలో మైనారిటీలు కాని వారితో భర్తీ చేస్తూ అక్రమ దందాకు తెరలేపారని ఆరోపించారు. చొప్పదండి నియోజకవర్గానికి చెందిన ఓ పార్టీ నేత ఫోన్ నెంబర్ తో 12 అక్రమ అడ్మిషన్లు ఎలా పొందారో ఇప్పటికిప్పుడు 120 మంది మైనారిటీలు కాని వారిని తీసుకోవాలని టెమ్రీస్ హెడ్ ఆఫీస్ నుంచి ఆదేశాలు ఏ విధంగా జారీ చేస్తున్నారో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. మైనారిటీ గురుకులాలకు కరీంనగర్ జిల్లా ఇన్చార్జిగా ఉన్న దామోదర్ రెడ్డి, శ్రీనివాసరావు టెమ్రీస్ హెడ్ ఆఫీస్ లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు, కొందరు ప్రిన్సిపాళ్లతో కలిసి కొన్ని సంవత్సరాలుగా ఈ అక్రమ దందాకు తెరలేపుతున్నారని, తక్షణమే దామోదర్ రెడ్డిని, శ్రీనివాసరావును తొలగించాలని డిమాండ్ చేశారు. 75 శాతం మైనారిటీలతో భర్తీ చేయాల్సిన సీట్లను మైనార్టీలు కాని వారితో ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. తక్షణమే సీఎం, జిల్లా మంత్రులు, కలెక్టర్లు జోక్యం చేసుకొని అవినీతికి పాల్పడుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని కోరారు. ఈ అక్రమ అడ్మిషన్ల వ్యవహారాన్ని ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీల దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

### సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



**విశ్వంభర, దేవరకొండ:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి కోరారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులు దళారీల వద్ద మోసపోకుండా నాసిరకమైన మందులను అరికట్టాలని నర్సింహారెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పోలే వెంకటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, వానాకాలం రైతుబంధు డబ్బులు వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రైతులు బ్యాంకు నుండి అప్పులు తెచ్చి పండించిన పంట వడ్డీలు కట్టేందుకే సరిపోతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని ఆయన కోరారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని ఆస్పత్రికి రోజుకు 1000 నుండి 1200 ఓపి రోగులు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి మైనుద్దీన్, ఉప్పునూతల వెంకటయ్య, ఎస్.కనకాచారి, నూనె రామస్వామి, దీప సుదర్శన్ రెడ్డి, బొమ్మ అచ్చయ్య, నూనె వెంకటేశ్వర్లు, వలమల్ల ఆంజనేయులు, జూలూరి వెంకటరాములు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

### ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు:** వెల్దండ మండలం పోతేపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న హనుమాన్ దేవాలయంతో పాటు పోచమ్మ తండాలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన హనుమాన్ దేవాలయాన్ని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో తాగు నీటికోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఈ సంవత్సరం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలో 10 వేల మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తుందని దీనికి గాను రెండు నెలల నుండి పని నడుస్తుందని తెలిపారు. ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలకు శంకర్ నేత్రాలయ శిబిరం ద్వారా ఈనెల 18న పోస్టర్ కూడా విడుదల చేస్తామని ఇంకా రైతులకు కూడా అన్నివేళలా అందుబాటులో ఉండి ఐక్యత ఫౌండేషన్.. అభివృద్ధిలో పాలు పంచుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతేపల్లి మాజీ సర్పంచ్ వావిళ్ళ వెంకటమ్మ, మాజీ ఎంపీటీసీ కాడురాం నాయక్, రామ్ నుంతల మాజీ సర్పంచ్ శ్రీరాములు, తండా మాజీ సర్పంచ్ మంగ్లి తాక్యానాయక్, ఉపసర్పంచ్ లక్ష్మణ్ లతోపాటు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# భూ సేకరణ చట్టం ప్రకారమే రైతులకు నష్ట పరిహారం

- రైతులు ఎలాంటి అపోహలు పడొద్దు
- స్పష్టం చేసిన జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా



**విశ్వంభర భూపాలపల్లి:** గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులు ఎలాంటి అపోహలు పడొద్దని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాలకు చెందిన రైతులతో సమా వేశం నిర్వహించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధికి రహదారుల ఏర్పాటు అత్యంత అవసరమని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 3 మండలాల పరిధిలోని 13 గ్రామాల రైతుల నుండి భూ సేకరణ చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. భూసేకరణ విషయంలో రైతుల సలహాలు, సూచనలు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నామని అందుకోసమే రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. ప్రాజెక్ట్ ల నిర్మాణం కోసం భూ సేకరణ చేస్తున్నామని అన్నారు. భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల అభీష్టం ప్రకారమే భూసేకరణ ఉంటుందని తెలిపారు. 350 ఎకరాలు 35 కిలో మీటర్ల దూరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందని రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పు సేకరణ చేయాల్సి ఉన్నదని అన్నారు. గతంలో భూపాలపల్లి జిల్లాలో సింగరేణి ఉపరితల ఘనులు కోసం భూసేకరణ జరిపామని ఏ ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగలేదని రైతుల సూచనలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

**రైతుల అంగీకారంతో...**

భూ సేకరణ విషయం లో భూముల ధరలు, భూముల పట్టాలలో తప్పులు, కొంతమందికి పట్టాలు లేకపోవడం లాంటి విషయంలో ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని తెలిపారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్ట పరిహారం అందిస్తామని అభివృద్ధితో పాటు రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్, నేషనల్ హైవే అధికారులు, మూడు మండలాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఇటలీ పర్యటన

- ఢిల్లీకి చేరుకున్న ప్రధాని మోడీ
- జీ 7 దేశాల సదస్సుకు హాజరు
- వివిధ దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు



**విశ్వంభర, ఢిల్లీ:** ఇటలీలో జీ7 దేశాల అవుట్ రీచ్ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరైన విషయం తెలిసిందే. తాజాగా ఆయన ఇటలీ పర్యటనను ముగించుకుని తిరిగి ఢిల్లీకి చేరుకున్నారు. జీ7 సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమైన మోడీ వారితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. తనకు ఇటలీలో ఘనమైన ఆతిథ్యం లభించిందని వెల్లడించారు. దీన్నిబట్టి మోడీ ఇటలీ పర్యటన విజయవంతమైనట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్ స్కీ తదితరులతో మోడీ అనేక విషయాలపై చర్చించారు. దేశంలో ఎన్డీయే కూటమి మూడో పర్యాయం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రధాని మోడీ చేపట్టిన మొదటి విదేశీ పర్యటన ఇదే కావడం విశేషం. జీ7 సదస్సులో ప్రధాని మోడీ ప్రత్యేక అతిథిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీని ప్రపంచ దేశాల నేతలు అభినందనలు తెలిపారు. ఇటలీ పర్యటనపై ప్రధాని మోడీ స్పందిస్తూ.. జీ7 సదస్సు కేంద్రబిందువుగా సాగిన ఈ పర్యటన ఎంతో ఫలప్రదంగా జరిగిందని చెప్పారు. భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించే దిశగా నేతలందరూ ప్రతిన బూనారని తెలిపారు. ఘనమైన ఆతిథ్యం అందించిన ఇటలీ ప్రభుత్వానికి, ఆ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు.

# ప్లీజ్ నీరు విడుదల చేయండి!

- నీటి విషయంలో రాజకీయాలు వద్దు
- ఢిల్లీలో తాగునీటి కొరత 'అస్తిత్వ సమస్య'గా మారింది
- ఢిల్లీ మంత్రి ఆతిశీ



**విశ్వంభర, ఢిల్లీ:** హీట్‌వేవ్ కారణంగా ఢిల్లీ ప్రజలు నీటి సంక్షోభంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఢిల్లీ మంత్రి ఆతిశీ ఆవేదన వ్యక్తంచేశారు. హరియాణా రాష్ట్రం మానవతా దృక్పథంతో నీరు విడుదల చేయాలని ఆమె కోరారు. ఇటీవల దేశ రాజధానికి 137 క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేయాలని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీ నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో నీటి విషయంలో రాజకీయాలు చేయకూడదని, దేశ రాజధానికి మిగులు జలాలను సరఫరా చేయాలని సుప్రీంకోర్టు హరియాణాకు తెలిపింది. హిమాచల్ ప్రదేశ్ విడుదల చేసిన నీరు ఢిల్లీకి అందేలా చూడాలని సూచించింది. ఢిల్లీలో తాగునీటి కొరత 'అస్తిత్వ సమస్య'గా మారిందని కోర్టు పేర్కొంది. హిమాచల్ నీటిని విడుదల చేసిందని, అయితే ఆ నీరు హరియాణా మీదుగా ప్రవహిస్తున్నందున ఢిల్లీకి కావాల్సిన నీటి వాటాను బీజేపీ పాలిత రాష్ట్రం హరియాణా విడుదల చేయడం లేదని ఆప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. హరియాణా, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి పొరుగు రాష్ట్రాల నుంచి అదనంగా నీరు అందించాలని కోరుతూ ఢిల్లీ ప్రభుత్వం గత వారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హీట్‌వేవ్ కారణంగా కొద్దికాలంగా రాష్ట్రంలో నీటి డిమాండ్ గణనీయంగా పెరిగిందని తన పిటిషన్‌లో పేర్కొంది. హరియాణా, యూపీ, హిమాచల్‌తో సహా ఇతర రాష్ట్రాల నుంచి ఒక నెల పాటు అదనంగా నీరు విడుదల చేయాలని న్యాయస్థానాన్ని కోరింది. రాష్ట్రం నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న వేళ ఢిల్లీలో నిర్మాణ ప్రదేశాల్లో నీటి వినియోగం, వాహనాలను కడగడం వంటి వాటిపై ప్రభుత్వం నిషేధం విధించింది. నీటిని వృథా చేసినవారికి రూ.2,000 జరిమానా విధిస్తామని పేర్కొంది.






# దేశ రాజధానిలో నీటి సంక్షోభం

**మట్టి కుండలతో కాంగ్రెస్ నిరసన**



**విశ్వంభర, ఢిల్లీ:** దేశ రాజధానిలో నీటి సంక్షోభం రోజు రోజుకు తీవ్రం అవుతున్న సంగతి తెలిసిందే. నగర ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. వాటర్ ట్యాంకర్ల వద్ద ఖాళీ బిందెలతో నీళ్ల కోసం ఎగబడుతున్న సంఘటనలు అనేకం. ఇదిలా ఉంటే ఢిల్లీ కాంగ్రెస్ నాయకులు శనివారం నగరమంతటా మట్టి కుండలను తలపై పెట్టుకుని నిరసన చేశారు. ఢిల్లీలోని మొత్తం 280 బ్లాకుల్లో ఉదయం 10 గంటలకు నిరసనలు ప్రారంభమయ్యాయి. తలపై మట్టి కుండలతో, కాంగ్రెస్ జెండాలను చేతిలో పట్టుకుని నిరసనకారులు ఢిల్లీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ.. నీటి సమస్యల పరిష్కారం గురించి చర్చించడానికి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో నీటి కొరతను తీర్చేందుకు ఢిల్లీ ప్రభుత్వం ముందుగా సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని, దీంతో ప్రజలు నీటి ట్యాంకర్ల వెంట పరుగులు తీయాల్సి వచ్చిందని అన్నారు. రానున్న రోజుల్లో నీటి కొరత మరింత ఎక్కువ అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేయాలని అన్నారు. యమునా నదికి తక్కువ నీరు చేరుతున్నందున ఢిల్లీలో నీటి సరఫరా నిరంతరం తగ్గుతోందని మంత్రి అతిషి శుక్రవారం చెప్పారు. ఢిల్లీకి దక్కాల్సిన నీటి వాటాను బీజేపీ పాలిత హర్యానా విడుదల చేయడం లేదని ఆప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది.

# ఆస్పత్రిలో చేరిన సీఎం నితీశ్ కుమార్


- చేతినొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిక
- ఆర్థో విభాగంలో చికిత్స అందిస్తున్న వైద్యులు
- నిలకడగా నితీశ్ కుమార్ ఆరోగ్యం



**విశ్వంభర, పాట్నా:** బీహార్ సీఎం నితీష్ కుమార్ శనివారం ఉదయం ఆకస్మాత్తుగా పాట్నాలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఉదయం నిద్ర లేవగానే ఆయనకు చేతినొప్పి రావడంతో ఆయన సన్నిహితులు వెంటనే వైద్యులను సంప్రదించారు. వారి సూచన మేరకు ఆస్పత్రిలో చేర్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సీఎం నితీశ్‌కుమార్ ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు తెలిపారు. ఆయనకు ఆర్థో విభాగంలో చికిత్స పొందిస్తున్నట్లు వెల్లడించారు. నితీశ్ కుమార్ శుక్రవారం ఉప కేబినెట్ సమావేశానికి పిలిచారు. ఈ సమావేశంలో బీహార్ ప్రభుత్వంలోని అన్ని శాఖల మంత్రులు పాల్గొని 25 అజెండాలను కూడా ఆమోదించారు. ఇదివరకూ నితీశ్ కుమార్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురయ్యారు. చికిత్స అనంతరం ఎన్నికల ప్రచారంలో చురుకుగా కనిపించారు. ఫలితాలు వచ్చాక బీహార్‌లో నితీశ్ ప్రభుత్వం ఏర్పాటైంది. సీఎం హోదాలో ఢిల్లీ వెళ్లి తమ పార్టీలోని నేతలకు కేంద్ర మంత్రి పదవులను తీసుకున్నారు. ఇదిలా ఉండగా, బీహార్‌లో మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జూన్ 29న జాతీయ కార్యవర్గ సమావేశాన్ని జేడీయూ ప్రకటించింది. ఈ సమావేశానికి ముందు నితీశ్ కుమార్ ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

# కేజ్రీవాల్ భార్య సునీతకు నోటీసులు

- వీడియో కాన్ఫరెన్స్ లో నిబంధనల ఉల్లంఘన
- కేజ్రీవాల్ కోర్టుకు హాజరైది సోషల్ మీడియాలో పోస్టు
- పోస్టులను తొలగించాలని కోర్టు ఆదేశాలు




**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు శనివారం నోటీసులు జారీ చేసింది. మార్చి 28న కోర్టు వ్యవహారాలకు సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్ లో నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ సమన్లు పంపింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేజ్రీవాల్ కోర్టుకు హాజరైన విషయాన్ని వీడియో, ఆడియోలో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని ఆరోపిస్తూ న్యాయవాది వైభవ్ సింగ్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు కార్యకలాపాలను రికార్డింగ్ చేయడానికి అరవింద్ కేజ్రీవాల్, ఆయన పార్టీ సభ్యులు కుట్ర పన్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ, అమిత్ శర్మలతో కూడిన డివిజన్ బెంచ్ దీనిపై విచారణ చేపట్టింది. ఈ పోస్టులను తొలగించాలని సునీతాతో పాటు పలు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లకు ఆదేశాలు జారీ చేసింది. పోస్టులను వెంటనే తొలగించాలని సూచించింది. సోషల్ మీడియా సంస్థలు నిబంధనలు పాటించాలని హెచ్చరించింది.

# సిక్కింలో వర్ష బీభత్సం

**వరదల్లో చిక్కుకుపోయిన పర్యాటకులు**

**ఆరుగురు వ్యక్తులు గల్లంతు**



**విశ్వంభర, సిక్కిం:** భారత ఈశాన్య రాష్ట్రమైన సిక్కింలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని వానతో పెద్ద ఎత్తున వరదలు వచ్చాయి. దీంతో పర్యాటకులు పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. బుధవారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ ఉత్తర సిక్కింలో 220 మి.మీకు పైగా వర్షం కురిసింది. దీంతో తీస్తాలో పెద్ద ఎత్తున వరదలు వచ్చాయి. ఈ వరదల ప్రభావిత ప్రాంతాల్లో 1,200 మందికి పైగా స్వదేశీ, విదేశీ పర్యాటకులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో ఇళ్లలోకి భారీగా నీరు చేరింది. ఇక, వాతావరణం అనుకూలించిన తర్వాత పర్యాటకులను ఇక్కడి నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. రోడ్ల మరమ్మతు పనులకు వారం రోజుల సమయం పట్టవచ్చని చెబుతున్నారు. వరదల్లో ఇప్పటి వరకు ఆరుగురు గల్లంతు కాగా వారిలో ముగ్గురి మృతదేహాలు లభ్యమైనట్లు చెప్పారు. కాగా, సిక్కింలోని సంక్లాంగ్ ప్రాంతంలో వంతెన కొట్టుకుపోయి చుంగ్థాంగ్, లాచుంగ్ ప్రాంతాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ అధికారులతో సమీక్షించారు. బాధిత ప్రాంతాలకు సంబంధించిన పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. వరదల్లో చిక్కుకుపోయిన పర్యాటకులను ప్రత్యేక విమానంలో తరలించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు సిక్కిం సీఎస్ విజయ్ భూషణ్ పాఠక్ తెలిపారు.




# శాఖలన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవే

## జనసేన సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్నాయి

- ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చేవి
- 2008 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నా
- మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెడతా
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**విశ్వంభర, అమరావతి:** తనకు కేటాయించిన శాఖలు మనసుకు, జనసేన సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం ఆయన ప్రెస్‌నోట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పదవితో పాటు తనకు కేటాయించిన పలు శాఖలపై స్పందించారు. మంత్రివర్గంలో పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలను అప్పగించగా.. ఆయా శాఖలన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవి, ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చేవిగా తాను భావిస్తున్నానని జనసేనాని పేర్కొన్నారు. 2008 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నానని.. తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించానన్నారు. 2019 ఎన్నికలకు ముందు ప్రజా పోరాట యాత్రను ప్రజల సమస్యల అవగాహన, మౌలిక సదుపాయాల కల్పనపై అధ్యయనం కోసమే చేపట్టానన్నారు. చాలా లోతుగా ఆనాడు స్వయంగా పరిశీలన జరిపానని.. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై బలమైన అవగాహన ఏర్పడిందన్నారు. విశాఖ మనంలో పర్యటించిన సమయంలో 'కురిడి' అనే గిరిజన గ్రామానికి వెళ్లానని, ఆ గ్రామ ఆడపడుచులు గుక్కెడు నీటి కోసం తాము పడుతున్న అవస్థలు చెబుతూ.. అక్కడి బావిలో కలుషితమైపోయిన నీటిని చూపించారన్నారు. ఆ ప్రాంతంలోనే తోటవలస గ్రామానికి వెళ్లిన సమయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆ ఊరి ప్రజలు వివరించారని గుర్తు చేసుకున్నారు. గోదావరి జిల్లాలకు వెళ్లినప్పుడు పలు మత్స్యకార గ్రామాల వాసులు తాగునీటికి పడుతున్న ప్రయాసలను వివరించారన్నారు. గ్రామీణ అభివృద్ధి - దేశాభివృద్ధి అనే నినాదం నామమాత్రంగా మిగిలిపోవడాన్ని తాను గమనించానని, గుక్కెడు మంచి నీరు కోసం మైళ్ల దూరం వెళ్లి ప్రయాసతో బిందెడు నీరు తెచ్చుకుంటున్న ఆడపడుచుల అవస్థలు చూశానని, కాలుష్యమయమైన జల వనరులనే తాగునీరుగా తప్పని పరిస్థితులలో వాడుకుంటున్న పల్లెవాసులను గమనించానన్నారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా పల్లెలకు రక్షిత తాగునీరు అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం అనేది జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటని.. ఈ విషయం ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు.

ఓ వైపు పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరగాలని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందాలని తాను గట్టిగా కోరుకుంటున్నానన్నారు. అయితే ఆ అభివృద్ధి పర్యావరణానికి హితంగా జరగాలని.. ఆధునిక సాంకేతికత మేళవించిన సురక్షితమైన పారిశ్రామిక అభివృద్ధి ఈ సమాజానికి అవసరమన్నారు. విశాఖ ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదాన్ని మనం ఏనాడూ మరచిపోలేమని.. ప్రజల ఆరోగ్యాలను హరించి వేయకుండా పరిశ్రమలు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకునేలా పరిశ్రమలు ముందుకు వెళ్లేందుకు చేయూతనిస్తామన్నారు. భూ తాపాన్ని తగ్గించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలకు బాసటగా నిలుస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకునేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే సూక్తి తన మదిలో ఎప్పుడూ మారుమోగుతుంటుందని, ఒక్క వృక్షాన్ని రక్షించుకుంటేనే మానవ కోటికి ఎంతో మేలు కలుగుతున్నప్పుడు.. మరి లక్షలాది వృక్షాలను తన గర్భాన నిలుపుకున్న అడవి తల్లిని కంటికి రెప్పలా కాపాడుకుంటే ఎంతో మేలు కలుగుతుందన్నారు. అడవుల విధ్వంసమే కరవు కాటకాలకు హేతువని.. అలాంటి అడవులను కంటికి రెప్పలా కాపాడుతామన్నారు. ఎర్రచందనం, అటవీ సంపద అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. అడవుల వినాశనానికి పాల్పడినా, ప్రయత్నించినా ఎంతటి వారైనా సరే కటకటాల వెనక్కు వెళ్లాల్సిందేనని పవన్ కళ్యాణ్ చెప్పారు.

# జగన్ సైకో.. మళ్లీ నిరూపించుకుండు

- అమరావతిని రాజధానిగా ఎదగనివ్వలే
- కళ్లు తెరిచి పని చేస్తే కనీసం ప్రతిపక్ష హోదా ఉండేది
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ధ్వజం



**విశ్వంభర, విజయవాడ:** మాజీ సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న విమర్శలు చేశారు. ఆయన ఇంకా భ్రమల్లోనే బతుకుతున్నారని అన్నారు. ఐదేళ్లు కళ్లు మూసుకుంటే అధికారం దక్కుతుందని జగన్ కలలు కంటున్నారని పేర్కొన్నారు. కానీ అధికారంలో ఉన్న ఐదేళ్లు కళ్లు మూసుకుని ఉన్నందుకే ఇప్పుడు ప్రతిపక్ష హోదా కూడా రాలేదని ఎద్దేవా చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పెద్ద సైకో అని మరోసారి నిరూపించుకున్నాడని బుద్ధా వెంకన్న విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమరావతిని రాజధానిగా ఎదగనివ్వలేదని బుద్ధా వెంకన్న అన్నారు. ఉద్దేశపూర్వకంగానే అప్పుడు అమరావతిని చంపేసేందుకు శాసన మండలిని రద్దు చేస్తానని జగన్ అన్నారని గుర్తు చేశారు. అప్పుడు మండలి అవసరం లేదని చెప్పి.. ఇప్పుడు మండలిలో తమకు బలం ఉందని చిలక పలుకులు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లు జగన్ కళ్లు మూసుకుని పని చేశాడని.. కళ్లు తెరిచి పనిచేసి ఉంటే కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కేదని అన్నారు. నిర్లక్ష్య పాలన కారణంగానే జగన్‌ను ప్రజలు 11సీట్లకు పరిమితం చేశారని విమర్శించారు. అసలు అవినీతి కేసుల్లో శిక్ష పడితే జగన్‌కు పోటీ చేసే అవకాశం కూడా ఉండదని అన్నారు.

# పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు

- ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ సమీక్షలు
- స్కూళ్లలో మౌలిక వసతులపై ఆదేశాలు



విశ్వంభర, విజయవాడ: ఇక నుంచి ఏపీలో ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా ఉంటాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో అమలుచేసిన పారదర్శక విధానాలనే ఇప్పుడు కూడా అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. శనివారం ఉండవల్లి నివాసంలో ఆయన విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. విద్యాశాఖలో పూర్తి స్థాయి మార్పులు రావాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మధ్యలోనే ఆగిపోయిన ఫేజ్ 2 పనులు, ఫేజ్ 3 పనులను పూర్తి చేయలని అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లలో సదుపాయాలను పూర్తి స్థాయిలో అందించాలని ఆదేశించారు. ఇక స్కూళ్లలో మధ్యాహ్న భోజనంపై కూడా ఆరా తీశారు నారా లోకేష్. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం కూడా రుచికరంగా, నాణ్యతతో ఉండాలిన సూచించారు.

స్కూళ్లలో పారిశుధ్యం నిర్వహణకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం సహా ఇతర రాష్ట్రాల్లో స్కూల్స్ శానిటేషన్ విధానాలను అధ్యయనం చేసి వాటినే మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థకే ప్రాధాన్యత ఎక్కువ ఇస్తామని ఆయన వివరించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని స్కూల్స్ ను గత ప్రభుత్వంలో మూసేశారో, అందుకు కారణాలను తెలిపాలన్నారు. దాంతో పాటు సీబీఎస్ఈ స్కూళ్ల వినియోగంపై కూడా పూర్తి స్థాయి వివరణ అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# పవన్‌కు వదిన సురేఖ అదిరిపోయే గిఫ్ట్



**విశ్వంభర, అమరావతి:** పవన్ కల్యాణ్ కు ఏపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పదవితో పాటు కీలక శాఖలు దక్కిన సంగతి తెలిసిందే. అయితే ఏపీలో గెలిచినప్పటి నుంచి పవన్ కల్యాణ్ ప్రతి విషయాన్ని తన అన్నయ్య చిరంజీవితో పంచుకుటున్నారు. ఇందులో భాగంగానే ఏపీలో శాఖలు కేటాయించిన తర్వాత పవన్ కల్యాణ్ నేరుగా చిరంజీవి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా వదిన సురేఖ పవన్ కల్యాణ్ కు ఓ బహుమతిని ఇచ్చింది. ఆమె గిఫ్ట్ అందిస్తున్న వీడియోను చిరంజీవి అభిమానులతో పంచుకున్నారు. కల్యాణ్ బాబుకు వదినమ్మ బహుమతి అంటూ ఆయన రాసుకొచ్చారు. అయితే ఆమె అందించిన గిఫ్ట్ ఏదో కాదండోయ్... ఖరీదైన పెన్నును బహుమతిగా అందించారు సురేఖ. దాన్ని పవన్ కల్యాణ్ స్వయంగా జేబులో పెట్టారు. దీంతో పవర్ స్టార్ ఆనందంతో వదినమ్మను కౌగిలించుకుని తన సంతోషాన్ని వ్యక్త పరిచారు. ఇంతటి అద్భుతమైన బహుమతిని అందించిన చిరంజీవి, వదినమ్మలకు ఆయన థాంక్స్ చెప్పారు. ఏపీ ప్రజల ఆశలను నిజం చేస్తావని ఆశిస్తున్నా అంటూ వీడియో చివరలో రాసుకొచ్చారు చిరంజీవి.

# పవన్‌కే డిప్యూటీ సీఎం పదవి ఎలా?

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఇవ్వాల్సి
- జగన్ సామాజిక న్యాయం పాటించారు
- చంద్రబాబు కూటమిలో సామాజిక న్యాయం ఉందా
- వైసీపీ నేత పోతిన మహేష్



**విశ్వంభర, విజయవాడ:** అసలు చంద్రబాబు కూటమిలో సామాజిక న్యాయం ఎక్కడ అని ఉందని వైసీపీ నేత పోతిన మహేష్ ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీలను, ఎస్సీలను, ఎస్టీలను, ముస్లింలను చంద్రబాబు అగౌరవపరిచారని విమర్శించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ పది మందికి ఉప ముఖ్యమంత్రి పదవులను ఇచ్చారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు, మైనారిటీ సామాజిక వర్గాలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి సామాజిక న్యాయం పాటించారని అన్నారు. వైఎస్ జగన్ సోషల్ ఇంజనీరింగ్ లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చే ప్రయత్నం చేశారన్నారు. కేవలం పవన్ కళ్యాణ్ కే ఉప ముఖ్యమంత్రి పదవి ఎలా? గతంలో జగన్ చేసిన దానికంటే మిన్నగా పని చేయాల్సిన అవసరం ఉందని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాల్సిన అవసరం ఉందని కానీ అలా చేయలేదని ఆయన మండిపడ్డారు. కేవలం పవన్ కళ్యాణ్‌కు మాత్రమే ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి మిగతా అన్ని వర్గాలను అవమానించారని, మంత్రివర్గ ఏర్పాటులో సామాజిక న్యాయం పాటించలేదని అన్నారు.

పాలనా పగ్గాలు చేపట్టిన మొదటి రోజే సామాజిక మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కష్టాలలో ఉన్నప్పుడు, ఇబ్బందులలో ఉన్నప్పుడు, పోరాటం చేయాల్సి వచ్చినప్పుడు, కేసులు పెట్టించుకోవలసి వచ్చినప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు అందరూ కావాలని, కానీ పదవులు ఇచ్చే సమయంలో మాత్రం వారు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. చంద్రబాబు తమ నిర్ణయంతో ఈ వర్గాలను అవమానించారని పేర్కొన్నారు. మంత్రి పదవులు సామాజిక సమీకరణాల మేరకు చేశామని చెబుతున్న చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవి విషయంలో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదేనా మీరు చేసిన సామాజిక న్యాయం అంటూ పోతిన మహేశ్ నిలదీశారు.



# మామయ్య గెలుపు..

- కాలినడకన తిరుమల కొండ ఎక్కిన మెగా హీరో

విశ్వంభర, తిరుపతి: మెగా హీరో సాయిధరమ్ తేజ్ తిరుమల కొండకు కాలనడకన వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నాడు. ఎన్నికల్లో తన మామయ్య పవన్ కల్యాణ్ గెలిస్తే కాలినడకన తిరుమల వస్తానని మెగా హీరో సాయి ధరమ్ తేజ్ మొక్కుకున్నాడు. ఆ మొక్కును తీర్చుకోవడానికి సాయిధరమ్‌తేజ్ కాలినడకన తిరుమలకు వెళ్లాడు. ఎన్డీయేలో భాగం అయిన జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ సీట్లకు గాను 21 విజయం సాధించిన విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకంగా 164 సీట్లు సాధించి తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాత్ర ఎంతో ఉందనే చెప్పాలి. పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం గా ప్రమాణ స్వీకారం చేశారు. గత ఎన్నికల్లో ఓటమిని చవి చూసినా పవన్ కల్యాణ్ ఎంతో ఓర్పుతో వ్యవహించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల కూడదు అనే ఉద్దేశంతో ఈసారి టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేశారు. పవన్‌కు తోడుగా పిఠాపురంలో ఆయన గెలుపునకు మెగా ఫ్యామిలీ అండగా నిలిచింది. మెగా హీరోలు వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్, వైష్ణవ తేజ్ పిఠాపురంలో ప్రచారం కూడా చేశారు. అదేవిధంగా సినీ ఇండస్ట్రీలో పలువురు ప్రముఖులు పవన్ కల్యాణ్‌కు మద్దతు తెలిపారు. ఫలితంగా పవన్ అద్భుత విజయం సాధించడంతో సాయి ధరమ్ తేజ్ తిరుమలకు కాలినడకన వెళ్లారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఏపీ అసెంబ్లీ సమావేశాలకు వేళాయే

**జూన్ 17 నుంచి 21 వరకు సమావేశాలు**




**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఏపీలో కొత్త ప్రభుత్వానికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయగా.. మరుసటి రోజు 13న సచివాలయంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. 14న మంత్రులకు శాఖలు కేటాయించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు కొత్త ప్రభుత్వం సిద్ధమవుతోంది.

ఈ నెల 17న కేబినెట్ తొలి సమావేశం జరపాలని నిర్ణయించింది. తొలి రోజు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం ఉంటుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం రెండో రోజు స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఉపసంహరణ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించే అవకాశం ఉందని సమాచారం. అదే విధంగా అసెంబ్లీ సమావేశాల నాటికి ఏపీలో శాంతిభద్రతల పరిస్థితి, పోలీసు హింస, లాక్ అప్ డెత్, అధికార దుర్వినియోగం, పోలీసుల పక్షపాత వైఖరి తదితర అంశాలపై పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆయా ఎస్పీలు, సీపీలకు ప్రభుత్వం లేఖలు రాసింది.

# అత్యుత్తమ రాజధానిగా అమరావతి నిర్మిస్తాం

**రెండున్నర రాజధాని పూర్తి చేస్తాం**

**మంత్రి పొంగూరు నారాయణ**



**విశ్వంభర, అమరావతి:** అత్యుత్తమ రాజధానిగా అమరావతిని నిర్మిస్తామని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని అమరావతి అభివృద్ధి బాధ్యతను చంద్రబాబు తనపై ఉంచారని వెల్లడించారు. చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. అమరావతిలో అనేక భవనాల నిర్మాణం వివిధ దశల్లో నిలిచిపోయిందని నారాయణ వెల్లడించారు. పక్కా ప్రణాళికతో రెండున్నర సంవత్సరాల్లోనే ఏపీ రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇక, రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ చెప్పారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.

# కార్యకర్తలది అలుపెరగని శ్రమ

- కూటమి గెలుపుకు వాళ్లే కారణం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కార్యకర్తలు, నాయకులతో టెలీ కాన్ఫరెన్స్
- ప్రతి శనివారం పార్టీ ఆఫీసుకు సీఎం



విశ్వంభర, మంగళగిరి: సీఎం చంద్రబాబు నాయు గతంలో కంటే భిన్నంగా ఈ సారి పాలన సాగించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే పార్టీతో సమన్వయం కూడా లోపించకుండా జాగ్రత్త తీసుకుంటున్నారు సీఎం. ఇందులో భాగంగానే శనివారం మంగళగిరిలోని పార్టీ ఆఫీస్ కు ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పలువురు కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు చంద్రబాబు.

అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ఘన విజయం సాధించడం వెనుక నాయకులు, కార్యకర్తల అలుపెరగని శ్రమ, అపార కృషి ఉందని కొనియాడారు. ఇక నుంచి పార్టీ కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. గత 20 ఏళ్లలో గెలవని చోట గెలిచామని, ఈ విజయం కార్యకర్తలకు అంకితం అని ఆయన ప్రకటించారు. అంతే కాకుండా ఇక నుంచి ప్రతి శనివారం మంగళగిరి పార్టీ ఆఫీసుకు తాను వస్తానని, అందరి సమస్యలు వింటానని తెలిపారు చంద్రబాబు నాయుడు. 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 57 శాతం ఓట్ షేర్‌ను కూటమి సాధించిందన్నారు. ఇక ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి గెలుపులో కీలకంగా వ్యవహరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు చంద్రబాబు నాయుడు.


# నామినేటెడ్ పదవులపై సర్కార్ ఫోకస్

- పార్టీ కోసం కష్టపడ్డ వారికి పెద్దపీట
- త్వరలో భర్తీ చేస్తామన్న సీఎం చంద్రబాబు

విశ్వంభర, అమరావతి: నామినేటెడ్ పదవుల భర్తీపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోకస్ పెట్టారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి నామినేటెడ్ పదవులిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా జాప్యం చేయకుండా నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని ఆయన భావిస్తున్నారు. పార్టీ ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో జరిపిన టెలీ కాన్ఫరెన్సులో చంద్రబాబు స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. కూటమి విజయాన్ని కార్యకర్తలకు అంకితం చేసినట్లు టెలీ కాన్ఫరెన్సులో చంద్రబాబు పేర్కొన్నారు. ఘన విజయానికి కారణమైన కార్యకర్తల రుణం తీర్చుకుంటామన్నారు. త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుందన్నారు. ఎవరు ఏ మేరకు పని చేశారోననే సమాచారం పార్టీ దగ్గర ఉందన్నారు.

కష్టపడిన వారికి ప్రోత్సాహం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చామని కక్ష సాధింపు చర్యలకు పాల్పడొద్దన్నారు. గత ప్రభుత్వంలో తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించడం ఖాయమన్నారు. గతంలో ఏర్పాటు చేసిన చోటే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని.. వంద రోజుల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ జరుగుతుందన్నారు. గత 20 ఏళ్లలో గెలవని సీట్లు ఇప్పుడు వచ్చాయంటే అది గాలివాటం కాదు, ప్రజలు నమ్మకంతో ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు అని వెల్లడించారు. కూటమి 93 శాతం స్ట్రైట్ రేట్ తో... 57 శాతం ఓట్ షేర్ ను సాధించిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన మెజారిటీని మనం కాపాడుకోవాలని నేతలకు సూచించారు. కార్యకర్తలకు సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉంటానని సీఎం చంద్రబాబు తెలిపారు.





# దక్షిణాఫ్రికా విన్.. నేపాల్ భళా!

## ముచ్చెమటలు పట్టించిన పసికూన నేపాల్

### ఒక పరుగు తేడాతో మ్యాచ్ గెలుపు

### సూపర్8కు దక్షిణాఫ్రికా అర్హత


### క్రికెట్ ఫ్యాన్స్ హృదయాలను గెలుచుకున్న నేపాల్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్ 2024లో పసికూన నేపాల్ జట్టు దక్షిణాఫ్రికాకు ముచ్చెమటలు పట్టించింది. దాదాపు ఓడించినంత పని చేసింది. ఓ దశలో నేపాల్ సంచలన విజయం నమోదు చేసేలా కనిపించినా.. ఆఖరి బంతికి బోల్తాపడి ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ఓడినా నేపాల్ ప్రదర్శన మాత్రం క్రికెట్ ఫ్యాన్స్ హృదయాలను గెల్చుకుంది. కింగ్‌స్టౌన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన నేపాల్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పక్కా ప్రణాళికతో బరిలోకి దిగిన నేపాల్.. దక్షిణాఫ్రికా జట్టు స్వల్ప స్కోరుకే పరిమితం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు ప్లేయర్లు క్లాసెన్ (3), డేవిడ్ మిల్లర్ (7) లాంటి ప్లేయర్లను కట్టడి చేసింది. పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డ ప్రొటీస్ చివరకు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ 18 బంతుల్లో 27 పరుగులతే రాణించాడు. నేపాల్ బౌలర్లలో కుశాల్ బుర్టెల్ 4, దీపేంద్ర సింగ్ 3 వికట్లు పడగొట్టారు. అనంతరం ఛేజింగ్‌కు దిగిన నేపాల్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. బౌలింగ్‌లో 4 వికెట్లు తీసిన కుశాల్ బుర్టెల్ బ్యాటింగ్‌లోనూ 13 పరుగులు చేశాడు. ఆసిఫ్ షేక్ (42), అనిల్ షా (27) రాణించడంతో నేపాల్ లక్ష్యం దిశగా సాగింది. నేపాల్ విజయానికి చివరి 5 ఓవర్లలో 25 పరుగులు అవసరమయ్యాయి. చేతిలో 7 వికెట్లు ఉండటంతో ఆ జట్టు సంచలనం సృష్టించేలా కనిపించింది. కానీ స్పిన్నర్ షంషీ.. వరుసగా వికెట్లు తీస్తూ.. దక్షిణాఫ్రికాను పోటీలోకి తెచ్చాడు. 16 ఓవర్లో 4, 17 ఓవర్లో 3 పరుగులు మాత్రమే వచ్చాయి. 18 ఓవర్‌లో 2 వికెట్లు తీసిన షంసీ.. కేవలం 2 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఇక చివరి రెండు ఓవర్లలో నేపాల్ విజయానికి 16 పరుగులు అవసరం కాగా.. 19 ఓవర్‌లో 8 రన్స్ వచ్చాయి. చివరి ఓవర్‌లో 8 పరుగులు అవసరమయ్యాయి. బార్ట్‌మన్ వేసిన ఈ ఓవర్‌లో తొలి రెండు బంతులకు పరుగులేమీ రాలేదు. మూడో బంతికి నాలుగు పరుగులు రాగా, నాలుగో బంతికి 2 రన్స్ వచ్చాయి. ఈ దశలో సమీకరణం 2 బంతుల్లో 2 రన్స్‌గా మారింది. క్రీజులో గుల్షాన్ ఉన్నాడు. ఐదో బంతిని పరుగు తీయలేకపోయిన గుల్షాన్ చివరి బంతికి రనౌట్ అయ్యాడు. దీంతో ఒక్క రన్ తేడాతో నేపాల్ ఓడిపోయింది. దక్షిణాఫ్రికా గెలుపు గీతను దాటింది. ఈ ఫలితంలో నేపాల్ క్రికెటర్లతో పాటు.. ఫ్యాన్స్ నిరాశకు గురయ్యారు. మ్యాచ్ అనంతరం దాదాపు ఏడ్చినంత పనిచేశారు. 4 మ్యాచుల్లో 4 విజయాలతో టేబుల్ టాపర్‌గా నిలిచి సూపర్ 8కు వెళ్లింది. ఈ మ్యాచ్‌లో అన్రిచ్ నోర్ట్జే 3, తబ్రైజ్ షమ్సీ 1 వికెట్ తీశాడు.

# టీమిండియా, కెనడా మధ్య మ్యాచ్ రద్దు

## టాస్ పడకుండానే రద్దైన మ్యాచ్

## ఆటంకం కలిగించిన వర్షం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్ 2024 మెగా టోర్నీలో టీమిండియా ఆఖరి గ్రూప్ మ్యాచ్ రద్దైంది. గ్రూప్‌ఏలో భాగంగా టీమిండియా, కెనడ మధ్య ఫ్లోరిడా వేదికగా శనివారం జరగాల్సిన మ్యాచ్ వర్షార్పణం అయిపోయింది. దీంతో టాస్ పడకుండానే మ్యాచ్ రద్దు అయ్యింది. గ్రూప్‌ఏలో వరుసగా మూడు మ్యాచ్లుద గెలిచిన భారత్.. ఇప్పటికే సూపర్ 8కు చేరింది. గ్రూప్‌ఏలో టాప్ ప్లేస్తోం సూపర్ 8కు దూసుకెళ్లింది. అయితే ఫ్లోరిడా వేదికగానే అమెరికా, ఐర్లాండ్ మ్యాచ్ శుక్రవారం రద్దయింది. ఆ తర్వాత కూడా వాన పడింది. అదే స్టేడియంలో జరగాల్సిన భారత్, కెనడా మ్యాచ్ కూడా క్యాన్సిల్ అయింది.

**ఔట్‌ఫీల్డ్ చిత్తడిగా మారింది**

ఈ మ్యాచ్ జరగాల్సిన ఫ్లోరిడా స్టేడియం వద్ద శనివారం వర్షం పడింది. అయితే, వాన ఆగినా ఔట్‌ఫీల్డ్ మాత్రం చిత్తడిగా మారింది. మైదానంలో చాలా చోట్ల నీరు నిలిచింది. నీటిని తొలగించేందుకు గ్రౌండ్ స్టాఫ్ చాలా సేపు శ్రమించారు. అయినా ఫలితం లేకపోయింది. రెండు సార్లు మైదానాన్ని పరీక్షించి.. మ్యాచ్ ఆడేందుకు గ్రౌండ్ పరిస్థితి సరిగా లేదని నిర్ణయించిన అంపైర్లు ఈ మ్యాచ్నుం రద్దు చేసేశారు. టీ20 ప్రపంచకప్ 2024 గ్రూప్‌ఏలో టాప్2లో నిలిచిన భారత్, అమెరికా సూపర్ 8 దశకు చేరుకున్నాయి. మిగిలిన మూడు జట్లు ఔటయ్యాయి. ఐర్లాండ్, పాకిస్థాన్, అమెరికాపై టీమిండియా గెలిచింది. కెనడాతో మ్యాచ్ రద్దయింది. దీంతో ఏడు పాయింట్లతో గ్రూప్‌ఏలో టాప్ ప్లేస్ దక్కించుకుంది. అమెరికా మూడు మ్యాచ్ల్లో రెండు గెలువగా.. ఓ మ్యాచ్ రద్దయింది. దీంతో ఐదు పాయింట్లతో రెండో స్థానాన్ని ఖరారు చేసుకొని ఆ జట్టు కూడా సూపర్ 8కు దూసుకెళ్లింది. ప్రపంచకప్ తొలిసారి ఆడుతున్న ఆ జట్టు పాకిస్థాన్నుట ఓడించటంతో పాటు సూపర్ 8 చేరి అద్భుతం చేసింది.

**టీమిండియా తదుపరి మ్యాచ్ లు**

టీ20 ప్రపంచకప్లో తదుపరి సూపర్-8, సెమీఫైనల్స్, ఫైనల్స్ వెస్టిండీస్ వేదికగా జరగనున్నాయి. ప్రపంచకప్ గ్రూప్-1 సూపర్-8లో టీమిండియా జూన్ 20వ తేదీన అఫ్గానిస్థాన్తోడ తలపడనుంది. జూన్ 22వ తేదీన తదుపరి మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-డీలో రెండో స్థానంలో నిలిచే జట్టుతో ఆ మ్యాచ్లోస తలపడనుంది. ఇక సూపర్-8లో జూన్ 24వ తేదీన టీమిండియా, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరగనుంది. అదే విధంగా సూపర్-8లో 8 జట్లు రెండు గ్రూప్లుమగా ఆడతాయి. రెండు గ్రూప్లో టాప్-2లో నిలిచే నాలుగు జట్లు సెమీఫైనల్లలో తలపడతాయి.

# మహిళల టేబుల్ టెన్నిస్ జట్టుకు కాంస్యం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** రష్యాలో జరుగుతున్న బ్రిక్స్ గేమ్స్‌లో భారత మహిళల టేబుల్ టెన్నిస్ జట్టు కాంస్య పతకం సాధించింది. శనివారం జరిగిన సెమీస్‌లో పోయిమంటి బైస్యా, మౌమిత దత్తా, యాషిని శివశంకర్‌లతో కూడిన భారత జట్టు 13 తేడాతో చైనా టీమ్ చేతిలో ఓడిపోయి మూడో స్థానంతో సరిపెట్టింది. మొదట ఈ మ్యాచ్‌లో యాషిని తొలి గేమ్‌ను నెగ్గి భారత్‌కు శుభారంభం అందించింది. ఆ తర్వాత భారత్ అదే జోరు కొనసాగించలేకపోయింది. చైనా వరుసగా మూడు గేమ్‌ల్లో విజయం సాధించి మ్యాచ్‌ను సొంతం చేసుకోవడంతో భారత్ కాంస్యం సరిపెట్టింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇదే తొలి మెడల్. అలాగే, ఈ టోర్నీ చరిత్రలో మహిళల టెన్నిస్ జట్టు తొలి పతకం సాధించింది. మరోవైపు, ఈ టోర్నీలో భారత పురుషుల టేబుల్ టెన్నిస్ జట్టు 5వ స్థానంలో నిలిచింది. 5వ స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లో భారత్ 31 తేడాతో బహ్రెయిన్ టీమ్‌ను చిత్తు చేసింది.

# యూరో చాంపియన్‌షిప్ 2024 షురూ

## బోణీ కొట్టిన స్విట్జర్లాండ్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఫుట్ బాల్ అభిమానులు ఆసక్తికగా ఎదురుచూసిన ప్రతిష్ఠాత్మక యూరో చాంపియన్‌షిప్ 2024 మొదలైంది. జర్మనీలో సందడి వాతావరణం నడుమ సాకర్ పండుగ షురూ అయింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద క్రీడా పండుగ యూరోపియన్ సాకర్ టోర్నీకి జర్మనీ వేదికగా తెరలేచింది. ఫుట్ బాల్ అభిమానులకు వచ్చే నాలుగు వారాలు ఇక పండుగే పండుగ. నాలుగు సంవత్సరాలకు ఓసారి జరిగే ప్రపంచ క్రీడల పండుగ ఒలింపిక్స్, ప్రపంచ ఫుట్ బాల్ చాంపియన్షిప్ తర్వాత.. మూడో అతి పెద్ద క్రీడా సంబరం.. యూరోపియన్ ఫుట్ బాల్ టోర్నీకి జర్మనీ వేదికగా తెరలేచింది. ఈసారి 24 జట్లు టైటిల్ వేటకు సిద్ధమయ్యాయి. ఒక్కదాంట్లో నాలుగు చొప్పున ఈ జట్లను మొత్తం ఆరు (ఏబీసీడీఈఎఫ్) గ్రూప్‌లుగా విభజించారు. టోర్నీ తొలి పోరులో ఆతిథ్య జర్మనీ జయభేరి మోగించింది. స్కాంట్లాండ్‌పై 51తో అద్భుత విజయం సాధించి మూడు పాయింట్లు ఖాతాలో వేసుకుంది.

**నెలరోజుల పాటు టోర్నీ**

అనంతరం జరిగిన పోరులో స్విట్జర్లాండ్ బోణీ కొట్టింది. హంగేరీ జట్టుపై 31తో స్విస్ జట్టు సూపర్ విక్టరీ సాధించింది. ఇక గ్రూప్ 'బి' నుంచి స్పెయిన్, క్రొయేషియా జట్లు తొలి మ్యాచ్‌లో తలపడనున్నాయి. జర్మనీ వేదికగా యూరో చాంపియన్‌షిప్ నెల రోజుల పాటు జరగనుంది. స్టార్ ఆటగాళ్ల స్టన్నింగ్ గోల్స్‌తో పాటు ఉత్కంఠ పోరాటాలు ఫ్యాన్స్‌ను అలరించనున్నాయి. ఫిఫా వరల్డ్ కప్ తర్వాత అతి పెద్దదైన ఈ మెగా టోర్నీని 10 స్టేడియాల్లో నిర్వహించనున్నారు. వాటిలో బెర్లిన్‌లోని ఒలింపియా స్టేడియం, మ్యూనిచ్‌లోని అలియంజ్ అరెనా మైదానాలు ముఖ్యమైనవి. యూరో చాంపియన్‌షిప్‌లో ఇటలీ డిఫెండింగ్ చాంపియన్‌గా అడుగుపెట్టిం. 2020లో ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్లో ఇటలీ ఫ పెనాల్టీలతో జయభేరి మోగించి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది.



# ఈపీఎఫ్ఓలో మారిన పీఎఫ్ విత్ డ్రా రూల్స్





**విశ్వంభర, బిజినెస్:** మీ ఈపీఎఫ్ ఖాతా నుంచి నగదును తీసుకోవాలనుకుంటున్నారా? అయితే ఇది మీ కోసమే! కరోనా సమయంలో తీసుకువచ్చిన కోవిడ్ అడ్వాన్స్ సదుపాయాన్ని నిలిపివేస్తున్నట్లు ఈపీఎఫ్ఓ ప్రకటించింది. కరోనా కారణంగా ఉద్యోగాల కోత, వేతన కోత వంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక ప్రయోజనం చేకూరేలా పీఎఫ్‌ను ఉపసంహరించుకునే వెసులుబాటు కల్పించారు. ఈఫీఎఫ్ ఖాతా నుంచి 75 శాతం తీసుకునేందుకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు, కరోనా పూర్తిగా తగ్గిపోయిన నేపథ్యంలో నగదు ఉపసంహరణ నిబంధలను మార్చింది. కరోనా మహమ్మారి లేనందువల్ల అడ్వాన్స్ మొత్తం తీసుకునే అవకాశాన్ని నిలిపివేసినట్లు ఈపీఎఫ్ఓ తెలిపింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2020లో కరోనా మొదటి వేవ్ సమయంలో ఈపీఎఫ్ఓ ఈ సదుపాయాన్ని తీసుకువచ్చింది. రెండో వేవ్ వచ్చినప్పుడు దీనిని పునరుద్ధరించారు. దాదాపు నాలుగేళ్లు ఇది అందుబాటులో ఉంది. తొలుత ఒకసారి మాత్రమే అడ్వాన్స్ తీసుకునే వెసులుబాటు కల్పించినప్పటికీ... ఆ తర్వాత పలుమార్లు పునరుద్ధరించారు. ఇప్పుడు దీనిని నిలిపివేశారు. అడ్వాన్స్ సదుపాయం నిలిచిపోయినప్పటికీ ఇంటి కొనుగోలు, పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగం కోల్పోవడం, అనారోగ్యం వంటి సందర్భాల్లో ఈపీఎఫ్ ఖాతాలోని నిర్దిష్ట పరిమితి మేరకు ఉపసంహరించుకోవచ్చు.

# నాడు లక్ష కోట్ల విలువైన కంపెనీ.. నేడు దాని విలువ సున్నా..

**విశ్వంభర, బిజినెస్:** ప్రపంచ దేశాలను కరోనా వణికించిన కాలంలో బైజూస్ కంపెనీ ఓ వెలుగు వెలిగింది.. ఇంటికే పరిమితమైన పిల్లలకు, వారి భవిష్యత్తుపై తల్లిదండ్రుల టెన్షన్‌కు చక్కటి పరిష్కారంగా కనిపించింది. దీంతో ఎడాపెడా లాభాలను అర్జించిన బైజూస్.. ఒక దశలో రూ. లక్ష కోట్ల విలువైన కంపెనీగా మారింది. బైజూస్ షేర్లు, ఆ కంపెనీలో వాటాల విలువ చుక్కల్లోకి చేరాయి. బైజూస్ మరింత ఎత్తుకు ఎదుగుతుందనే నమ్మకంతో ఓ ఇన్వెస్ట్ మెంట్ కంపెనీ అందులో పెట్టుబడులు పెట్టింది.కంపెనీలో 10 శాతం వాటాకు అప్పట్లో ఏకంగా 500 మిలియన్ డాలర్ల (మన రూపాయల్లో 4 వేల కోట్ల పైమాటే) ను వెచ్చించింది. కొనుగోలు చేసిన తొలినాళ్లలో ఈ వాటా విలువ పెరుగుతూ పోయింది. ఆ తర్వాత వేగంగా పడిపోవడం మొదలుపెట్టింది. ప్రస్తుతం ఈ వాటా విలువను హెచ్ఎస్ బీసీ సున్నాగా తేల్చింది. కరోనా ప్రభావం తగ్గడంతో స్కూళ్లు తిరిగి తెరుచుకోవడం స్టార్ట్ కావడంతో బైజూస్ కు ఆదరణ తగ్గిపోవడం మొదలైంది. ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టిన కంపెనీ.. పలు స్కూళ్లతో ఒప్పందం కుదుర్చుకుని మార్కెట్లో నిలదొక్కుకునే ప్రయత్నం చేసింది. అయితే, ఈ ప్రయత్నంలో మేనేజ్ మెంట్ నిర్ణయాలు బెడిసికొట్టడంతో బైజూస్ ప్రభ క్షీణించడం మొదలైంది. ఓ దశలో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేక కొంతకాలం సహకరించాలంటూ బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్ అర్థించారు. ఆ తర్వాత తన ఇంటిని తాకట్టు పెట్టి జీతాలు చెల్లించారు. మరోవైపు, కంపెనీని పలు కోర్టు కేసులు చుట్టుముట్టాయి. అటు ఆదాయం తీవ్రంగా పడిపోయి ఇటు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి చేరుకున్న బైజూస్ కంపెనీ వాల్యూను హెచ్ఎస్ బీసీ సున్నాగా ప్రకటించింది. కంపెనీల ఆర్థిక స్థితిగతులను పరిశీలించి హెచ్ఎస్ బీసీ వాటికి రేటింగ్స్ ఇస్తుంది. తాజాగా హెచ్ఎస్ బీసీ విడుదల చేసిన ఓ నివేదికలో బైజూస్ కంపెనీకి నెగెటివ్ రేటింగ్ ఇచ్చింది.

# టీసీఎస్‌కు భారీ షాక్.. రూ.1600 కోట్ల జరిమానా!

**విశ్వంభర, ఢిల్లీ:** వాణిజ్య రహస్యాలను బయట పెట్టిందన్న కేసులో ప్రముఖ ఐటీ సేవల సంస్థ, మార్కెట్ విలువ పరంగా భారత్‌లో నంబర్ వన్ ఐటీ కంపెనీ టీసీఎస్‌కు అమెరికా కోర్టు షాక్ ఇచ్చింది. భారీగా పెనాల్టీ విధిస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. తమ వ్యాపార రహస్యాల్ని బయటపెట్టిందన్న ఆరోపణలతో కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ ప్రస్తుతం ఇది డీఎస్‌సీ టెక్నాలజీ కంపెనీగా మారింది) టీసీఎస్‌పై కేసు వేసింది. దీనిపైనే అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు టీసీఎస్‌కు ప్రతికూలంగా తీర్పును ఇచ్చింది. మొత్తంగా 194.2 మిలియన్ డాలర్లు .. భారత కరెన్సీలో ఇది రూ. 1600 కోట్లు చెల్లించాలని పేర్కొంది. ఈ విషయాన్ని టీసీఎస్ తన ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ మేరకు జూన్ 14న కోర్టు నుంచి ఉత్తర్వులు అందుకున్నట్లు వెల్లడించింది. అయితే ఇక్కడే మరో కీలక ప్రకటన చేసింది. ఈ తీర్పు తమ ఆర్థిక కార్యకలాపాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపించదని వివరించింది. ఈ చట్టపర సవాళ్లను పరిష్కరించేందుకు అవసరమైన చర్యల్ని తీసుకున్నట్లు తెలిపింది. ఇదే సమయంలో ఈ తీర్పును సవాలు చేసేందుకు సిద్ధమైంది కంపెనీ. తమ వైపు కూడా ఈ విషయంలో బలమైన వాదనలు ఉన్నాయని భావిస్తోంది కంపెనీ. రివ్యూ పిటిషన్ లేదా అప్పీల్‌కు వెళ్లాలని యోచిస్తోంది. మరోవైపు దేశంలో పలువురు ఫ్రెషర్లకు ఉద్యోగాలు ఆఫర్ చేసి.. ఇంతవరకు ఆఫీసులకు పిలవలేదని భారత దిగ్గజ ఐటీ సంస్థలు ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. వీటిల్లో విప్రో, జెన్సర్, ఇన్ఫోసిస్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ సహా టీసీఎస్ కూడా ఉంది. మొత్తంగా గత రెండేళ్ల కాలంలో దాదాపు 10 వేల మందికిపైగా ఫ్రెషర్లకు ఈ సంస్థలు ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. ఇంకా ఉద్యోగాలకు తీసుకోలేదని తెలిసింది. ఈ విషయం గురించి ఐటీ ఎంప్లాయీస్ యూనియన్ నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ చెప్పింది.




# మరో మైలురాయి దాటిన టాటా మోటార్స్

**విశ్వంభర, ఢిల్లీ:** టాటా మోటార్స్ సబ్ 4 మీటర్ కంపాక్ట్ ఎస్‌యూవీ టాటా నెక్సాన్ మరో మైలురాయిని చేరుకున్నది. ఇప్పటి వరకూ ఏడు లక్షల యూనిట్లు విక్రయించింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా టాటా మోటార్స్ డీలర్లు, షోరూమ్‌ల వద్ద ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా నెక్సాన్ (మోడల్, వేరియంట్ ఆధారంగా) కార్లను బుక్ చేసుకుని డెలివరీ కోసం వేచి చూస్తున్న వారికి రూ.లక్ష వరకూ బెనిఫిట్లు కల్పిస్తున్నది. ఈ బెనిఫిట్లు ఈ నెలాఖరు వరకూ కార్లు బుక్ చేసుకున్న వారికీ వర్తిస్తాయి. టాటా నెక్సాన్ నాలుగు వేరియంట్లు - స్మార్ట్, ప్యూర్, క్రియేటివ్, ఫియర్‌లెస్ వేరియంట్లలో లభిస్తుంది. టాటా నెక్సాన్ డార్క్ ఎడిషన్ వర్షన్ మోడల్ క్రియేటివ్, ఫియర్‌లెస్ వేరియంట్లలో అందుబాటులో ఉంటుంది. కస్టమర్లకు టాటా నెక్సన్ కారు ఏడు రంగుల్లో అందుబాటులో ఉంటుంది. టాటా నెక్సాన్ కారు రెండు ఇంజిన్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. 1.2 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ల డీజిల్ ఇంజిన్ ఆప్షన్లలో లభిస్తుంది. 1.2 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్ గరిష్టంగా 118 బీహెచ్పీ విద్యుత్, 170 ఎన్ఎం టార్క్ వెలువరించడంతోపాటు 5స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 6స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 7స్పీడ్ డ్యుయల్ క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. డీజిల్ ఇంజిన్ గరిష్టంగా 113 బీహెచ్పీ విద్యుత్, 260 ఎన్ఎం టార్క్ వెలువరించడంతోపాటు 6స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 6స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో లభిస్తుంది. 2017 సెప్టెంబర్ 21న తొలిసారి టాటా నెక్సాన్ కారును భారత్ మార్కెట్‌లో ఆవిష్కరించారు.




# ఐపీఓకు వెళ్లేందుకు హ్యుండాయ్ సిద్ధం!




**విశ్వంభర, ముంబై:** దక్షిణ కొరియా ఆటో మేజర్ హ్యుండాయ్ మోటార్ ఇండియా ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వెళ్లేందుకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా 300 కోట్ల డాలర్ల ( సుమారు రూ.25 వేల కోట్లు) నిధుల సేకరణ కోసం స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ'కి ముసాయిదా పత్రాలు సమర్పించింది. హ్యుండాయ్ ఐపీఓకు 'సెబీ' ఆమోద ముద్ర వేస్తే.. ఐపీఓ ద్వారా రూ.21 వేల కోట్ల పై చిలుకు నిధులు సమీకరించిన ఎల్ఐసీ ఐపీఓను అధిగమిస్తుందని భావిస్తున్నారు. దీనికి సెబీ నుంచి ఆమోదం లభిస్తే, ఇప్పటి వరకు రూ.21,000 కోట్లతో ఎల్ఐసీ ఐపీఓ దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా ఉండగా, ఇప్పుడు హ్యుండాయ్ దాని స్థానాన్ని భర్తీ చేస్తుంది. కంపెనీ ఒక్కొక్కటి రూ.10 ముఖ విలువ కలిగిన 14,21,94,700 ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. దీని వలన కంపెనీ విజిబిలిటీ, బ్రాండ్ ఇమేజ్ మరింత మెరుగవుతుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. హ్యుండాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికుల విక్రయాల పరిమాణంలో మారుతి సుజుకి తర్వాత భారతదేశంలో రెండవ అతిపెద్ద కార్ల తయారీ సంస్థగా నిలిచింది. మేలో, హ్యుండాయ్ మోటార్ ఇండియా మొత్తం అమ్మకాలలో 63,551 యూనిట్లతో సంవత్సరానికి ఏడు శాతం వృద్ధిని సాధించింది. మార్కెట్ వర్గాలు పేర్కొన్న దాని ప్రకారం, హ్యుండాయ్ ఇండియా విభాగం ఎఫ్‌వై 23 రూ. 60,000 కోట్ల ఆదాయం, రూ. 4,653 కోట్ల లాభాలను నివేదించింది. 2023లో అత్యధిక దేశీయ విక్రయాల ఆరు లక్షల మార్కును హ్యుండాయ్ దాటింది. ఐ20, వెర్నా, క్రెటా, ఆరా, టక్సన్ భారత మార్కెట్లో కంపెనీకి చెందిన కొన్ని కార్ మోడల్‌లు. కంపెనీ 1998లో ఇండియాలో తన మొదటి కర్మాగారాన్ని 2008లో రెండోదాన్ని స్థాపించింది.

# మాస్క్‌కు బంపర్ ఆఫర్!

**విశ్వంభర, ఢిల్లీ:** టెస్లా సీఈవో ఎలోన్ మస్క్ జాక్ పాట్ కొట్టేశారు. రూ.4.5లక్షల కోట్లు (56 బిలియన్ డాలర్లు) పారితోషికం ఇచ్చేందుకు ఆ సంస్థ వాటాదారులు మస్క్‌కు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో ఆనందానికి అవధుల్లేని మస్క్ తన డ్యాన్స్‌తో సందడి చేశారు. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో జరిగిన టెస్లా వార్షిక సమావేశంలో వాటా దారులు మస్క్‌కు 56 బిలియన్ డాలర్ల భారీ వేతనం ఇవ్వాలా? వద్ద అన్న అంశంపై ఓటింగ్ జరిగింది. ప్రాథమిక ఓట్ల ఫలితాల ఆధారంగా మస్క్‌కు 56 బిలియన్ డాలర్ల పారితోషికం ఇచ్చేలా పెట్టుబడి దారులు మద్దతు ఇచ్చారని కార్పొరేట్ సెక్రటరీ బ్రాండన్ ఎర్‌హార్ట్ తెలిపారు. ఎలోన్ మస్క్ 2018లో అన్ని రకాల ప్రయోజనాలు కలిపి 55 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.4.5 లక్షల కోట్లు) వార్షిక వేతనం అందుకున్నారు. కార్పొరేట్ చరిత్రలో ఇదే అత్యధిక పారితోషికం. దీంతో ఆయన ప్రపంచ కుబేరుల్లో ఒకడిగా నిలిచారు. అయితే, మస్క్‌కు అధికంగా చెల్లించారంటూ వాటాదారుల్లో ఒకరైన రిచర్డ్ టోర్నెట్టా.. డెలావర్ కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన డెలావర్ కోర్టు ఈ ఏడాది ప్రారంభంలో టెస్లా సీఈవోకి భారీ వేతనాన్ని రద్దు చేస్తూ తీర్పిచ్చారు. తాజాగా, టెస్లా వాటాదారులు మస్క్‌కు అనుకూలంగా ఓటు వేయడంతో ప్రపంచంలో అత్యధిక వేతనం తీసుకుంటున్న సీఈవోల్లో నెంబర్ వన్‌గా కొనసాగుతున్నారు.

విశ్వంభర




# నాని సరిపోదా శనివారం ఎలివేషన్ సాంగ్ అదిరిపోయిందిగా!

- 'గరమ్ గరమ్' లిరికల్ సాంగ్ రిలీజ్
- ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమా

**విశ్వంభర సినిమా:** 'హాయ్ నాన్న' సినిమా తర్వాత నేచురల్ స్టార్ నాని 'సరిపోదా శనివారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే, ఈ సినిమాలో నాని ఎలివేషన్ సాంగ్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'గరమ్ గరమ్ గరం గరం యముడయో.. సహనాల శివుడాయో.. నరం నరం బిగువయో..' అంటూ సాగే ఈ సాంగ్ అదిరిపోయిందంటూ ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు. యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతున్న ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ జేక్స్ బిజోయ్ బాణీలకు భరద్వాజ్ పాత్రుడు సాహిత్యం అందించారు. ఈ హీరో ఎలివేషన్ సాంగ్‌ను విశాల్ దద్లానీ పాడారు. డీవీవీ ఎంటర్టయిన్ మెంట్ బ్యానర్ పై విలక్షణమైన కథతో తెరకెక్కుతున్న 'సరిపోదా శనివారం' ఆగస్టు 29న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ పాట మొత్తంగా హీరో పాత్రను వర్ణిస్తూ సాగుతుంది. ఈ ఫస్ట్ సింగిల్ ద్వారానే తన మూవీ థీమ్ ఎలాంటిదో డైరెక్టర్ చెప్పే ప్రయత్నం చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ మొత్తానికి నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. ఈ సినిమాలో ప్రియాంక అరుళ్ మోహన్, సాయికుమార్ తదితరులు నటిస్తున్నారు. ఎస్ జే సూర్య ఈ సినిమాలో కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. నానితో పాటు ఎస్ జే సూర్య పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా కనిపించనున్నట్లు ప్రచారచిత్రాల ద్వారా తెలుస్తోంది. చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నకొద్దీ ఈ సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి.

# శృంగారానికి వయసుతో సంబంధం లేదు..

విశ్వంభర సినిమా: ఈ నడుమ హీరోయిన్లు ట్రెండ్ మార్చేస్తున్నారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పటి సినిమాలు దాదాపు బోల్డ్ గానే ఉంటున్నాయి. మారుతున్న ట్రెండ్ కు తగ్గట్టే హీరోయిన్లు కూడా మారిపోతున్నారు. మొన్నటి వరకు లిప్ లాక్ సీన్లు, ఇతర రొమాంటిక్ సీన్లు చేయని వారు కూడా ఇప్పుడు అలాంటి వాటిలో నటించేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. తాజాగా సీనియర్ హీరోయిన్ కూడా ఇలాంటి కామెంట్లే చేసింది. ఆమె ఎవరో కాదు హీరోయిన టబు. ఆమె యాభై ఏళ్ల వయసులో కూడా చెక్కు చెదరని అందాలతో కుర్రాళ్లకు వల విసురుతోంది. అయితే ఆమె తాజాగా బోల్డ్ సీన్లు చేయడంపై షాకింగ్ కామెంట్లు చేసింది. కథ డిమాండ్ చేస్తే ఎలాంటి సీన్ లో అయినా సరే నటించేందుకు నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. సినిమా అన్న తర్వాత అన్ని సీన్లు చేయాలి. అది చేయను, ఇది చేయను అంటూ కూర్చుంటే అవకాశాలు రావు. ఒక నటిగా రాణించాలంటే అన్ని సీన్లు చేయాల్సిందే. ఇప్పుడున్న జనరేషన్ లో బోల్డ్ సీన్లు చేస్తేనే ఎక్కువ క్రేజ్ దక్కుతోంది. కాబట్టి అలాంటి సీన్లలో నేను నటించేందుకు అస్సలు వెనకాడను అంటూ చెప్పింది. అయితే ఆమె ఈ వయసులో కూడా అలాంటి సీన్లు చేస్తానని చెప్పడంతో ఆమె ఫ్యాన్స్ అంతా షాక్ అవుతున్నారు.



# అలాంటి సీన్స్ చేయడం చాలా బోర్..

విశ్వంభర, సినిమా: చిన్నారి పెళ్లికూతురు సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది అందాల భామ అవికా గోర్. ఆ సీరియల్ తో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆతర్వాత హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. తొలి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాజ్ తరుణ్ హీరోగా నటించిన ఉయ్యాలజాంపాల సినిమాతో హీరోయిన్ గా మారింది ఈ చిన్నది. తొలి సినిమాతోనే తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఆతర్వాత కూడా వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. కేవలం తెలుగులోనే కాదు హిందీలోనూ నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. అలాగే ఇటీవలే ఓ స్పెషల్ సాంగ్ లోనూ మెరిసింది ఈ వయ్యారి భామ. అంతే కాదు గ్లామర్ గేట్లు ఎత్తేసి కుర్రకారును కవ్విస్తుంది ఈ ముద్దుగుమ్మ. సోషల్ మీడియాలో ఈ బ్యూటీ ఫోటోలకు మంచి క్రేజ్ ఉంటుంది. హాట్ హాట్ ఫొటోలతో హీటు పుట్టిస్తుంది ఈ చిన్నది. ఇదిలా ఉంటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో అవికా మాట్లాడుతూ రొమాంటిక్ సీన్స్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. 1920 అనే ఓ హర్రర్ సినిమా చేసింది ఈ సినిమాలో చాలా రొమాంటిక్ సీన్స్ ఉంటాయి. దేనికి గురించి మాట్లాడుతూ.. శృంగార సన్నివేశాలు సరదాగా ఉంటుందని భావిస్తారు కానీ.. అవి చాలా బోరింగ్ గా ఉంటాయి అని తెలిపింది అవికా అలాగే అలాంటి సీన్స్ చేసేటప్పుడు ఏది అవసరమో అది చేస్తున్నామనే ఫీలింగ్ తప్ప మరొకటి ఉండదు అని చెప్పకొచ్చింది.






# డబుల్ ఇస్మార్ట్ మూవీ రిలీజ్ డేట్ ఫిక్స్

**విశ్వంభర సినిమా:**

హీరో రామ్ పోతినేని 'డబుల్ ఇస్మార్ట్' సినిమా రిలీజ్‌కు సిద్ధమైంది. ఇస్మార్ట్ శంకర్ కు సీక్వెల్‌గా తెరకెక్కిన ఈ సినిమాను ఆగస్టు 15న వరల్డ్ వైడ్ రిలీజ్ చేస్తున్నట్టు ఈరోజు మూవీ యూనిట్ ఎనౌన్స్ చేసింది. డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ డైరెక్ట్ చేసిన ఈ మూవీలో ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఈ సినిమాలో విలన్ రోల్‌లో నటిస్తున్నారు. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'లో కావ్య థాపర్ హీరోయిన్ గా నటిస్తోంది. యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ సినిమాలో అలీ, షయాజీ షిండే, గెటప్ శ్రీను, ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. మణిశర్మ మ్యూజిక్.. శ్యామ్ కె నాయుడు, జియాని జియానెలి ఫొటోగ్రఫీ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన డబుల్ ఇస్మార్ట్ టీజర్ ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఇస్మార్ట్ శంకర్ క్యారెక్టర్‌ను కంటిన్యూ చేస్తూ ఈ సినిమా రూపొంచినట్టు టీజర్ చూస్తే అర్థమవుతోంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

# క్యాన్సర్ రోగులు రక్తదానం చేయవచ్చా?

**విశ్వంభర, ఫీచర్ :** మానవ రక్తానికి ప్రత్యామ్నాయం లేదు.. కనుక రక్తం దానం చేయండి.. ప్రాణదాతలు కండి.. అవును రక్తం దొరకక మన దేశంలో దాదాపు 12,000 మంది చనిపోతున్నారు. సురక్షితమైన రక్తమార్పిడి అందుబాటులో లేనందున రోగులు తరచుగా ఇబ్బందులు పడుతున్నారు. కనుక అవసరం అయిన వారికి రక్తం ఇవ్వడం గొప్ప బహుమతి. అయితే క్యాన్సర్ రోగులు రక్తదానం చేయవచ్చా లేదా అనే విషయంలో వివిధ రకాల అపోహలు, నమ్మకాలు ఉన్నాయి. అటువంటి పరిస్థితిలో ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో నిపుణులు చెబుతున్న అభిప్రాయం ఏమిటో తెలుసుకుందాం..

**రక్తదానం చేయవచ్చా..**

క్యాన్సర్ బాధితులు రక్తదానం చేయాలనే నిర్ణయం అది వారి వ్యక్తిగతమైనది. సాహసోపేతమైనది. అయితే క్యాన్సర్ బాధితులు, క్యాన్సర్ నుంచి కోలుకున్న వారు అందరూ రక్తదానం చేయడానికి అర్హులు కారు అని ఆంకాలజీ , హెమటాలజీ వైద్యులు చెబుతున్నారు.

**ఏ క్యాన్సర్ రోగులు రక్తదానం చేయవచ్చు?**

అయితే క్యాన్సర్ రకం, రోగికి ఇచ్చే చికిత్స ,రోగి ప్రస్తుత పరిస్థితిని బట్టి.. క్యాన్సర్ బాధితులు రక్తదానం చేయడానికి అర్హులా కాదా అనే విషయం నిర్ణయిస్తారు. బేసల్ సెల్ కార్సినోమా అనేది ఓ రకమైన స్కిన్ కాన్సర్ లేదా ఇన్‌సిటు క్యాన్సర్ వంటి క్యాన్సర్



రోగులు విజయవంతమైన చికిత్స తర్వాత రక్తదానం చేయవచ్చు. అదే సమయంలో లుకేమియా లేదా లింఫోమా వంటి క్యాన్సర్ ఉన్న రోగులు సాధారణంగా రక్తదానం చేయడానికి అర్హులుగా పరిగణించబడరు.

**క్యాన్సర్‌ను ఓడించి..**

చికిత్స పూర్తి చేసుకున్న రోగులు కొంత సమయం తర్వాత.. అంటే సాధారణంగా ఒక సంవత్సరం తర్వాత రక్తదానం చేయవచ్చు. దాత మంచి ఆరోగ్యంతో ఉండటం, హిమో గ్లోబిన్ స్థాయి, ఎలాంటి ఇన్ఫెక్షన్ లేకుండా ఉండటం చాలా ముఖ్యం.

**రక్తదానం చేయడం అభినందనీయమైన చర్య..**

అయితే దాత ‌‌‌- - - గ్రహీత ఇద్దరి ఆరోగ్య పరిస్థితి గణన మొదటి స్థానంలో ఉంటుంది. వైద్య రంగంలో రక్తదానం చాలా కీలకమైన భాగంగా మారింది. దీని సహాయంతో శస్త్రచికిత్స, చికిత్స , అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన మద్దతు అందించబడుతుంది. రక్తదానం చేసేందుకు అర్హులైన క్యాన్సర్ బాధితుల సహకారం అమూల్యమైనది. అయితే దాత ఆరోగ్య పరిస్థితి పరిగణ మొదటి స్థానంలో ఉంటుంది..

### మానసిక స్థితిని మెరుగు

చాలా మంది క్యాన్సర్ బాధితులు లేదా క్యాన్సర్ నుంచి కోలుకున్న వారు రక్తదానంలో చేయడం ద్వారా సాధికారతను అనుభవిస్తారు. మానసికంగా మంచి అనుభూతి చెందుతారు. అదనంగా రక్తదానంలో చేయడం వలన తరచుగా ఆరోగ్య పరీక్షలు .. క్యాన్సర్ బాధితుల ఆరోగ్య స్థితిని పర్యవేక్షించడంలో వీలవుతుంది. అంతేకాదు రక్త దానం చేయడం వలన ఏవైనా వ్యాధుల గురించి సకాలంలో సమాచారాన్ని పొందడంలో సహాయపడుతుంది. ఇది మాత్రమే కాదు సమాజానికి ఏదైనా మంచి చేయాలనే భావన క్యాన్సర్ బాధితులకు సమాజంతో కనెక్ట్ అవ్వడానికి సహాయపడుతుంది. ఇది వారి మానసిక స్థితిని మెరుగుపరచడమే కాదు కోలుకోవడానికి కూడా సహాయపడుతుంది.

కనుక రక్త సరఫరా సజావుగా ఉండేలా క్యాన్సర్ బాధితులను నిరంతరం స్క్రీనింగ్ చేయవలసి ఉంటుంది.


# వాతావరణ మార్పులు మెదడు ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయా..?

**విశ్వంభర, ఫీచర్ :**

వాతావరణంలో మార్పులు రావడం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యలు వస్తాయి అని మనకు తెలుసు. కానీ వాతావరణ మార్పులు మెదడుపై ప్రభావం చూపిస్తాయని మీరు ఎప్పుడైనా విన్నారా..? ఉష్ణోగ్రత, తేమ పెరిగేకొద్దీ తీవ్రతరం అయ్యే పరిస్థితులు స్ట్రోక్, మైగ్రేన్లు, మెనింజైటిస్, మూర్ఛ, మల్టిపుల్ స్క్లెరోసిస్, స్కిజోఫ్రెనియా, అల్జీమర్స్ వ్యాధి మరియు పార్కిన్సన్స్ వంటి వాటికి దారితీస్తాయట.

**మెదడు హెచ్చరికలు**

మనం ఎదుర్కొనే పర్యావరణ సవాళ్లను, ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలు మరియు తేమను నిర్వహించడానికి మన మెదడు బాధ్యత వహిస్తుంది, ఉదాహరణకు చెమటను ప్రేరేపించడం, సూర్యుని నుండి నీడలోకి వెళ్లమని చెప్పడం. మన మెదడులోని బిలియన్ల న్యూరాన్‌లలో ప్రతి ఒక్కటి నేర్చుకునే, అడాప్టింగ్ కంప్యూటర్, అనేక ఎలక్ట్రికల్ యాక్టివ్ భాగాలతో ఉంటుంది. ఈ భాగాలలో చాలా వరకు పరిసర ఉష్ణోగ్రతపై ఆధారపడి వేరొక రేటుతో పని చేస్తాయి. ఇరుకైన ఉష్ణోగ్రతల పరిధిలో కలిసి పనిచేసేలా రూపొందించబడ్డాయి. మన శరీరాలు, వాటి అన్ని భాగాలు, సహస్రాబ్దాలుగా మనం స్వీకరించిన ఈ పరిమితుల్లో బాగా పని చేస్తాయి.మానవులు ఆఫ్రికాలో పరిణామం చెందారు. సాధారణంగా 20C నుండి 26C మరియు 20% నుండి 80% తేమ మధ్య సౌకర్యవంతంగా ఉంటారు. మెదడులోని అనేక భాగాలు, వాస్తవానికి, వాటి ఉష్ణోగ్రత పరిధుల పైభాగానికి దగ్గరగా పని చేస్తాయి, అంటే ఉష్ణోగ్రత లేదా తేమలో చిన్న పెరుగుదల అంటే అవి



కలిసి పనిచేయడం మానేస్తాయి. వాతావరణ మార్పులకు సంబంధించిన విపరీతమైన ఉష్ణోగ్రతలు మరియు తేమతో జరుగుతున్నట్లుగా, ఆ పర్యావరణ పరిస్థితులు అలవాటు లేని పరిధులలోకి వేగంగా కదులుతున్నప్పుడు, మన మెదడు మన ఉష్ణోగ్రతను నియంత్రించడానికి కష్టపడుతుంది మరియు సరిగా పనిచేయడం ప్రారంభమవుతుంది. కొన్ని వ్యాధులు ఇప్పటికే చెమటకు అంతరాయం కలిగిస్తాయి, చల్లగా ఉండటానికి లేదా చాలా వేడిగా ఉండటం గురించి మన అవగాహనకు అవసరం. న్యూరోలాజికల్, సైకియాట్రిక్ పరిస్థితులకు చికిత్స చేయడానికి ఉపయోగించే కొన్ని మందులు శరీరం ప్రతిస్పందించే సామర్థ్యాన్ని రాజీ చేయడం ద్వారా సమస్యను మరింత క్లిష్టతరం చేస్తాయి. చెమటను తగ్గించడం లేదా మన మెదడులోని ఉష్ణోగ్రతనియంత్రణ యంత్రాలకు భంగం కలిగించడం.

### మూర్ఛ వ్యాధి, రక్తం గడ్డకట్టే అవకాశం

ఈ ప్రభావాలు హీట్‌వేవ్‌ల వల్ల అధ్వాన్నంగా ఉంటాయి. ఉదాహరణకు, వేడి తరంగాలు నిద్రకు భంగం కలిగిస్తాయి మరియు చెదిరిన నిద్ర మూర్ఛ వంటి పరిస్థితులను మరింత దిగజార్చుతుంది. హీట్‌వేవ్‌లు మెదడులో తప్పగా ఉండే వైరింగ్‌ని మరింత తక్కువగా పని చేస్తాయి, అందుకే మల్టిపుల్ స్కెరోసిస్ ఉన్నవారిలో లక్షణాలు వేడిలో మరింత తీవ్రమవుతాయి. మరియు అధిక ఉష్ణోగ్రతలు హీట్‌వేవ్‌ల సమయంలో డీహైడ్రేషన్ కారణంగా రక్తం మందంగా మరియు గడ్డకట్టే అవకాశం ఉంది, ఇది స్ట్రోక్‌లకు దారితీస్తుంది. కాబట్టి వాతావరణ మార్పు నరాల సంబంధిత వ్యాధులతో చాలా మందిని ప్రభావితం చేస్తుందని స్పష్టంగా తెలుస్తుంది. తరచుగా అనేక రకాలుగా ఉంటుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో, చిత్తవైకల్యం కోసం ఆసుపత్రిలో చేరడం సర్వసాధారణం. మూర్ఛలో మూర్ఛ నియంత్రణ క్షీణించవచ్చు, మల్టిపుల్ స్కెరోసిస్‌లో లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. స్ట్రోక్-సంబంధిత మరణాలతో స్ట్రోక్ సంభవం పెరుగుతుంది. స్కిజోఫ్రెనియా వంటి అనేక సాధారణ మరియు తీవ్రమైన మనోవిక్షేప పరిస్థితులు కూడా అధ్వాన్నంగా ఉన్నాయి మరియు వారి ఆసుపత్రిలో చేరే రేట్లు పెరుగుతాయి. 2003 యూరోపియన్ హీట్‌వేవ్‌లో, దాదాపు 20% అదనపు మరణాలు నరాల సంబంధిత పరిస్థితులతో బాధపడుతున్న వ్యక్తులే.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com